


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 05 బుధవారం మార్చి 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 169

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur




# రష్యాతో దోస్తీ!

- ఉక్రెయిన్‌తో అమెరికా కుస్తీ..సైనిక సాయానికి బ్రేక్
- రష్యాపై ఆంక్షలు ఎత్తివేతకు యోచన
- ఆంక్షలు ఎత్తివేస్తే చమురు ధరలు నేలకు..
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన నిర్ణయం
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కొంత ఊరట

2



**వాషింగ్టన్-నవభూమిబ్యూరో**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలనానికి తెరలేపబోతున్నారా?. అవుననే అంటున్నాయి అంతర్జాతీయ మీడియా కథనాలు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం మొదలైనప్పటి నుండి రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు బహిరంగంగా మద్దతు తెలుపుతూ వస్తున్న ట్రంప్, ఇప్పుడు ఏకంగా రష్యాపై అమెరికా విధించిన ఆంక్షలను ఎత్తివేయడానికి యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇది నిజంగా జరిగితే, ప్రపంచ రాజకీయాల్లో పెను మార్పులు చోటుచేసుకోవచ్చని అటు విశ్లేషకులు భావిస్తున్నారు. రష్యాపై ఆంక్షల తొలగింపునకు ముసాయిదా రెడీ? ట్రంప్ రష్యాపై ఆంక్షలు ఎత్తివేయాలనే ఆలోచన వెనుక ప్రధాన కారణం మాస్కోతో సంబంధాలను మెరుగుపరచుకోవడమేనని తెలుస్తోంది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, ట్రంప్ ఇప్పటికే ఈ దిశగా చర్యలు ప్రారంభించారు. రష్యాకు చెందిన కొన్ని సంస్థలు ,వ్యక్తులపై ఆంక్షలను తొలగించేందుకు ముసాయిదా జాబితాను సిద్ధం చేయాలని వైట్ హౌస్, విదేశీ వ్యవహారాల, ట్రెజరీ మంత్రిత్వ శాఖలను ఆదేశించినట్లు సమాచారం. రాబోయే రోజుల్లో అమెరికా అధికారులు రష్యా ప్రతినిధులతో ఈ అంశంపై చర్చలు జరిపే అవకాశం ఉంది. అంతే కాదు, రష్యా కుబేరులపై (ఒలిగార్క్‌లు) కూడా ఆంక్షలు ఎత్తివేసే యోచనలో ట్రంప్ ఉన్నట్లు తెలుస్తోంది. చమురు ధరలకు బ్రేక్ ? ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య ప్రారంభించిన తర్వాత, అమెరికాతో సహా అనేక పశ్చిమ దేశాలు మాస్కోపై ఆర్థిక ఆంక్షలు విధించాయి. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఉత్పత్తిదారులలో ఒకటైన రష్యాపై ఆంక్షలు విధించడంతో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకాయి. ఇప్పుడు రష్యాపై

# నష్టాల్లో ఎల్ఐసీ?

- 2 నెలల్లో రూ. 1.45 లక్షల కోట్ల సంపద ఆవిరి!
- 2 నెలల్లో స్టాక్ మార్కెట్‌లో ఊహించని పరిస్థితులు
- మార్కెట్ పతనం... ఎల్ఐసీకి దెబ్బ
- దాదాపు 310 కంపెనీలలో ఎల్ఐసీ పెట్టుబడులు

2




**కోల్‌కత్తా-నవభూమిబ్యూరో**

దేశ ప్రజల ఆర్థిక భద్రతకు భరోసాగా నిలిచే లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఈ ఏడాది ప్రారంభం ఊహించని విధంగా కష్టాలను తెచ్చిపెట్టింది. భారీ సంస్థాగత పెట్టుబడిదారుగా పేరుగాంచిన ఎల్ఐసీ, కేవలం రెండు నెలల్లోనే తన ఈక్విటీ పోర్ట్‌ఫోలియోలో రికార్డు స్థాయిలో నష్టపోయింది. 2025 జనవరి, ఫిబ్రవరి నెలల్లో స్టాక్ మార్కెట్‌లో నెలకొన్న ఊహించని పరిస్థితుల కారణంగా ఏకంగా రూ. 1.45 లక్షల కోట్ల సంపదను కోల్పోయింది. గత ఏడాది డిసెంబర్ నాటికి ఎల్ఐసీ ఈక్విటీ పోర్ట్‌ఫోలియో విలువ అక్షరాలా రూ. 14.9 లక్షల కోట్లు. కానీ ఫిబ్రవరి నెల ముగిసేసరికి ఆ మొత్తం కాస్తా రూ. 13.4 లక్షలకు పడిపోయింది. అంటే కళ్ల ముందే లక్షల కోట్లు కరిగిపోయాయన్నమాట. ఎల్ఐసీ తన పెట్టుబడుల్లో ఇంతటి భారీ పతనాన్ని చూడటం చాలా అరుదు అని ఆర్థిక నిపుణులు అంటున్నారు. దాదాపు 310 కంపెనీలలో పెట్టుబడులు కలిగిన ఎల్ఐసీ పోర్ట్‌ఫోలియో

# కూటమికే పట్టభద్రుల ఓట్లు!

- 2 గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ క్లీన్ స్వీప్
- 2023లో 3 గ్రాడ్యుయేట్ స్థానాలు కైవసం చేసుకున్న టీడీపీ
- మొత్తం 5 గ్రాడ్యుయేట్ స్థానాలు టీడీపీ ఖాతాలోకే
- ఉమ్మడి గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం నుంచి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం
- కృష్ణా జిల్లా గ్రాడ్యుయేట్స్ కూటమి అభ్యర్థి ఆలపాటి గెలుపు

2





**అమరావతి-నవభూమిబ్యూరో**

గత కొన్నేళ్లలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా టీడీపీ జోరు మామూలుగా ఉండడంలేదు. 2023లో మూడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగితే... మూడు స్థానాలు టీడీపీనే కైవసం చేసుకుంది. ఇప్పుడు, తాజాగా రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగితే ఆ రెండింటినీ కూడా టీడీపీనే చేజిక్కించుకుంది. దాంతో రాష్ట్రంలోని ఐదు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను సైకిల్ క్లీన్ స్వీప్ చేసింది. తూర్పు గోదావరి-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం, ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ స్థానాలకు ఫిబ్రవరి 27న ఎన్నికలు జరగ్గా... నిన్న ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ నెగ్గారు. ఆయన 82,320 ఓట్ల భారీ మెజారిటీతో విజయభేరి మోగించారు. ఏడో రౌండ్ కల్లా ఆయన విజయానికి అవసరమైన ఓట్లను పొందారు. ఉమ్మడి గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం నుంచి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం 71,063 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు. ఏడో రౌండ్ లెక్కింపు పూర్తయ్యేసరికి విజయానికి కావాల్సిన 51 శాతం ఓట్లను ఆయన సాధించారు. అంతకుముందు... 2023లో ఉత్తరాంధ్ర

# నిరుద్యోగులకు శుభవార్త

- ఏపీలో నిరుద్యోగులకు వయోపరిమితి పెంపుదల
- యూనిఫామ్ ఉద్యోగాలకు ప్రస్తుతం ఉన్న 34 ఏళ్ల వయో పరిమితిని 42 ఏళ్లకు పెంపుదల
- నాన్ యూనిఫామ్ ఉద్యోగాలకు ప్రస్తుతం ఉన్న వయో పరిమితిని రెండేళ్ల పాటు పెంపు
- ప్రస్తుత ఉద్యోగాల భర్తీలో ఇది వర్తించదు..కొత్త ఉద్యోగాలకే వర్తింపు

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు కూటమి సర్కార్ అదిరిపోయే వార్త చెప్పింది. ముఖ్యంగా గత కొన్నేళ్లుగా ఉద్యోగ నోటిఫికేషన్లు లేక, వయస్సు మీరిపోతున్న వారికి ఊరట కల్పిస్తూ కూటమి సర్కార్ ఇవాళ కీలక ప్రకటన చేసింది. దీని ప్రకారం రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వారికి వయో పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. రెండు కేటగిరీల్లో ఇలా వయో పరిమితిని పెంచారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న యూనిఫామ్, నాన్-యూనిఫామ్ కేటగిరీ ఉద్యోగాలకు వయో పరిమితుల్ని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం యూనిఫామ్ ఉద్యోగాలకు ప్రస్తుతం ఉన్న 34 ఏళ్ల వయో పరిమితిని 42 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే నాన్ యూనిఫామ్ ఉద్యోగాలకు ప్రస్తుతం ఉన్న వయో పరిమితిని రెండేళ్ల పాటు పెంచారు. తద్వారా రెండు కేటగిరీల్లో దరఖాస్తు చేసుకునే నిరుద్యోగులకు ప్రయోజనం లభించనుంది. %మిగతా% అయితే ప్రభుత్వం ఇక్కడ ఓ మెలిక పెట్టింది. ఇప్పటికిప్పుడు భర్తీ చేసే ఉద్యోగాలకు ఈ వయో పరిమితి వర్తించకుండా వాయిదా వేసింది. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి వెలువడే ఉద్యోగ నోటిఫికేషన్లకు ఈ వయో పరిమితి పెంపు వర్తిస్తుందని ప్రభుత్వం తెలిపింది. దీంతో సెప్టెంబర్ నుంచి వచ్చే ఉద్యోగ ప్రకటనలకు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ఈ పెంపు వర్తించబోతోంది. మిగతా వారికి మాత్రం ప్రస్తుతం ఉన్న వయో పరిమితి యథాతథంగా ఉండబోతోంది. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చి విస్మరించింది. అయితే సచివాలయ, వాలంటీర్ ఉద్యోగాలను భారీ ఎత్తున భర్తీ చేసింది. మిగతా ఉద్యోగాలు రాకపోవడంతో నిరుద్యోగులు అసంతృప్తిగా ఉన్నారు. దీంతో కూటమి పార్టీలు ఎన్నికల్లో తమకు అధికారమిస్తే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల

# త్వరలో కొత్త రేషన్ కార్డుల జారీ

- కొత్త రేషన్ కార్డుల జారీకి ముహూర్తం ఖరారు..
- కొత్త కార్డులపై సీఎం రేవంత్,మంత్రి ఉత్తమ్ పోటోలు
- ఇక రేషన్ కార్డుపై ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు
- కొత్త వారితో పాటు పాతవారికి కూడా కొత్తకార్డులు
- లేత నీలిరంగులో రేషన్ కార్డులు రూపొందించాలని సీఎం ఆదేశం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న తెలంగాణ వాసులకు రేవంత్ రెడ్డి సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ఉగాది నాటి నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించింది. ఆ క్రమంలో కొత్త రేషన్ కార్డు నమూనాను సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ఫైనల్ చేశారు. లేత నీలి రంగులో ఈ కొత్త రేషన్ కార్డును తయారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. అలాగే రేషన్ కార్డుపై సీఎం రేవంత్ రెడ్డితోపాటు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు ఉండే విధంగా రేషన్ కార్డు నమూనాని ఖారారు చేశారు.

ఇక రేషన్ కార్డుపై ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు ఇప్పటికే రేషన్ కార్డులు ఉన్న వారికి కూడా కొత్త కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 80 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వారందరికీ కూడా కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని సీఎం రేవంత్ ప్రభుత్వం ఆదేశించారు.

ఇంకోవైపు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలంటూ ఇప్పటికే ప్రజలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో ప్రజలంతా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకొనేందుకు మీ సేవలను క్యూ కట్టారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకానికి రేషన్ కార్డు తప్పని సరి కావడంతో.. వీటి కోసం దరఖాస్తు చేసుకొనే వారి సంఖ్య పెరుగుతోంది.

అదీకాక ఇటీవల తెలంగాణ ప్రభుత్వం కులగణన సర్వే చేపట్టింది. ఆ సర్వేలో సైతం కుటుంబ సభ్యుల ఆదాయం, ఇతర వనరులకు సంబంధించి కీలక సమాచారాన్ని నమోదు చేసింది. దీంతో రాష్ట్రంలోని ప్రజల

# పాకిస్థాన్ పసిడిమయం..

- సింధునది ప్రాంతంలో దొరికిన బంగారు నిక్షేపం
- పంజాబ్ ప్రావిన్స్‌లోని అటాక్ జిల్లాలో బంగారు గని
- రూ.80,000 కోట్ల వరకు ఉంటుందని తాజా అంచనా
- డిసెంబర్ 2024 నాటికి దేశ బంగారు నిల్వలు 5.43 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ నివేదిక

2



**ఇస్లామాబాద్-నవభూమిబ్యూరో**

దాయాది దేశం పాకిస్థాన్ తన చరిత్రలో ఎన్నో తప్పులు చేసి ఆర్థికంగా కుదేలైనప్పటికీ.. ప్రస్తుతం అదృష్టం తగిలింది. పొరుగు దేశాల్లో ఉగ్రవాదానికి కోట్లు ఖర్చుపెట్టి అధోగతిపాలైన ఆ దేశానికి ప్రస్తుతం బంగారం కొండ దొరికింది. వివరాల్లోకి వెళితే పాకిస్థాన్ ఎక్కువగా వ్యవసాయంపైనే ఆధారపడే దేశం. ప్రస్తుతం దేశం ఆర్థికంగా సంక్షోభంలో నిలుస్తూ భారీ అప్పుల ఊబిలో కూరుకుపోయింది. అధిక ద్రవ్యోల్బణంతో పాటు క్షీణించిన కరెన్సీ విలువతో పాటు రాజకీయంగా అస్థిర వాతావరణంతో కూడుకున్న దేశానికి ప్రస్తుతం భారీగా బంగారు నిక్షేపాలు దొరికినట్లు వెల్లడైంది. దీంతో అప్పుల ఊబిలో ఉన్న దేశానికి భారీ ఊరట లభించిందని ఆర్థిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు. పాకిస్థాన్ సింధు నదిలో అపారమైన బంగారు నిల్వలను కనుగొన్నట్లు, దీని విలువ దాదాపు రూ. 80,000 కోట్ల వరకు ఉంటుందని తాజాగా నివేదించబడింది. పంజాబ్ ప్రావిన్స్‌లోని అటాక్ జిల్లాలో ప్రభుత్వం నియమించిన సర్వే ద్వారా బంగారు నిల్వలను కనుగొన్నట్లు వెల్లడైంది. ఈ పసిడి నిల్వలు వెలికితీత ప్రణాళికలను ప్రారంభించాయి. ఈ మైనింగ్ ప్రాజెక్టుకు ప్రభుత్వ యాజమాన్యంలోని నేషనల్ ఇంజనీరింగ్ సర్వీసెస్ పాకిస్తాన్, పంజాబ్ గనులు ఖనిజాల శాఖ నాయకత్వం వహిస్తాయని తెలుస్తోంది. అటాక్ జిల్లాలోని ఇండస్ నది వెంబడి 9 ప్లేసర్ గోల్డ్ బ్లాక్‌ల కోసం బిడ్డింగ్ పత్రాలు, లావాదేవీ సలహా సేవలను సిద్ధం చేయడానికి కన్సల్టెన్సీ సేవలు ప్రారంభమయ్యాయి. వాస్తవానికి సింధు నది భారతదేశంలోని హిమాలయాల నుంచి బంగారు నిక్షేపాలను కలిగి ఉందని సూచించిన భూగర్భ శాస్త్రవేత్తలను నివేదిక

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో సుప్రీం నోటీసులు

- అసెంబ్లీ సెక్రటరీ, ఈసీకి సుప్రీం నోటీసులు
- మార్చి 22లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశం
- తదుపరి విచారణ మార్చి 25కి వాయిదా

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

పార్టీ ఫిరాయించి కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్ ను ఈరోజు సుప్రీంకోర్టు విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ అసెంబ్లీ సెక్రటరీ, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. మార్చి 22లోగా నోటీసులకు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 25కి వాయిదా వేసింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ ధర్మాసనం ఈ పిటిషన్ ను విచారించింది.

విచారణ సందర్భంగా జస్టిస్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

## మహిళలకు గుడ్‌న్యూస్

- మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు
- 150 మహిళా సమాఖ్యలకు 150 బస్సులు
- జీఓ జారీ చేసిన రేవంత్‌రెడ్డి సర్కార్

2




**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** అంతర్జాతీయ మహిళ దినోత్సవం మరికొద్ది రోజుల్లో రానుంది. అలాంటి వేళ తెలంగాణ మహిళ సమాఖ్యలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. మహిళా సంఘాలకు స్వయం ఉపాధిలో భాగంగా ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం అందుకు సంబంధించిన జీవోను రేవంత్

## మాజీ మంత్రి విడదల రజనికి బిగుస్తున్న ఉచ్చు

- స్టోన్ క్రషర్ యజమానుల నుంచి రూ. 2.20 కోట్ల వసూళ్లు
- విడదల రజనిని విచారించేందుకు గవర్నర్ అనుమతి కోరిన ఏసీబీ
- ఐపీఎస్ అధికారి జాషువాను విచారించేందుకు సీఎస్ అనుమతి

2



**అమరావతి-నవభూమిబ్యూరో**వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజనికి ఉచ్చు బిగుస్తోంది. పల్నాడు జిల్లా యడ్లపాడులోని శ్రీ లక్ష్మీబాలాజీ స్టోన్ క్రషర్ యజమానులను బెదిరించి రూ. 2.20 కోట్లను వసూలు చేశారన్న అభియోగాలతో ఆమెపై కేసు నమోదుకు రంగం సిద్ధమయింది. విడదల రజనిని విచారించేందుకు అనుమతి కోరుతూ గవర్నర్ కు ఏసీబీ లేఖ రాసింది. గవర్నర్ అనుమతి ఇచ్చిన వెంటనే ఆమెపై కేసు నమోదు చేస్తారు. మరోవైపు ఇదే కేసులో ఐపీఎస్ అధికారి జాషువాను


## మామునూరు ఎయిర్‌పోర్టు వద్ద ఉద్రిక్తత

వరంగల్, మార్చి 4: మామునూరు ఎయిర్‌పోర్టు వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎయిర్ పోర్ట్‌కు భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని అన్నదాతలు మంగళవారం ఉదయం నిరసనకు దిగారు. నక్కలపల్లి రోడ్డు తీసేయవద్దని డిమాండ్ చేస్తున్నారు. తమకు రోడ్డు మార్గం చూపాలని ఆందోళనకు దిగారు రైతులు. ఆందోళనలో భారీగా మహిళలు పాల్గొన్నారు. సమాచారం అందిన వెంటనే మామూనూరు ఎయిర్‌పోర్టు వద్దకు భారీగా పోలీసులు మోహరించారు.



# కొత్త రేషన్ కార్డుల జారీకి ముహూర్తం ఖరారు.. ఎప్పటి నుంచి అంటే..

**హైదరాబాద్-నవభూమి:** రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న తెలంగాణ వాసులకు రేవంత్ రెడ్డి సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ఉగాది నాటి నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించింది. ఆ క్రమంలో కొత్త రేషన్ కార్డు నమూనాను సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం ఫైనల్ చేశారు. లేత నీలి రంగులో ఈ కొత్త రేషన్ కార్డును తయారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. అలాగే రేషన్ కార్డుపై సీఎం రేవంత్ రెడ్డితోపాటు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు ఉండే విధంగా రేషన్ కార్డు నమూనాని ఖరారు చేశారు.ఇక రేషన్ కార్డుపై ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు ఇప్పటికే రేషన్ కార్డులు ఉన్న వారికి కూడా కొత్త కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 80 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వారందరికీ కూడా కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని సీఎం రేవంత్ ప్రభుత్వం ఆదేశించారు.
ఇంకోవైపు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలంటూ ఇప్పటికే ప్రజలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో ప్రజలంతా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకొనేందుకు మీ సేవలను క్యూ కట్టారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకానికి రేషన్ కార్డు తప్పని సరి కావడంతో.. వీటి కోసం దరఖాస్తు చేసుకొనే వారి సంఖ్య పెరుగుతోంది.అదీకాక ఇటీవల తెలంగాణ ప్రభుత్వం కులగణన సర్వే చేపట్టింది. ఆ సర్వేలో సైతం కుటుంబ సభ్యుల ఆదాయం, ఇతర వనరులకు సంబంధించి కీలక సమాచారాన్ని నమోదు చేసింది. దీంతో రాష్ట్రంలోని ప్రజల ఆదాయంపై ప్రభుత్వానికి ఓ నిర్దిష్టమైన సమాచారం ఉంది. దాంతో దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే రేషన్ కార్డు అందించేలా రేవంత్ సర్కార్ చర్యలు చేపట్టింది.



## ఆర్టీసీ బస్సును కూడా వదలని దొంగలు



**హైదరాబాద్-నవభూమి:** ఇటీవల కాలంలో దొంగలు రెచ్చిపోతున్నారు. కంటికి ఏది కనిపిస్తే అది దొంగతనం చేసి.. వాటిని వేరే చోట అమ్మేసుకుం టున్నారు. అవి వారికి ఉపయోగ పడతాయా..? లేదా అనేది ఆలోచించకుండానే దోచు కుం టున్నారు. తాజాగా హైదరాబాద్ లోని దిల్‌సుఖ్ నగర్ బస్టాప్ లో ఓ వింత దొంగతనం చోటు చేసుకుంది. ఆర్టీసీ ప్రయాణంలో టికెట్లు ఆన్ లైన్ లేదా ఆఫ్ లైన్ ద్వారా తీసుకోవచ్చు. డైరెక్ట్ గా బస్సులో యూపీఐ పేమెంట్ విధానం ద్వారా టికెట్ కొనుగోలు చేసే వెసులుబాటును కల్పించింది ఆర్టీసీ. అయితే టికెట్లను జారీ చేయడానికి ప్రతీ బస్సులో టిమ్ మిషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మిషన్ ద్వారానే టికెట్లను జారీ చేస్తారు.అయితే దొంగలకు ఈ మిషన్ పై కన్ను పడింది. డ్రైవర్ వాటిని బస్సులో పెట్టి.. కిందకు వెళ్లడం చూశారు. ప్రయాణికుడిలాగా బస్సు ఎక్కిన దొంగలు వాటిని కొట్టేశారు. ఈ ఘటన దిల్ సుఖ్‌నగర్ లోని హైదరాబాద్ 2 డిపోలో చోటు చేసుకుంది. అసలేం జరిగిందంటే.. సూర్యాపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ నుండి సూర్యాపేటకు బయలుదేరింది. మార్గ మధ్యలో.. దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్ 2 డిపో వద్ద కొద్దిసేపు ఆగింది. ఈ సమయంలో.. బస్సు కండక్టర్ తన టికెట్ మిషన్‌ను సీటుపై ఉంచి.. కంట్రోలర్ చాట్‌లో సంతకం చేయడానికి లోపలికి వెళ్లారు. అయితే.. కండక్టర్ తిరిగి వచ్చేసరికి ఊహించని ఘటన చోటుచేసుకుంది. టిక్కెట్లు జారీ చేసే మిషన్‌తో పాటు అతని మొబైల్ ఫోన్ కూడా అదృశ్యమయ్యాయి.అసలేం జరిగిందో అర్థంకాక.. కండక్టర్ వెంటనే చుట్టుపక్కల వెతికాడు. ఎక్కడా టిమ్ మిషన్ కానీ.. మొబైల్ ఫోన్ కాని కనిపించలేదు. బస్సులో ఉన్న ప్రయాణికులను ప్రశ్నించినా ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో అతడికి ఏం చేయాలో అర్థం కాక.. తక్షణమే మలక్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై స్పందించిన పోలీసులు.. బస్సు నిలిపిన ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించడం ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ దొంగతనం ఒకరు చేశారా.. ఒక ముఠాగా ఏర్పడి చేశారా అనేది తెలియాల్సి ఉంది. గతంలో ఇలాంటి ఘటనలు మరికొన్ని చోటుచేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. బస్సు స్టేషన్‌ల వద్ద జాగ్రత్తగా ఉండాలని ఆర్టీసీ అధికారులూ సిబ్బందికి సూచించారు. ఈ ఘటన మరింత మంది ప్రయాణికులకు, ఆర్టీసీ సిబ్బందికి గుణపాఠం కానుంది. భద్రత చర్యలను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని అధికారులు పేర్కొన్నారు.

## ఓయూ పరిధిలో ఎంబీఏ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

**హైదరాబాద్-నవభూమి:** ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (ఈవినింగ్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్మెంట్ %-% ఈవినింగ్) కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

**వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల**

ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి రామ్ రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ రెగ్యులర్ పరీక్ష ఫలితాలతో పాటు డిగ్రీ కోర్సుల సప్లమెంటరీ రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

## ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం.. విద్యార్థుల కోసం హెల్ప్ లైన్ నెంబర్

**హైదరాబాద్-నవభూమి:** ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు బోర్డ్ సర్వం సిద్ధం చేసింది. మొదటి సంవత్సరం పరీక్షలు.. రేపటి నుంచి అంటే.. మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అలాగే ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 6వ తేదీ నుంచి మొదలవనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 9 లక్షల మందికిపైగా విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో అబ్బాయిలు 4,97,528 మంది ఉండగా.. అమ్మాయిలు 4,99,443 మంది ఉన్నారు. వీరి కోసం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1,532 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసింది.మరోవైపు ఇంటర్మీడియట్ పరీక్షలకు ఈసారి కూడా ఒక్క నిమిషం ఆలస్యమనే నిబంధనను ఎత్తివేస్తున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్ పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు అంటే.. ఉదయం 9.05 గంటల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని బోర్డు స్పష్టం చేసింది. పరీక్షా కేంద్రానికి కాస్త ముందుగా చేరుకుంటే ఒత్తిడి, ఆందోళనకు గురయ్యే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయని బోర్డు అధికారులు విద్యార్థులకు సూచించారు. ఇక నిబంధనల ప్రకారం ఉదయం 8.45 గంటల నుంచి 9 గంటల మధ్య.. విద్యార్థులకు ఓఎంఆర్ పత్రాన్ని అందజేస్తారు. వీటిని విద్యార్థులు పూర్తి చేయాల్సి ఉంటుంది.పరీక్షల వేళ.. విద్యార్థుల కోసం బోర్డు కీలక నిర్ణయాలు..
ఈసారి ఇంటర్ హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్ ముద్రించారు. దీనిని స్కాన్ చేస్తే పరీక్షా కేంద్రం లొకేషన్ సులువుగా తెలుసుకోవచ్చు.పరీక్షకు ఒక రోజు ముందు కేంద్రాన్ని పరిశీలిస్తే అన్ని విధాలా మంచిది.ప్రశ్నపత్రంపై సీరియల్ నెంబరు ముద్రిస్తున్నారు. దీంతో ఏ నెంబర్ ఉన్న పేపర్.. ఏ విద్యార్థికి వెళ్తుందో సులువుగా తెలుస్తుంది. ఒకవేళ అది బయటకు వచ్చినా వెంటనే ఏ పరీక్షా కేంద్రం, ఏ విద్యార్థిదనే విషయాన్ని సులభంగా గుర్తించవచ్చు.ఈ పరీక్షల వేళ.. స్మార్ట్ వాచ్‌లతోపాటు అనలాగ్ వాచ్‌లను సైతం నిషేధిస్తున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ సారి పరీక్షల వేళ.. చేతి గడియారాలనూ కూడా అనుమతించడం లేదు.ఇంటర్ బోర్డు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)ని ఏర్పాటు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోని సీసీ కెమెరాలను ఈ కేంద్రంతో అనుసంధానించారు. మొత్తం 75 మంది సిబ్బంది.. ఈ పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించనున్నారు.

## తెలంగాణ మహిళలకు మరో గుడ్‌న్యూస్.. వుమెన్స్ డే వేళ బిగ్ గిఫ్ట్..



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ మహిళలకు రేవంత్ రెడ్డి సర్కార్ మరో శుభవార్త వినిపించింది. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయటమే లక్ష్యమంటూ పదే పదే ఉద్ఘాటిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఈ మేరకు రకరకాల కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా.. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో మహిళా సంఘాలతో పెట్రోల్ బంకులు నడిపించే కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వం.. ఇప్పుడు మరో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. అయితే.. ఇప్పటికే.. రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోన్న రేవంత్ రెడ్డి సర్కార్.. ఇప్పుడు అదే మహిళలను ఆ బస్సులకు ఓనర్లను చేసే కార్యక్రమానికి నడుం బిగించింది.స్వయం ఉపాధిలో భాగంగా మహిళా సంఘాలకు.. ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయించాలని ఇప్పటికే రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయించింది. అయితే.. ఇందుకు సంబంధించి.. మంగళవారం (మార్చి 04న) రోజున ఉత్తర్వులను రేవంత్ రెడ్డి సర్కార్ జారీ చేసింది. కాగా.. ఈ కార్యక్రమంలో తొలి విడతగా 150 మహిళా సమాఖ్యలకు 150 ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయించనున్నట్టు తెలిపింది. ప్రతి నెల ఒక్కో బస్సుకు అద్దె కింద రూ.77,220 ప్రభుత్వం చెల్లించనుంది.
అయితే.. బస్సుల కొనుగోలు కోసం మహిళా సంఘాలకు బ్యాంకు గ్యారంటీని కూడా ప్రభుత్వమే ఇవ్వనుండటం విశేషం. దేశంలోనే తొలిసారిగా మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సులను నడిపించే కార్యక్రమాన్ని రేవంత్ రెడ్డి సర్కార్ మొదలుపెట్టబోతోంది. అయితే.. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా.. సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో నిర్వహించే ప్రత్యేక సభలో.. సీఎం రేవంత్ రెడ్డి ఈ బస్సులను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత మిగిలిన మండల సమాఖ్యలకు 450 ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించనున్నారు.ఇదిలా ఉంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండో రోజునే.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ పథకం వల్ల రాష్ట్రంలోని మహిళలంతా బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. కాగా.. మహిళలకు కేవలం ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం కల్పించటమే కాదు.. ఆ ప్రయాణాలు చేసే బస్సులకు ఓనర్లను చేయాలని రేవంత్ రెడ్డి సర్కార్ సంకల్పించింది. ఈ మేరకు.. మహిళా సంఘాలకు స్వయం ఉపాధిలో భాగంగా ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయించి.. మహిళా దినోత్సవానికి బిగ్ గిఫ్ట్ ఇవ్వనుంది.

## సైరన్ మోగిస్తూ ఫాస్ట్‌గా దూసుకెళ్తున్న అంబులెన్స్.. డౌటొచ్చి ఆపి, లోపల చూస్తే మైండ్ బ్లాక్..!



**హైదరాబాద్-నవభూమి:** రోడ్డు మీద ఎంత ట్రాఫిక్ ఉన్నా సరే.. అంబులెన్స్ సైరన్ వినిపిస్తే చాలు అంతా ఆ వాహనానికి సైడ్ ఇస్తుంటారు. రెడ్ సిగ్నల్ పడినా సరే.. ట్రాఫిక్ పోలీసులు అంబులెన్స్‌ను పంపిస్తారు. ఎందుకంటే.. అంబులెన్స్‌లో ఎవరు ఎలాంటి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారో తెలియదు.. అలాంటి సమయంలో ప్రతి క్షణం ఎంతో విలువైనది. అందుకే.. ఎంతటి కఠినాత్ముడైనా, మరెంత అర్జెంటు పని ఉన్న వ్యక్తయినా.. అంబులెన్స్‌ను మాత్రం సైడ్ ఇచ్చే తీరుతారు. అంతగా అంబులెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తుంటే.. కొంత మంది మాత్రం దాన్ని మిస్ యూజ్ చేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి.ఈరోజు (మార్చి 4వ తేదీ) మధ్యాహ్నం సమయం.. పంజాగుట్ట సిగ్నల్.. పైనుంచి భానుడు భగభగలాడిస్తోన్నా రోడ్డుపై ట్రాఫిక్ మాత్రం ఏమాత్రం తగ్గేదేలే. అదే సమయంలో.. ఓ అంబులెన్స్ సైరన్ వేసుకుని వేగంగా దూసుకొస్తోంది. బైక్‌లా వాహనాల మధ్య నుంచి కట్‌లు కొట్టుకుంటూ ట్రాఫిక్‌ను ఛేదిస్తోంది. అయితే.. ఎందుకో పోలీసులకు ఆ అంబులెన్స్‌ను చూస్తే డౌట్ వచ్చింది. దీంతో.. సమాచారాన్ని తర్వాత సిగ్నల్ వద్ద ఉన్న పోలీసులకు అందజేశారు. దీంతో.. అలెర్ట్ అయిన ట్రాఫిక్ పోలీసులు.. అంబులెన్స్‌ను ఆపారు. పోలీసులు ఏం చేస్తున్నారో అర్థం కాకా.. అక్కడున్న వాహనదారులు, నడకదారులంతా ఆశ్చర్యంతో చూస్తుండిపోయారు. కాగా.. లోపల ఎవరున్నారని డ్రైవర్‌ని పోలీసులు అడిగితే అతను నీళ్లు నమిలాడు. దీంతో.. పోలీసులే స్వయంగా అంబులెన్స్ డోర్ ఓపెన్ చేసి చూశారు. అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూసి.. పోలీసులకు ఒక్కసారిగా మైండ్ బ్లాక్ అయ్యింది. ఆ దృశ్యాన్ని అక్కడే ఉన్న వాహనదారులు కూడా చూసి అవాక్కయ్యారు. నడకదారులు నివ్వెరపోయారు. అంతగా షాక్ అయ్యేలా అందులో ఎవరున్నారనుకుం టున్నారా..? ఎవరూ లేరు.. ఓ పెంపుడు కుక్క ఉంది. అది కూడా ఓ బోనులో బౌ బౌ అంటూ నిక్షేపంగా అరుస్తోంది. ఆ కుక్కను చూసిన పోలీసులు.. డ్రైవర్‌ను నిలదీశారు. ఇంత నిక్షేపంగా ఉన్న కుక్క కోసం.. సైరన్ వేసుకుని, అంత వేగంగా ఎందుకు వెళ్తున్నావని డ్రైవర్‌ను పోలీసులు ప్రశ్నించారు. అప్పటికే షాక్‌లో ఉన్న పోలీసులు.. ఆ డ్రైవర్ చెప్పిన ఆన్సర్‌తో దిమ్మతిరిగిపోయింది.ఆ కుక్క అంబులెన్స్ ఓనర్‌దని.. ఇంట్లో పెంచుకునే కుక్క అని.. ఆ కుక్కకు మియాపూర్‌లోని ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించేందుకు తీసుకెళ్తున్నానని డ్రైవర్ చెప్పటం గమనార్హం. ఆ ఆన్సర్‌తో తీవ్ర ఆగ్రహానికి గురైన పోలీసులు.. కుక్కను తీసుకెళ్తూ సైరన్ ఎందుకు వేశావని.. ఎందుకు అంత స్పీడ్‌గా వెళుతున్నావని గట్టిగా మందలించారు. దీంతో.. డ్రైవర్‌ను నోటి మాట రాలేదు. వెంటనే.. అంబులెన్స్ ఓనర్‌తో పాటు డ్రైవర్‌పై పోలీసులు కేసు పెట్టారు. అంబులెన్స్ సైరన్ దుర్వినియోగంపై కేసు పెట్టిన

## నష్టాల్లో ఎల్‌ఐసీ?

**(1వపేజీ తరువాయి)** ఇంత దారుణంగా పడిపోవడం గతంలో ఎన్నడూ జరగలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌ఐసీ పెట్టుబడులు ఇలా ఒక్కసారిగా పతనమవ్వడానికి ప్రధాన కారణం దేశీయ స్టాక్ మార్కెట్ ఒక్కసారిగా కుప్పకూలడమే. మార్కెట్లో అనిశ్చితి నెలకొనడంతో మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా కంపెనీల షేర్లు అయితే కోలుకోలేని విధంగా పడిపోయాయి. ఎల్‌ఐసీ ఎక్కువగా పెట్టుబడులు పెట్టిన బడా కంపెనీల షేర్లు కూడా భారీగా నష్టపోయాయి. ఏ కంపెనీలు దెబ్బతీశాయి?: ఎల్‌ఐసీ పోర్ట్‌ఫోలియోలో రెండో అతిపెద్ద పెట్టుబడి అయిన ఐటీసీ షేర్లు ఏకంగా 18 శాతం పతనమయ్యాయి. దీంతో ఎల్‌ఐసీకి దాదాపు రూ. 17 వేల కోట్ల నష్టం వాటిల్లింది. టెక్నాలజీ రంగంలో దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ కూడా ఎల్‌ఐసీని నిరాశపరిచాయి. ఈ రెండు కంపెనీల్లో ఎల్‌ఐసీకి భారీగా వాటాలు ఉండగా, షేర్లు పడిపోవడంతో మరో రూ. 18 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. బ్యాంకింగ్ రంగంలోనూ ఎల్‌ఐసీకి ఎదురుదెబ్బ తగిలింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఐసీఐసీఐ బ్యాంకుల్లో పెట్టిన పెట్టుబడులు కూడా భారీగా క్షీణించాయి. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు అయితే ఏకంగా 30 శాతం పైగా పడిపోయి ఎల్‌ఐసీకి నష్టాన్ని పెంచాయి. వీటితో పాటు ఎల్ అండ్ టి, హెచ్‌సీఎల్ టెక్, ఎం అండ్ ఎం, అదానీ పోర్ట్స్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ వంటి అనేక కంపెనీల షేర్లు కూడా ఎల్‌ఐసీని నష్టాల ఊబిలోకి నెట్టాయి.

## టీడీపీ నేతల గెలుపు సంబరాలు

**అమరావతి-నవభూమిబ్యూరో:** ఎన్టీఆర్ భవన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ విజయోత్సవ సభ మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ విజయోత్సవ సభలో సీఎం చంద్రబాబుతోపాటు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు కూటమిలోని పార్టీల కీలక నేతలు సైతం హాజరయ్యారు.
మరోవైపు తాజాగా జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బరిలో నిలిపిన ఇద్దరు అభ్యర్థులు ఘన విజయాన్ని సాధించారు.
అంతేకాదు.. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలైన ఓట్ల షేర్ కంటే.. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలైన ఓట్లు షేర్ భారీగా పెరిగింది. దీంతో ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు.. గత ఎనిమిది నెలల చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వ పాలనకు నిదర్శనంగా నిలిచింది. ఇంకోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఘన విజయం సాధించడంతో టీడీపీ కేంద్ర కార్యాలయంలో సంబరాలు మిన్నంటాయి.

## బొట్టు పెట్టుకున్నాడని విద్యార్థిని చితక్కొట్టిన ప్రిన్సిపల్..

**పెద్దఅంబర్‌పేట-నవభూమి:** స్కూల్‌కు బొట్టుపెట్టుకుని వచ్చాడని విద్యార్థి పట్ల ప్రిన్సిపల్ కర్కశంగా వ్యవహరించాడు. ఎనిమిదో తరగతి విద్యార్థిని చితకబాదాడు. అనంతరం బాత్‌రూంలోకి తీసుకెళ్లి బొట్టుపోయేలా ముఖం కడిగించాడు. హైదరాబాద్‌లోని పెద్దఅంబర్‌పేటలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది.
పెద్ద అంబర్‌పేటలోని క్యాండర్ ఫ్రైన్ సీనియర్ సెకండరీ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి సోమవారం నాడు బొట్టుపెట్టుకుని పాఠశాలకు వెళ్లాడు. ఉదయం ప్రతిజ్ఞ కాగానే.. సదరు విద్యార్థిని గమనించిన ప్రిన్సిపల్ లక్ష్మయ్య తన రూమ్‌కి పిలిపించుకున్నాడు. స్కూల్‌కు ఎందుకు బొట్టు పెట్టుకుని వచ్చావని నిలదీశాడు. కోపంతో విద్యార్థిని చితకబాదాడు. అనంతరం బాత్‌రూంలోకి తీసుకెళ్లి బొట్టు పోయేలా ముఖం కడిగించాడు. ఈ ఘటనతో మనస్తాపానికి గురైన విద్యార్థిని.. సాయంత్రం ఇంటికెళ్లగానే తల్లిదండ్రులకు జరిగింది మొత్తం చెప్పాడు.
ప్రిన్సిపల్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన సదరు విద్యార్థి తల్లిదండ్రులు మంగళవారం ఉదయం స్కూల్‌కు వచ్చి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న హిందూవాహిని సభ్యులు కూడా పాఠశాల వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. బొట్టు పెట్టుకున్నాడనే కారణంతో విద్యార్థిని ఎలా కొడతారని నిలదీశారు. ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని స్కూల్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ప్రిన్సిపల్ వచ్చేవరకు ఆందోళన ఆపేదిలేదని పాఠశాల ప్రతినిధులతో వాగ్వాదానికి దిగారు.

## మందుల ధరల పెరుగుదల.. సుప్రీంకోర్టు ఘాటైన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ-నవభూమి:** అందుబాటు ధరల్లో వైద్య సంరక్షణ, సదుపాయాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే.. ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రోత్సాహకంగా మారిందని విమర్శించింది. ప్రైవేట్ ఆసుపత్రులన్నీ రోగులు, వారి బంధువులతో బలవంతంగా అధిక ధరలతో మందులు కొనుగోలు చేయిస్తున్నాయంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. తమ పార్మసీల నుంచి మందులు కొనుగోలు చేయాలంటూ.. రోగులను బలవంతం చేయకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు.
వీటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తన పిటిషన్‌లో స్పష్టం చేశారు. దీంతో రోగులు దోపిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. అయితే పిటిషనర్ వాదనతో సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకీభవించింది. రోగులకు సూచించిన ఔషధం వేరే పార్మసీలో స్వల్ప ధరకు లభ్యమవుతుంటే.. దానిని తమ పార్మసీలోనే కొనుగోలు చేయాలంటూ ప్రైవేట్ ఆసుపత్రులు రోగులపై ఒత్తిడి తీసుకు రాకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.
సమాజంలోని పేద వర్గాలకు ప్రాణాధార మందులు అందుబాటు ధరల్లో లభించడం కష్టమై పోయిందంటూ వ్యాఖ్యానించింది. పౌరులు ఈ రకమైన దోపిడికి గురి కాకుండా రక్షించేందుకు తగిన మార్గ దర్శకాలను రూపొందించాలంటూ కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

## రష్యాతో దోస్తీ!

ఆంక్షలు ఎత్తివేస్తే, చమురు సరఫరా పెరిగి ధరలు తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కొంత ఊరట కలిగించవచ్చు. ఉక్రెయిన్‌కు సైనిక సహాయం నిలిపివేత ఇదిలా ఉండగా, ట్రంప్ ఇటీవల ఉక్రెయిన్‌కు అమెరికా అందిస్తున్న సైనిక సహాయాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన చమురు ధరల అంశాన్ని కూడా ప్రస్తావించారు. ఐరోపా దేశాలు ఉక్రెయిన్ రక్షణ కోసం కంటే.. రష్యా నుండి చమురు, గ్యాస్ కొనుగోలు చేయడానికే ఎక్కువ మొత్తంలో ఖర్చు చేశాయని పేర్కొన్నారు. ట్రంప్ నిర్ణయంతో కొత్త మలుపు? టంప్ తీసుకుంటున్న ఈ నిర్ణయాలు ప్రపంచ రాజకీయాలను కొత్త మలుపు తిప్పే అవకాశం ఉంది. రష్యాపై ఆంక్షలు ఎత్తివేయడం మరియు ఉక్రెయిన్‌కు సైనిక సహాయం నిలిపివేయడం వంటి చర్యలు అమెరికా విదేశాంగ విధానంలో గణనీయమైన మార్పులకు సంకేతం అని చెప్పవచ్చు. అయితే, ఈ మార్పులు ఎంతవరకు ఫలిస్తాయి, ప్రపంచ శాంతి మరియు భద్రతపై ఎలాంటి ప్రభావం చూపుతాయో కాలమే నిర్ణయించాలి. ప్రస్తుతానికైతే, ట్రంప్ ఆలోచనలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. రష్యా నుంచి వాషింగ్టన్ ఏం ఆశిస్తోంది అయితే, రష్యాపై ఆంక్షలు ఎత్తివేస్తే, అమెరికాకు మాస్కో నుండి ఏం లభిస్తుంది, వాషింగ్టన్ ఏం ఆశిస్తోంది అనే ప్రశ్నలు మాత్రం ఇంకా ప్రశ్నార్థకంగానే ఉన్నాయి. ఆంక్షల ఉపశమనానికి ప్రతిగా ట్రంప్ ప్రభుత్వం రష్యా నుండి ఏదైనా కీలకమైన హామీని కోరుకుంటుందా లేదా అనేది వేచి చూడాలి.

## కూటమికే పట్టభద్రుల ఓట్లు!

**(1వపేజీ తరువాయి)** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి వేపాడ చిరంజీవి... తూర్పు రాయలసీమ (ఉమ్మడి చిత్తూరు-నెల్లూరు-ప్రకాశం) గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా టీడీపీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్... పశ్చిమ రాయలసీమ (కడప-కర్నూలు-అనంతపురం) గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఘనవిజయం సాధించారు. మాజీ సీఎం జగన్ నియోజకవర్గం పులివెందుల కూడా పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పరిధిలోకే వస్తుంది. ఆ నియోజకవర్గంలోనూ భూమిరెడ్డికి గణనీయంగా ఓట్లు పోలయ్యాయి.
అప్పుడు 2023లో మూడు.... ఇప్పుడు 2025లో రెండు... మొత్తం 5 పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు టీడీపీ ఖాతాలో చేరాయి. ఈసారి మరో రికార్డు కూడా నమోదైంది. 2024 సార్వత్రిక ఎన్నికలతో పోల్చితే తాజాగా జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి పడిన ఓట్లు 10 శాతం పెరిగాయి.
**ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు :** రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో కూటమి హవా స్పష్టమైంది. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయం సాధించారు. మొత్తం తొమ్మిది రౌండ్లకు గానూ, మంగళవారం తెల్లవారుజామున 5:50 గంటల సమయంలో చివరి రౌండ్ పూర్తయ్యే సరికి ఆయనకు 82,320 ఓట్ల ఆధిక్యం వచ్చింది. 7వ రౌండ్ ముగిసే సరికి ఆయనకు 1,18,070 ఓట్లు వచ్చాయి. మొత్తం 2,41,873 ఓట్లు పోలవగా, ఏడో రౌండ్ పూర్తయ్యే సరికి 21,577 చెల్లని ఓట్లుగా గుర్తించారు. దీంతో 50 శాతానికి పైగా ఓట్లు సాధించడంతో ఆలపాటిని విజేతగా ప్రకటించారు. ఇక తొమ్మిదో రౌండ్ పూర్తయ్యే సరికి అలపాటికి 1,45,057 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థి లక్ష్మణరావు (3737 ఓట్లు సాధించారు. ఓట్ల లెక్కింపు ముగిసే సరికి ఆలపాటి రాజాకి 82,320 ఓట్ల మెజార్టీ దక్కింది. చెల్లుబాటు అయిన ఓట్లలో 60 శాతం పైగా ఓట్లను అలపాటి సాధించారు.

## మాజీ మంత్రి విడదల రజనికి బిగుస్తున్న ఉచ్చు

**(1వపేజీ తరువాయి)** అనుమతిని తీసుకున్నారు.
విడదల అక్రమ వసూళ్లపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. స్టోన్ క్రషర్ యజమానులను బెదిరించి రూ. 5 కోట్లు డిమాండ్ చేశారని... చివరకు రూ. 2.20 కోట్లు వసూలు చేశారని నివేదికలో పేర్కొంది. ఇందులో రజనికి రూ. 2 కోట్లు, జాషువాకు రూ. 10 లక్షలు, రజని పీఏకు రూ. 10 లక్షలు చెల్లించారని తెలిపింది. దీని ఆధారంగా ఏసీబీ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో కేసు నమోదుకు కావాల్సిన అనుమతులను ఏసీబీ అధికారులు తీసుకుంటున్నారు.

## నిరుద్యోగులకు శుభవార్త

**(1వపేజీ తరువాయి)** కల్పన హామీ ఇచ్చాయి. ఈ క్రమంలో ఉద్యోగాలకు వయో పరిమితి పెంపు ప్రకటన వచ్చిందని భావిస్తున్నారు.

## త్వరలో కొత్త రేషన్ కార్డుల జారీ

**(1వపేజీ తరువాయి)** ఆదాయంపై ప్రభుత్వానికి ఓ నిర్దిష్టమైన సమాచారం ఉంది. దాంతో దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే రేషన్ కార్డు అందించేలా రేవంత్ సర్కార్ చర్యలు చేపట్టింది.
ఈ నేపథ్యంలో మార్చి 30వ తేదీ తెలుగు సంవత్సరాది.. ఉగాది. ఆ రోజున కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియకు సీఎం రేవంత్ రెడ్డి తన స్వహస్తాలతో శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు ఉండాలనే ఓ స్పష్టమైన లక్ష్యంతో రేవంత్ సర్కార్ వడి వడిగా అడుగులు వేస్తోంది.

## సుప్రీం నోటీసులు

**(1వపేజీ తరువాయి)** ప్రజాస్వామ్య విధానాలకు సరైన సమయం అవసరమని వ్యాఖ్యానించారు. మీరు నిర్ణయం తీసుకోవడానికి ఎంత సమయం కావాలో చెప్పాలని అన్నారు. రీజనబుల్ టైమ్ అంటే ప్రస్తుత అసెంబ్లీ కాల పరిమితి ముగిసేంతవరకా? అని ప్రశ్నించారు.


## మహిళలకు గుడ్‌న్యూస్

**(1వపేజీ తరువాయి)** సర్కార్ జారీ చేసింది. తొలి విడతలో 150 మహిళా సమాఖ్యలకు 150 ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయించనున్నారు. ప్రతి నెల ఒక్కో బస్సుకు అద్దె కింద రూ. 77,220 చెల్లించనుంది.ఇక బస్సుల కొనుగోలు కోసం మహిళా సంఘాలకు బ్యాంకు గ్యారంటీ సైతం ప్రభుత్వం ఇవ్వనుంది. దీంతో దేశంలోనే తొలిసారిగా మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సులను నడపనున్నాయి. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం. ఆ రోజు సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్ మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్ని.. ఈ బస్సులను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత మిగిలిన మండల సమాఖ్యలకు 450 ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించనున్నారు.
మరోవైపు సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరిట మహాలక్ష్మీ పథకాన్ని చేపట్టారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. అయితే ఈ పథకం వల్ల రాష్ట్రంలోని మహిళలు.. ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఇక అంతకుముందు కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఉచిత బస్సు ప్రయాణాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.



## వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులకు జనరల్ బోగీలే

**న్యూఢిల్లీ-నవభూమి:** స్లీపర్, ఏసీ బోగీల్లో ప్రయాణం కోసం బెర్త్ రిజర్వు కానటువంటి, వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ప్రయాణికులు జనరల్ బోగీల్లో మాత్రమే ప్రయాణించాలి. వీరు స్లీపర్, ఏసీ బోగీల్లో ప్రయాణించడానికి ఈ టికెట్లు చెల్లవు. ఒకవేళ వెయిటింగ్ లిస్టెడ్ టికెట్లతో స్లీపర్, ఏసీ బోగీల్లో ప్రయాణిస్తే జరిమానా చెల్లించక తప్పదు. ఈ నెల 1 నుంచి అమల్లోకి



వచ్చిన నిబంధనల ప్రకారం, వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ప్రయాణికులు ఆ టికెట్లతో ఏసీ బోగీలో ప్రయాణిస్తే, ఆ రైలు ఎక్కడి నుంచి ప్రారంభమైందో అక్కడి నుంచి తదుపరి స్టేషన్ వరకు టికెట్ ఛార్జీని, రూ.440 ఫైన్‌ను చెల్లించాలి. స్లీపర్ బోగీల్లో ప్రయాణిస్తే, రూ.250 జరిమానాతోపాటు, తదుపరి స్టేషన్ వరకు టికెట్ ఛార్జీని చెల్లించాలి.

# విదేశీ విద్యకి బెస్ట్ కన్సల్టెన్సీలు



**హైదరాబాద్ - నవభూమి:** గ్రాడ్యుయేషన్ వరకు మన దేశంలో చదివినా, ఉన్నత విద్య మాత్రం విదేశాల్లో చదువుకుని కెరీర్‌లో గొప్పగా స్థిరపడాలనేది చాలా మంది విద్యార్థుల కోరిక. దీని వల్ల చాలా ఉపయోగాలు కూడా ఉన్నాయి. కొత్త సంస్కృతులు పరిచయం అవుతాయి, కెరీర్ అవకాశాలు పెరుగుతాయి, నాయకత్వ లక్షణాలు మెరుగవుతాయి. అందుకే మన దేశంలో ప్రతీ సంవత్సరం విదేశాలకు వెళ్లి చదువుకునే విద్యార్థుల సంఖ్య దినదిన ప్రవర్ధమానం అవుతోంది. అయితే ఉన్నత విద్యకు ఏయే దేశాలు- యూనివర్సిటీలు మంచివి, ఎంత ఖర్చు అవుతుంది, వీసా కోసం ఏయే పత్రాలు అవసరం అవుతాయి, ప్రాసెసింగ్ ఎలా చేయించుకోవాలి అనే విషయం చాలా మందికి అవగాహన ఉండదు. విదేశీ విద్యకు వెళ్లాలనుకునే విద్యార్థులకు సహకరించడానికి మన దగ్గర ఫారెన్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలు ఉన్నాయి. వీటిని సంప్రదిస్తే సరైన గైడెన్స్ లభిస్తుంది. తరువాత సులువుగా కావాల్సిన డాక్యుమెంట్స్ రెడీ చేసుకోవచ్చు. కొవిడ్ ముందుతో పోలిస్తే తరువాత విదేశీ విద్యకు వెళ్లే విద్యార్థుల సంఖ్య 52 శాతం పెరిగిందని నివేదికలు చెబుతున్నాయి. 2023-24 విద్యా సంవత్సంలో భారతదేశం నుంచి విదేశాలకు వెళ్లి చదువుకున్న విద్యార్థుల సంఖ్య 8,94,783. ప్రపంచ వ్యాప్తంగా చైనా తరువాత ఉన్నత విద్య కోసం అత్యధికంగా విదేశాలకు వెళుతున్న వారిలో భారతీయులు రెండో స్థానంలో ఉన్నారు. మన విద్యార్థుల ప్రాధాన్యంలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూకేలు వరుసగా ఉన్నాయి. యూఎస్ సిటిజన్‌షిప అండ్ ఇమ్మిగ్రేషన్ నివేదిక ప్రకారం 2023-24 అకడమిక్ ఇయర్‌లో అమెరికాకు వెళ్లిన భారత విద్యార్థుల సంఖ్య 3,37,630. అయితే కెనడా ఇబ్బందుల కారణంగా ఈ విద్యా సంవత్సరం అక్కడికి వెళుతున్న భారత విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఇంత పెద్ద మొత్తంలో విదేశాలకు వెళుతున్న విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న కన్సల్టెన్సీల సేవల పొందుతున్నారు.

**భారతదేశంలో పేరున్న కన్సల్టెన్సీల్లో ఇవికొన్ని...**

**ఐడీపీ ఎడ్యుకేషన్**

ఐదు దశాబ్దాలుగా ఎడ్యుకేషన్ సర్వీసులో ఉన్న పెద్ద సంస్థ ఇది. ఆస్ట్రేలియన్ ఆసియన్ యూనివర్సిటీస్ కో-ఆపరేషన్‌గా మొదలై కాలక్రమంలో 'ఐడీపీ ఎడ్యుకేషన్' పేరు మార్చుకుంది. విదేశీ విద్య టకు సంబంధించి పలు సేవలు అందిస్తుంది. %www.idp.com/india/

**ఇన్ఫినిటీ గ్రూప్**

ఇన్ఫినిటీ గ్రూప్ రెండు దశాబ్దాలకుపైగా ఎడ్యుకేషన్ సర్వీస్‌లో ఉంది. ఈ సెక్టార్‌లో గ్లోబల్ లీడర్‌గా ఉన్న 'ఇన్ఫినిటీ'కి 300 యూనివర్సిటీ పార్టనర్‌షిప్, 2500 గ్లోబల్ పార్ట్‌నర్స్ ఉన్నారు. స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, యూనివర్సిటీ సెలెక్షన్, అప్లికేషన్ అసిస్టెన్స్, వీసా గైడెన్స్, ప్రీ డిపార్చర్ ఓరియంటేషన్, ఎండ్ టు ఎండ్ అసిస్టెన్స్‌లో ఉంటుంది. %https://infinitegroup.global/

**వై యాక్సిస్**

భారతదేశంలోని పేరొందిన నమ్మకమైన స్టడీ అబ్రాడ్, ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీల్లో 'వై యాక్సిస్' ఒకటి. 25 సంవత్సరాల పైన ఈ సంస్థ కన్సల్టెన్సీ సర్వీసులో ఉంది. స్టడీ అబ్రాడ్, ఇమ్మిగ్రేషన్ కౌన్సెలింగ్, వీసా అసిస్టెన్స్, కెరీర్ కౌన్సెలింగ్, లాంగ్వేజ్ ట్రైనింగ్‌లో 'వై యాక్సిస్' సహాయం చేస్తుంది. https://www.yaxis.com/

**ఎడ్విన్ ఇంటర్నేషనల్**

'ఎడ్విన్ ఇంటర్నేషనల్' మూడు దశాబ్దాలకుపైగా ఎడ్యుకేషన్ సర్వీస్‌లో ఉంది. దేశంలోని పాత కన్సల్టెన్సీల్లో ఇది ఒకటి. స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, యూనివర్సిటీ సెలెక్షన్, అప్లికేషన్ అసిస్టెన్స్, వీసా గైడెన్స్, ప్రి డిపార్చర్ ఓరియంటేషన్ నిర్వహిస్తుంది. స్కాలర్‌షిప్స్, ఫైనాన్సియల్ ఎయిడ్‌కు సంబంధించిన సమాచారం కూడా ఇస్తుంది. https://www.edwisein-ternational.com/

**'మాన్య గ్రూప్'(ద ప్రిన్స్‌టన్ రివ్యూ ఇండియా)**

దేశంలోని ఎస్టాబ్లిష్డ్ కన్సల్టెన్సీలో 'మాన్య గ్రూప్' ఒకటి. రెండు దశాబ్దాలకు పైగా ఎడ్యుకేషన్ సర్వీసెసలో రెప్యూటెడ్ గ్రూప్ ఇది. పలు ఇంటర్నేషనల్ యూనివర్సిటీలు, సంస్థలతో పార్ట్‌నర్‌షిప్ కొనసాగిస్తోంది. స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, శాట్/ఏసీటీ/జీఆర్‌ఈ/జీమాట్/ ఐఈఎల్‌టీఎస్/ టోఫెల్ ప్రిపరేషన్, లాంగ్వేజ్ ట్రైనింగ్, కెరీర్ కౌన్సెలింగ్ తదితరాలు నిర్వహిస్తుంది. https://www.manya-group.com/

**కెరీర్ మాట్రిక్స్**

ఒకటిన్నర దశాబ్దం పైగా ఎడ్యుకేషన్ సర్వీసెసలో ఉన్న సంస్థ ఇది. పలు యూనివర్సిటీలు, సంస్థలతో పార్ట్‌నర్‌షిప్ ఉంది స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, యూనివర్సిటీ సెలెక్షన్, అప్లికేషన్ అసిస్టెన్స్, వీసా గైడెన్స్, ప్రీ డిపార్చర్ ఓరియంటేషన్ నిర్వహిస్తుంది.

## ఆన్‌లైన్ కంటెంట్‌ను క్రమబద్ధీకరించాలి
## కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన



**న్యూఢిల్లీ-నవభూమి:** సామాజిక మాధ్యమాల్లో వచ్చే కంటెంట్‌ను క్రమబద్ధీకరించేందుకు ఓ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సోమవారం చెప్పింది. అయితే, ఈ కంటెంట్‌పై సెన్సార్‌షిప్ ఉండకూడదని తెలిపింది. వాక్ స్వాతంత్ర్యం హక్కుకు విఘాతం కలుగకూడదని స్పష్టం చేసింది. ఈ రంగంతో సంబంధం ఉన్నవారందరి సలహాలు, అభిప్రాయాలను తీసుకోవాలని సూచించింది. పాడ్‌కాస్టర్ రణ్‌వీర్ అల్హాబాదియా కేసు విచారణ సందర్భంగా ఈ ఆదేశాలిచ్చింది.

## సీఎంపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసు




**న్యూఢిల్లీ-నవభూమి:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ పై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇవ్వనున్నట్టు కాంగ్రెస్ పార్టీ మంగళవారంనాడు తెలిపింది. మహారాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ధనంజయ్ ముండే రాజీనామాను ముఖ్యమంత్రి ఆమోదించిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా మంత్రి రాజీనామా వ్యవహారాన్ని సభ ముందుకు తీసుకురావాల్సి ఉండగా సీఎం అందుకు భిన్నంగా వ్యవహరించారని కాంగ్రెస్ ఆరోపించింది. రాజీనామాపై సీఎం తన నిర్ణయాన్ని ప్రకటించడానికి ముందు సభ దృష్టికి తీసుకురావాల్సి ఉంటుందని, అలాకాకుండా మీడియా ముందు మంత్రి రాజీనామాపై ప్రకటన చేయడం సభా హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపింది. బీడ్ సర్పంచ్ సంతోష్ దేశ్‌ముఖ్ హత్య కేసులో ధనంజయ్ ముండే సన్నిహితుడు వాల్మీక్ కరద్ పేరు చేర్చడంతో మంత్రి మంగళవారం నాడు తన రాజీనామాను సమర్పించారు. ఆయన రాజీనామాను వెంటనే సీఎం ఆమోదించారు. ఈ విషయాన్ని దేవేంద్ర ఫడ్నవిస్ మీడి యాకు వెల్లడించారు. ధనంజయ్ ముండే రాజీనామాను అంగీకరించి తదుపరి చర్యల కోసం గవర్నర్‌కు పంపినట్టు చెప్పారు. బీడ్ జిల్లా పార్లి నియోజకవర్గానికి ఎన్‌సీపీ ఎమ్మెల్యేగా ముండే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఫడ్నవిస్ ప్రభుత్వంలో ఫుడ్ అండ్ సప్లయిస్ మంత్రిగా ఉన్నారు. ఇంతకుముందు ఆయన బీడ్ గార్డియన్ మినిస్టర్‌గా ఉన్నారు. ప్రస్తుతం పుణెతో పాటు బీడ్ జిల్లా గార్డియన్ మంత్రిగా ఎన్‌సీపీ చీఫ్ అజిత్ పవార్ ఉన్నారు. విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం, దేవేంద్ర ఫడ్నవిస్‌ను అజిత్ పవార్ సోమవారం రాత్రి కలుసుకున్నారు. దేశ్‌ముఖ్ హత్య కేసులో కరద్‌పై సీఐడీ ఛార్జిషీటు దాఖలు చేయడం, మరో రెండు కేసుల్లోనూ ఆయన ప్రమేయం ఉన్న విషయాన్ని అజిత్ పవార్ సీఎం దృష్టికి తెచ్చారు. ఈ క్రమలో ధనంజయ్ ముండేను రాజీనామా చేయాల్సిందిగా ఫడ్నవిస్ కోరినట్టు తెలుస్తోంది.

## బర్డ్‌ఫ్లూపై కలెక్టర్ ఏమన్నారంటే..



**బెంగళూరు - నవభూమి:** ఏవియస్ ఇన్‌ఫ్లూఎంజా (బర్డ్‌ఫ్లూ) అనేది పక్షుల్లో వైరస్ వల్లకలిగే వ్యాధి అని, ఇది అంటు వ్యాధి కాదని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు. నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాధారణంగా చల్లని ప్రాంతాల నుంచి వలస పక్షులు సంతానోత్పత్తికి వచ్చినప్పుడు వాటి రెట్టలు, ఈకలు, నోరు, కళ్ల నుంచి వచ్చే స్రావాల ద్వారా వ్యాప్తి చెందే అవకాశంఉందని ఈ వ్యాధి పక్షులకు వ్యాపిస్తుందన్నారు. ప్రజలు మాంసం, గుడ్లను 70డిగ్రీల వద్ద కనీసం 30నిమిషాలు ఉడికించినప్పుడు వైరస్ నాశనం అవుతుందన్నారు. మాంసం, గుడ్లను బాగా ఉడికించి తినాలన్నారు. జిల్లాలో తొలిసారిగా ఫిబ్రవరి23న కురేకుప్ప పౌల్ట్రీ బ్రీడింగ్‌లో పెంచిన ఆసిల్, కావేరి జాతుల కోళ్లలో చికెన్ ఫ్లూ లక్షణాలు కనిపించాయి. కొన్ని చోట్ల చనిపోయాయి. చనిపోయిన కోళ్ల నమూలాలను తదుపరి పరీక్షల కోసం బెంగళూరులోని ఐఏహెచ్ , వైబీహెచ్‌కి పంపారు. %భోపాల్‌లోని ఐసీఏఆర్ నేషనల్ హై సెక్యూరిటీ యూనియన్ డీసీజ్ లాబోరేటరి నుంచి ధ్రువీకరించిన కేసు నివేధించబడిన తర్వాత బర్డ్‌ఫ్లూగా ప్రకటించారు. మార్గదర్శకాల ప్రకారం 2400 కోళ్లను శాస్త్రీయంగా పారేసినట్లు తెలిపారు. జిల్లాలోని కోళ్లు, బాతులు వలస పక్షులు అసాధారణంగా చనిపోతే వెంటనే సమీపంలోని పశువైద్య విభాగానికి సమాచారం ఇవ్వాలని జిల్లాపంచాయితీ ముఖ్యకార్యనిర్వహణాధికారి మహ్మద్ హరిస్ సుమేర్ అన్నారు. దరోజీ సరస్సు ప్రాంతానికి వివిధ రకాల పక్షులు వలస వస్తాయి. ఈ విషయాన్ని పర్యవేక్షిస్తున్నామని ఆయన అన్నారు. అధికారుల సూచనలు..జిల్లాలో ఏవియస్ ఇన్‌ఫ్లూఎంజా గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్ని గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులను ఇప్పటికే ఆదేశించారు. కోళ్లలో ఏవైనా అసాధరణ మరణాలు కనిపిస్తే వెంటనే పశుసంవర్ధక శాఖకు తెలియజేయాలని గ్రామపంచాయితీత పరిధిలోని కోడి మాంసం గుడ్లు అమ్మకాల దుకాణాల్లో ఉత్పన్నమయ్యే వ్యర్థాలను సక్రమంగా పారవేసేందుకు చర్యలు తీసుకోవాలని కోళ్లఫాంల యజమానులను ఆదేశించినట్లు తెలిపారు. ఈసందర్భంగా పశుసంవర్ధక, పశువైద్య సేవల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హనుమంత నాయక్ కరబారి, అసిస్టెంట్ డైరెక్టర్ డా.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నమ్మండి.. ఇది రైల్వేస్టేషనే..



**చెన్నై- నవభూమి:** నగరంలోని ప్రధాన సబర్బన్ రైల్వేస్టేషన్‌లో ఒకటైన మాంబళం రైల్వేస్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. వ్యాపార కేంద్రమైన టి.నగర్‌కు వచ్చే ప్రజలు మాంబళం రైల్వేస్టేషన్‌కు వస్తుంటారు. ప్రతిరోజు సుమారు 200 సబర్బన్ రైళ్లు, 90కి పైగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ స్టేషన్ మీదుగా వెళ్లుండగా, స్టేషన్‌లో ఐదు ఫ్లాట్‌ఫారాలు న్నాయి. ఈ రైల్వేస్టేషన్‌ను రూ.14.7 కోట్లతో పునరుద్ధరిస్తున్నారు. ఈ వార్తను కూడా చదవండి: %ాఅశ్రీఱఅవ%: మీరు ఆన్‌లైన్‌లో సెల్‌ఫోన్ ఆర్డరు చేస్తున్నారా.. అయితే ఒక్కక్షణం..

## పెళ్లైన 2 రోజులకే బిడ్డకు జన్మనిచ్చిన నవవధువు.. భర్త, అత్తింటివారు షాక్



**న్యూఢిల్లీ-నవభూమి:** పెళ్లి అయిన 2 రోజులకే కొత్త పెళ్లి కుమార్తె కడుపు నొప్పి అని చెప్పింది. వెంటనే అప్రమత్తం అయిన భర్త, అత్తింటి వారు.. ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షలు చేసిన డాక్టర్లు ఆమె 9 నెలల గర్భవతి అని తెలిసి షాక్ అయ్యారు. ఆ విషయం కాస్తా భర్త, అత్తమామలకు చెప్పడంతో వారు అవాక్కయ్యారు. వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పిన డాక్టర్లు.. ఆమెకు డెలివరీ చేసి బిడ్డను బయటికి తీశారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఆరోగ్యంగానే ఉన్నట్లు తెలిపారు. అయితే పెళ్లి అయిన 2 రోజుల్లోనే ఆ పెళ్లి కుమార్తె బిడ్డకు జన్మనివ్వడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇక ఈ ఘటనపై వధువు, వరుడి తరపు బంధువులకు తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన ఈ సంఘటన ఇప్పుడు సంచలనం రేపుతోంది. ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ ్రాజ్‌కు చెందిన ఓ యువతీ, యువకుడికి గత నెల 24వ తేదీన పెళ్లి జరిగింది. బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా వారి పెళ్లి వేడుకను నిర్వహించారు. ప్రయాగ్‌రాజ్ జిల్లా జస్రా గ్రామంలో ఘనంగా నూతన వధూవరుల ఊరేగింపు కూడా నిర్వహించారు. ఇక రాత్రంతా బరాత్ జరగడంతో తెల్లవారుజామున ఆ వధూవరులు.. వరుడి ఇంటికి చేరుకున్నారు. అనంతరం ఎంతో సంతోషంతో కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు ఆ నవవధువు అత్తగారింట్లో అడుగుపెట్టింది. ఆ తర్వాత ఫిబ్రవరి 26వ తేదీన.. వచ్చిన చుట్టాలు, బంధువులకు కొత్త కోడలు టీ ఇచ్చింది. ఈ క్రమంలోనే ఆ నవవధువుకు పురిటి నొప్పులు వచ్చాయి. కడుపు నొప్పి భరించలేకపోతున్నానని.. భర్త, అత్తింటివారి చెప్పడంతో వారు హుటాహుటిన ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే ఆస్పత్రిలో ఆమె టెస్ట్‌లు చేసిన డాక్టర్లు.. ఆ నవ వధువు గర్భవతి అని, 9 నెలలు కూడా నిండినట్లు చెప్పారు. అది విన్నాక అంతా షాక్‌లో మునిగిపోయారు. ఆమెకు 2 గంటల్లోనే ఆపరేషన్ చేసి బిడ్డను బయటికి తీశారు. పెళ్లి జరిగిన 2 రోజులకే ఆ నవవధువు బిడ్డకు జన్మనివ్వడంతో అంతా నోరెళ్లబెట్టారు. అయితే ఆ కొత్త పెళ్లి కుమార్తె గర్భవతి అనే విషయాన్ని దాచి పెట్టి పెళ్లి చేశారని వరుడి కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోయారు. కానీ.. వారిద్దరికీ గతేడాది మే నెలలోనే పెళ్లి సంబంధం కుదిరింది. కొన్ని కారణాల వల్ల పెళ్లి జరగడం కాస్త ఆలస్యం అయినట్లు పెళ్లి కుమార్తె తండ్రి వెల్లడించాడు. అయితే ఈ మధ్య కాలంలోనే తమ కుమార్తెకు, కాబోయే అల్లుడికి శారీరక సంబంధం ఏర్పడిందని వధువు తండ్రి పేర్కొన్నాడు. వారిద్దరికీ ముందు నుంచీ శారీరక సంబంధం ఉందని.. అందుకే తన కుమార్తె గర్భవతి అయిందని తెలిపాడు. అయితే వధువు తండ్రి చేసిన వాదనను వరుడు ఖండించాడు. తాను అలా చేయలేదని.. ఆమెను భార్యగా అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పాడు. ఇక ఈ ఆరోపణలను వరుడి తండ్రి కూడా నిరాకరించాడు. తమ కుమార్తెను భార్యగా అంగీకరించి.. అత్తగారింటికి తీసుకోకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వధువు తల్లి హెచ్చరించింది. ప్రస్తుతం ఈ వివాదం కాస్తా.. గ్రామ పంచాయతీకి చేరగా.. ప్రస్తుతం తల్లి, బిడ్డ కలిసి పుట్టింటికి చేరారు.

## మీరు ఆన్‌లైన్‌లో సెల్‌ఫోన్ ఆర్డరు చేస్తున్నారా..




**చెన్నై- నవభూమి:** ఆన్‌లైన్‌లో సెల్‌ఫోన్( ఆర్డరు చేయగా, డవ్ సోపు రావడంతో వినియోగదారుడు దిగ్భ్రాంతి చెందాడు. ప్రస్తుతం అధిక శాతం మంది ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాణిపేట జిల్లా భానావరంకు చెందిన యోగేష్, ఆన్‌లైన్‌లో రూ.25 వేల విలువైన మొటోరోలా సెల్‌ఫోన్ ఆర్డరు చేశాడు. %nani3.jpg%ఆదివారం అందుకున్న పార్శిల్‌లో సెల్‌ఫోన్‌కు బదులు రూ.120 విలువైన డవ్ సోపు ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందాడు. గతంలో ఇలాంటి వ్యవహారం గురించిన విన్న యోగేష్, పార్శిల్ తెరుస్తూ వీడియో తీసారు. ప్రస్తుతం ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కాగా, ఈ విషయమై ఆన్‌లైన్ సంస్థకు ఫిర్యాదు చేసినట్లు యోగేష్ తెలిపాడు.

## కృష్ణా జలాల కోసం ఆంధ్రాకు తమిళనాడు అధికారులు..




**చెన్నై- నవభూమి:** నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేలా కృష్ణ జలాల నిర్వహణ రుసుము చెల్లించేందుకు రాష్ట్ర అధికారులు త్వరలో ఆంధ్ర రాష్ట్రం వెళ్లనున్నారు. రాజధాని నగరం చెన్నై ప్రజల దాహార్తి తీర్చేలా నదీజలాల ఒప్పందంలో భాగంగా ఆంధ్ర రాష్ట్రం కండలేరు డ్యాం నుంచి ప్రతి ఏడాది 12 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉంది. కానీ, ఇప్పటివరకు ఒప్పందం మేరకు నీటిని విడుదల చేసిన దాఖలాలు లేవు. 2023-24వ సంవత్సరంలో 2.41 టీఎంసీలు, 2024-25వ సంవత్సరంలో 2 టీఎంసీల నీరు మాత్రమే విడుదల చేశారు. ఈ నీటిని పొందేందుకు, ప్రతి ఏడాది నిర్వహణ రుసుముగా రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు చెల్లిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు 4 టీఎంసీల నీరు వదలాల్సి ఉండగా, ఇప్పటివరకు 2 టీఎంసీలు మాత్రమే అందింది. మిగిలిన 2 టీఎంసీల నీరు పొందితే, నగర ప్రజలకు వేసవిలో అంతరాయం లేకుండా తాగునీరు సరఫరా చేసే అవకాశముంది. అందువల్ల, ఆ నీటిని పొందేందుకు జలవనరుల శాఖ చర్యలు చేపట్టింది. ఆ శాఖ అధికారుల బృందం త్వరలో ఆంధ్ర రాష్ట్రానికి వెళ్లనుంది. ఆ సమయంలో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నిర్వహణ రుసుము చెల్లించనున్నట్లు చెన్నై మండల జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

## ప్రతీ 4 సెకండ్లకు ఓ మద్యం బాటిల్ సీజ్



**న్యూఢిల్లీ-నవభూమి:** అక్రమంగా మద్యం తరలిస్తున్నా, ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయాలు జరుపుతున్నా పోలీసులు చర్యలు తీసుకుంటారు. వ్యాపారులను అరెస్ట్ చేస్తూనే మద్యం సీసాలను సీజ్ చేస్తుంటారు. ఇదంతా మనకు తెలిసిందే కాగా.. డ్రై సిటీలోనూ ఇలాంటి చర్యలు చేపట్టాల్సి వస్తోంది. ముఖ్యంగా ఎవరూ ఊహించని స్థాయిలో అక్కడం మద్యం బాటిళ్లు పట్టుబడుతున్నాయి. ప్రతీ 4 సెకండ్లకు ఓ సీసాను పోలీసులు సీజ్ చేస్తుండగా.. ఇప్పటి వరకు 82 లక్షల మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. మరి ఇంత పెద్ద మొత్తంలో మద్యం సీసాలను సీజ్ చేస్తూ మందుబాబుల కడుపు మాడుస్తున్న ఆ ప్రాంతం ఏదో మనం ఇప్పుడు తెలుసుకుందాం. 1960వ సంవత్సరం మే 1వ తేదీన మహారాష్ట్ర నుంచి వేరు పడి స్వతంత్ర రాష్ట్రంగా ఏర్పడ్డ గుజరాత్.. తొలిరోజు నుంచే అక్కడ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తోంది. దాదాపుగా 85 సంవత్సరాలు గుజరాత్‌లో సంపూర్ణ మద్యపాన నిషేధం అమల్లో ఉండగా.. ఈమధ్య ఎక్కువగా మద్యం పట్టుబడోతంది. ముఖ్యంగా 2024వ సంవత్సరంలో ప్రతీ నాలుగు సెకన్లకు ఒక మద్యం సీసాను సీజ్ చేసినట్లు అక్కడి పోలీసులు తెలిపారు. అంతేకాకుండా భారత దేశంలో తయారు చేస్తున్న విదేశీ మద్యం సీసాలే ఎక్కువగా పట్టుబడుతున్నట్లు వివరించారు. గుజరాత్ రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు 82 లక్షల మద్యం సీసాలను పట్టుకోగా.. వీటి విలువు రూ.144 కోట్లు ఉంటుందని చెబుతున్నారు. వీటిలో అహ్మదాబాద్ అర్బన్, రూరల్, పరిధిలోనే 4 లక్షల 38 వేల 47 మద్యం సీసాలు పట్టుబడ్డాయని పేర్కొన్నారు. అహ్మదాబాద్ నగరంలోనే 3.06 లక్షల ఐఎమ్‌ఎఫ్‌ఎల్ బాటిళ్లకు సంబంధించి 2 వేల 139 కేసులు నమోదు చేశామన్నారు. అలాగే 1.58 లక్షల లీటర్ల దేశీయ మద్యానికి సంబంధించిన 7 వేల 796 కేసులు నమోదు అయ్యాయని చెప్పుకొచ్చారు.

## మండిపోతాయ్ జాగ్రత్త...



**న్యూఢిల్లీ-నవభూమి:** తీరప్రాంత జిల్లాల్లో మరో ఐదురోజులు వేడిగాలులతోపాటు సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలునమోదు కానున్నాయని వాతావరణ పరిశోధనశాఖ హెచ్చరించింది. ప్రత్యేకించి ఉత్తర కన్నడ జిల్లాను ఎల్లో అలర్ట్‌గా ప్రకటించింది. బెంగళూరు: తీరప్రాంత జిల్లాల్లో మరో ఐదురోజులు వేడిగాలులతోపాటు సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయని వాతావరణ పరిశోధనశాఖ హెచ్చరించింది. ప్రత్యేకించి ఉత్తర కన్నడ జిల్లాను ఎల్లో అలర్ట్‌గా ప్రకటించింది. రాష్ట్రమంతటా ఎండ వేడిమి పెరగనుందని సూచించింది. ప్రధానంగా తీరప్రాంత జిల్లాలు దక్షిణకన్నడ, ఉడుపి ఉత్తరకన్నడ జిల్లాల్లో ఐదు రోజులపాటు వేడిగాలులు వీస్తాయన్నారు. మూడు రోజులపాటు 30-40 కిలోమీటర్ల వేగంతో వేడిగాలులు ఉంటాయన్నారు. గరిష్టంగా తీరప్రాంత జిల్లాల్లో 35-38 డిగ్రీల సెల్సియస్ నమోదు కానుందని, ఉత్తర కర్ణాటక ప్రాంతం బెళగావి, బీదర్, ధారవాడ, రాయచూరు, హావేరి జిల్లాల్లో 34-35 డిగ్రీలు, విజయపుర, గదగ్, కలబురగి, కొప్పళ, బాగల్కోటెలో 36-38 డిగ్రీలు, దక్షిణప్రాంతాలైన బెంగళూరు, చామరాజనగర, మడికేరి, మైసూరు లలో 32-34 డిగ్రీలు, చిత్రదుర్గ, దావణగెరె, మండ్య, శివమొగ్గలలో 35-36 డిగ్రీలు నమోదు కానుందని ప్రకటించారు. గడిచిన 24 గంటలలో సాధారణంగా 2.5 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగినట్టు వాతావరణశాఖ అధికారులు ప్రకటించారు. బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో సాధారణం కంటే ఒకటిరెండు డిగ్రీల ఉష్ణోగ్రత అధికంగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. మధ్యాహ్నం వేళ ఎండలో తిరగకుండా ముందస్తు చర్యలు ప్రజలు పాటించాలని సూచించారు. అవసరం అయితే బయట తిరగరాదన, వృద్ధులు, పిల్లలు జాగ్రత్త వహించాలని సూచించారు.

## ఎమ్మెల్యేలకు మసాజ్ ఛైర్లు, స్మార్ట్ లాక్స్..

### రూ.3 కోట్లతో ప్రతిపాదనలు, స్పీకర్ నిర్ణయం



కర్ణాటక అసెంబ్లీలో ఎమ్మెల్యేలకు ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలపై కొన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. బెంగళూరు విధాన సౌధ భవనంలో ఇప్పటికే స్పీకర్ యూటీ ఖాదర్ ఇచ్చిన ఆదేశాలతో రిక్లెయినర్ సీట్లను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలోనే తాజాగా మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు స్పీకర్ సిద్ధం అయ్యారు. విధాన సౌధలో ఎమ్మెల్యేల కోసం స్మార్ట్ లాక్స్, మసాజ్ కుర్చీలు కూడా ఏర్పాటు చేయాలని.. అందుకోసం రూ.3 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు స్పీకర్ యూటీ ఖాదర్ తాజాగా వెల్లడించారు. అయితే ఈ నిర్ణయాన్ని ప్రతిపక్ష బీజేపీ తీవ్రంగా విమర్శించింది. పాలనపై దృష్టి పెట్టకుండా ఇలాంటి అనవసర ఖర్చులు చేస్తున్నారని మండిపడుతున్నారు. కర్ణాటకలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా ఇలా వృథా ఖర్చులు చేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి ఆరోపించారు. అయితే ఎమ్మెల్యేలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పీకర్ యూటీ ఖాదర్ వెల్లడించారు. ఎమ్మెల్యేలు.. వారి రూమ్‌లలో స్మార్ట్ లాక్స్ ఏర్పాటు చేయడం వల్ల వారి భద్రత పెరగడంతో పాటు.. సులభంగా ప్రవేశించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇవే కాకుండా ఎమ్మెల్యేలకు మరిన్ని అదనపు సౌకర్యాలు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరలోనే అసెంబ్లీ లాబీల్లో రిక్లయినర్లతో పాటు మసాజ్ కుర్చీలు కూడా ఏర్పాటు చేస్తామని స్పీకర్ వెల్లడించారు. ఎమ్మెల్యేలు ఎక్కువ సేపు పని చేయడం వల్ల తీవ్ర ఒత్తిడికి గురి అవుతున్నారని.. వారు చేస్తున్న పనికి ఇవి విలాసాలు కావని తేల్చి చెప్పారు. వారి అవసరాలు తీర్చేందుకే వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు స్పీకర్ ఖాదర్ తెలిపారు. ఇలాంటి సౌకర్యాలకు ఎమ్మెల్యేలు పూర్తిగా అర్హులు అని వెల్లడించారు. అంతేకాకుండా ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావడానికి.. వారి హాజరు శాతాన్ని పెంచడం కోసం.. సభలో వారి భాగస్వామ్యాన్ని మెరుగుపరచడానికి స్పీకర్ చేస్తున్న ప్రయత్నాలను సమర్థిస్తున్నట్లు కర్ణాటక గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే తెలిపారు. చాలా మంది ఎమ్మెల్యేలు ఒత్తిడితో పనిచేస్తున్నారని.. పైగా చాలామంది సీనియర్ సిటిజన్లు కావడం వల్ల ఇలాంటి ఏర్పాట్లు మంచివేనని అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే పేర్కొన్నారు. అయితే స్పీకర్ యూటీ ఖాదర్ తీసుకున్న ఈ చర్యలను బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. ముఖ్యమైన పాలనా పరమైన సమస్యలపై దృష్టి పెట్టకుండా.. ఇలాంటి అనవరసర ఖర్చులు చేయడం ఏంటని మండిపడింది. కర్ణాటకలో నిధుల కొరత కారణంగా.. పని చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించడం లేదని బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.



## యూపీ మహిళకు యూఏఈలో ఉరి

**న్యూఢిల్లీ-నవభూమి:** ఉత్తరప్రదేశ్‌కు చెందిన షహజాదీ ఖాన్ అనే 33ఏళ్ల మహిళను 4 నెలల చిన్నారి మృతి కేసులో హత్య అభియోగాలపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వం ఉరితీసిందని భారత విదేశాంగ శాఖ ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. గత నెల 15న ఆమెను ఉరితీశారని, ఈ నెల 5న ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నారని అడిషనల్ సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ న్యాయస్థానానికి తెలిపారు. షహజాదీ ఖాన్ తండ్రి షబ్బీర్ ఖాన్ తన కుమార్తె విషయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో భారత విదేశాంగ శాఖ ఈ వివరాలు వెల్లడించింది. యూపీ బాందా జిల్లాకు చెందిన షహజాదీ ఖాన్‌ను ఉజైర్ అనే వ్యక్తి అబుధాబీ వెళ్తే జీవితం బాగుంటుందని మాయమాటలు చెప్పి తన బంధువులైన ఫైజ్-నాడియా దంపతులకు విక్రయించాడు. ఈ క్రమంలో ఆమె 2021 డిసెంబరులో అబుధాబీ చేరుకుంది. ఆమెను అబుధాబీకి తీసుకెళ్లిన ఫైజ్-నాడియా దంపతుల 4 నెలల చిన్నారికి సంరక్షురాలిగా వ్యవహరించేది. 2022 డిసెంబరు 7న వ్యాక్సినేషన్లుఇవ్వగా చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. దంపతులు ఆమెపై హత్య ఆరోపణలు మోపారు. అయితే ఔషధాల విషయంలో దంపతుల నిర్లక్ష్యం కారణంగానే చిన్నారి మృతి చెందిందని షహజాదీ ఆరోపించారు. చివరకు యూఏఈ న్యాయస్థానం ఆమెకు మరణ శిక్షను విధించింది. చివరి కోరిక ఏంటని అడగ్గా తన కుటుంబసభ్యులతో మాట్లాడతానని ఆమె కోరడంతో కోర్టు అనుమతించింది. గత నెలలో తన కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ తాను నిర్దోషినని షహజాదీ ఖాన్ కన్నీటి పర్యంతమైంది.

## సిద్ధాంతం వేరు, సైన్స్ వేరు!

కృత్రిమమేధ ఎన్నో పనులు చేస్తూ పెట్టుబడిదారులకు, వ్యాపారులకు లాభాలను గడించి పెడుతుందంటూ ఒక పది రకాల పనులను ఉదాహరించారు రంగనాయకమ్మ. నిజమే, కృత్రిమమేధ అనేది సైన్స్‌కు చెందిన ప్రక్రియ. సైన్స్ ఎప్పుడు కఠినమైన ప్రక్రియలను సరళం చేస్తుంది. మార్క్స్ ఉత్పత్తి %-% లాభాలు అంశాన్ని మిగులువిలువ సిద్ధాంతం కోణంలో చూసినట్లు మనం సైన్స్‌ను సైన్స్ అప్గ్రేడేషన్ కోణంలో చూడాలి. అనేక సిద్ధాంతాలకు ప్రత్యామ్నాయ సిద్ధాంతాలు వచ్చాయి. కానీ ఉత్పత్తి ప్రక్రియలో మార్క్స్ వెలుగులోకి తెచ్చిన మిగులు విలువ సిద్ధాంతానికి ప్రత్యామ్నాయం లేదు, రాదు కూడా. సిద్ధాంతానికి ప్రత్యామ్నాయం రావచ్చు, రాకపోవచ్చు. సైన్స్‌కు మాత్రం ప్రత్యామ్నాయం ఉండదు, కేవలం అప్‌గ్రేడేషన్ మాత్రమే ఉంటుంది. అలా వచ్చిందే కృత్రిమమేధ. కృత్రిమమేధపై పెట్టుబడి లాభం రంగనాయకమ్మ కోణంలో చూద్దాం. ఫ్రెంచ్ ఆర్థికవేత్త జెబి సే సూత్రం ప్రకారం%-% "సప్లయ్ తనకు తానే తన డిమాండ్ సృష్టించుకుంటుంది". ఈ సిద్ధాంతం ప్రకారం పెట్టుబడిదారుల విపరీత లాభాపేక్షతో ఉత్పత్తిలో యాంత్రీకరణ ప్రవేశపెట్టడం వల్ల ఉత్పత్తులు పెరిగి లాభాలు రావాలి. కానీ పారిశ్రామిక చరిత్రలో ఇలా జరగలేదు. యంత్రాల ద్వారా డిమాండ్‌ను మించి మిగులు ఉత్పత్తులు పెరగడంతో అమ్మకాలు లేవు. నష్టాలపాలైన పెట్టుబడిదారులు ఫ్యాక్టరీలను నడపకపోవడం వలన కార్మికులు ఉపాధి కోల్పోయారు. లాభాల ఆశతో విపరీత ఉత్పత్తితో పెట్టుబడిదారులకు లాభాలు వస్తాయనేది కూడా ఒక భ్రమ అని ప్రపంచవ్యాప్తంగా 1928%-%33 మధ్య వచ్చిన ఆర్థికమాంద్య పరిస్థితులు రుజువు చేసినవి. కార్ల్ మార్క్స్ యాంత్రీకరణ వల్ల ఉపాధి కోల్పోయిన కార్మికవర్గం పెట్టుబడిదారి వ్యవస్థపై తిరుగుబాటు చేస్తుందన్నారు. యాంత్రీకరణ వలన మిగులు ఉత్పత్తితో నష్టాల పాలైన పెట్టుబడిదారులు, వేతనాలు చెల్లించలేని స్థితిలో కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించినప్పటికీ, ఎక్కడా మార్క్స్ చెప్పినట్టు కార్మికులు తిరుగుబాటు చేయలేదు. ఆనాటి ఆర్థికమాంద్య ఉపద్రవం నుండి పెట్టుబడిదారులను కాపాడి వారికి లాభాల మార్గం చూపి ఆర్థిక వ్యవస్థను బయటపడేయడానికి కృషిచేసిన వారిలో ఆర్థర్ సిసిల్ పిగూ ఒకరు. ఆయన చెప్పిన వేతనాల తగ్గింపు సిద్ధాంతం (వేజ్ కట్ పాలసీ), ఇటు లాభాలను గాని అటు డిమాండ్‌ను కానీ పెంచలేకపోయింది. ఇక్కడ ఆచరణలో జెబి సే, కార్ల్ మార్క్స్, ఆర్థర్ సిసిల్ పిగూ సిద్ధాంతాలు మూడూ విఫలం అయినాయి. ప్రపంచం తీవ్రమైన ఆర్థిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతున్నప్పుడు బ్రిటిష్ ఆర్థికవేత్త జె.ఎమ్. కీన్స్ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం జోక్యం చేసుకొని పని సృష్టించాలని, తద్వారా ప్రజల్లో కొనుగోలుశక్తి పెరిగి వస్తువులకు డిమాండ్ ఏర్పడి పరిశ్రమలు పునఃప్రారంభం అవుతాయని, ఇందుకుగాను ప్రభుత్వాలు రాబడిని మించి వ్యయం చేయాలంటూ లోటుబడ్జెట్ విధానాన్ని సూచించాడు. నేటికీ అనేక దేశాలు రాబడికి మించి వ్యయం చేస్తున్నాయి. ఈ అంశాలను బట్టి ఒక సిద్ధాంతం విఫలమైనప్పుడు నష్టనివారణకు ప్రత్యామ్నాయ సిద్ధాంతం కూడా వస్తుంది అనేది రుజువైంది. భారతదేశంలో వ్యవసాయరంగంలో ట్రాక్టర్ లాంటి యంత్రాల వినియోగం లేకుంటే ఇప్పటి జనాభాకు సరిపడా ఆహారధాన్యాల ఉత్పత్తిలేక సగం మంది ఆకలితో చచ్చిపోయేవారు. జనాభా ఇంతగా పెరిగినా గ్రామాల్లో కూలీల కొరత స్పష్టంగా కనపడుతున్నది. యంత్రీకరణను వ్యతిరేకిస్తూ, శ్రామికులకు పనిలేదని వాపోయేవారు తెలంగాణ పల్లెలను చూస్తే బిహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల నుండి వ్యవసాయకూలీల వలసలను గమనించవచ్చు. వ్యవసాయరంగంలో సాంకేతిక పరిజ్ఞానం సృష్టిస్తున్న ఉత్పత్తి ఫలాలు ఎన్నో ఉన్నాయి. మహారాష్ట్రలో బారామతి ప్రాంతంలో మైక్రోసాఫ్ట్ వ్యవసాయ పరిశోధనలు చేస్తున్నది. ఎలాంటి సౌకర్యాలు అందుబాటులో లేని, నీటిఎద్దడి కలిగిన మారుమూల పల్లెల్లో కృత్రిమమేధను ఉపయోగిస్తూ పంటలకు ఆశిస్తున్న తెగుళ్ళను గుర్తించి సకాలంలో నివారణ చర్యలను చేపట్టి వ్యవసాయ ఉత్పత్తులను పెంచుకొంటున్నారు. జన్యువుల రహస్యం ఛేదించి, కణనిర్మాణం గుట్టును పసిగట్టి, జీనోమ్ మ్యాప్ రూపుదిద్దిన మానవుడు, శిశువు పిండదశలో ఉన్నప్పుడే ఏ జన్యువు లోపంతో ఏ రకమైన వ్యాధులు వస్తాయో గుర్తించి జన్యులోపాలను సరిచేయగలుగుతున్నాడు. ఇలా సైన్స్ సృష్టించిన అద్భుతాలు ఎన్నెన్నో ఉన్నాయి. సాధారణ మొబైల్ స్థానంలో ఆండ్రాయిడ్ మొబైల్ వచ్చిన తర్వాత వాచ్, కెమెరా, టేప్ రికార్డర్ వంటి ఎన్నో పరికరాల ఉపయోగం తగ్గింది. అంతమాత్రాన ఆండ్రాయిడ్ మొబైల్ నిరుద్యోగం సృష్టిస్తున్నదని దాని వాడకం నిలిపివేయలేం కదా. కృత్రిమమేధ వల్ల పెట్టుబడిదారులకు విపరీత లాభాలు వస్తాయనేది ఒక భ్రమ. కేవలం అది ఒక దశ మాత్రమే. మళ్ళీ దానిలో అప్‌గ్రేడేషన్ ఉండనే ఉంటుంది. మొత్తం మానవ పరిణామ క్రమమంతా కఠినత్వం నుంచి సరళత్వం వైపు ప్రయాణం మాత్రమే. అందులో భాగమే పెట్టుబడి లాభం. పరిశోధనలన్నీ పెట్టుబడి లేకుండా జరగవు. పెట్టుబడి పెట్టేవారు లాభం తప్పక ఆశిస్తారు. ఆశ లేకపోతే ప్రగతికి ఆస్కారం లేదు. సైన్స్ ఏ వర్గ ప్రయోజనాలకు ఉపయోగపడుతుందనే వాదన అర్థరహితం. సైన్స్ సార్వజనీనమైంది. కృత్రిమమేధ పనితీరు పట్ల అనుమానాలు, భయాలు అర్థరహితం.

# ఔరంగజేబు అంత క్రూరుడా



బొల్లోజు బాబా



**(నిన్నటి సంచిక తరువాయి)** మఠాలకు ఆర్థిక సహాయం చేసాడని ఆధారాలతో నిరూపించారు. డా. బి.ఎన్ పాండే రాసిన Aurangzeb Religious Policies భాగానికి ఈ క్రింది వ్యాసం ఉరామరి అనువాదం. యధాతథ అనువాదం కాదు. సంక్షిప్తీకరించబడినది. ప్రథమ పురుషలో ఉంటుంది. అదనపు వివరాలకొరకు డా. పాండే గారి పుస్తకం లింకులో ఇచ్చాను చదువుకొనగలరు. ఈ పుస్తకంలో నన్ను ఆకర్షించినది ఏమిటంటే%ౌ%. ఔరంగజేబు హిందువులకు జారీ చేసిన ప్రతి ఫర్మానులోను "సామ్రాజ్యం శాశ్వతంగా నిలిచేందుకు వారు దేవునికి ప్రార్థన చేస్తూ ఉండాలి" అనే వాక్యం. ఔరంగజేబుకు హిందూ దేవుళ్ళపట్ల వ్యతిరేకభావన లేదని ఈ వాక్యం తెలియచేస్తుంది.

ఔరంగజేబు హిందూ ద్వేషి అనే ప్రచారం పండితుల సృష్టి. ఔరంగజేబు అన్న అయిన దారాషికో పండితుల సాంగత్యంలో సంస్కృతం నేర్చుకొన్నాడు. ఇతనితో, ఉపనిషత్తులు, ఇతరకావ్యాల అనువాదాలు చేయించారు. ఇతను రాజైతే తమకు తిరుగులేదని పండితులు భావించి ఉంటారు. ఇది ఔరంగజేబుకు నచ్చలేదు అన్నను తొలగించి, కళలు కవులను ఆస్థానంలో నిషేదించటం ద్వారా పండితులను దూరంపెట్టాడు. ఔరంగజేబుపై అనాదిగా పండితులకు ఉన్న ద్వేషానికి గల కారణమిది .

ఇప్పటివరకు ఈ పండితులు చేసిన దుష్ప్రచారాన్ని పక్కనపెట్టి, ఔరంగజేబును చారిత్రిక దృష్టికోణంలోంచి పునర్మూల్యాంకనం చేయాల్సిన అవసరం ఉంది. లిలిలిలిలిలి.. ఔరంగజేబు మతవిధానం- డా. బి.ఎన్ పాండే రచన ఉరామరి అనువాదం. . 1948-53 మధ్య, నేను అలహాబాద్ మున్సిపాలిటీ చైర్మన్‌గా ఉన్న సమయంలో, ఒక దాఖిల్ ఖారిజ్ (మ్యూటేషన్) కేసు నా పరిశీలనకు వచ్చింది. ఇది గంగా, యమునా సంగమంలో ఉన్న సోమేశ్వర్ నాథ్ మహాదేవ్ ఆలయానికి అంకితమైన ఆస్తిపై జరిగిన వివాదం. మహంత్ మరణించిన తరువాత, ఆస్తిపై ఇద్దరు హక్కుదారులు ప్రత్యర్థులుగా నిలిచారు. వారిలో ఒకరు, అతనివద్ద వంశపారంపర్యంగా ఉన్న కొన్ని పత్రాలను సమర్పించారు. ఆ పత్రాలు మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ జారీ చేసిన ఫర్మాన్లు (రాజాజ్ఞ). ఔరంగజేబ్ ఆ ఆలయానికి జాగీర్ (భూమి), కొంత నగదు బహుమతి అందజేశాడని పేర్కొంది. నేను ఆశ్చర్యపోయాను. నాకు అనుమానం కలిగింది. ఆ ఫర్మాన్లు నకిలీవిగా అనిపించాయి. విగ్రహాలను ధ్వంసం చేసే వ్యక్తిగా పేరుగాంచిన ఔరంగజేబ్, ఒక హిందూ ఆలయానికి పూజ, భోగం కోసం జాగీర్ ఇవ్వడం ఎలా సాధ్యం? అతను విగ్రహారాధనను ఎలా సమర్ధించగలడూ? లాంటి ప్రశ్నలు నాకు కలిగాయి.

నిజానికి ఆ పత్రాలు నకిలీవేనని నాకు నమ్మకం కుదిరింది. కానీ, తుది నిర్ణయం తీసుకునే ముందు, పర్షియన్ మరియు అరబిక్‌లో మహా పండితుడైన సర్ తేజ్ బహదూర్ సప్రూ అభిప్రాయం తీసుకోవాలని భావించాను. నా ఆఫీసు ముగిసాకా, నేరుగా ఆయన వద్దకు వెళ్లాను. ఆ పత్రాలను ఆయన ముందు ఉంచి, ఆయన అభిప్రాయాన్ని కోరాను. ఆ పత్రాలను జాగ్రత్తగా పరిశీలించిన తరువాత, డాక్టర్ సప్రూ అవి నిజమైన ఫర్మాన్లే అని నిర్ధారించారు. ఆపై, ఆయన తన సహాయకుడిని, గత 15 సంవత్సరాలుగా అలహాబాద్ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న వారణాసి జంగంబాడి శివాలయం కేసు ఫైలును తెప్పించమని ఆదేశించారు. ఆ ఆలయ మహంత్ కూడా ఔరంగజేబ్ జారీ చేసిన అనేక ఫర్మాన్లను కలిగి ఉన్నట్లు తెలిసింది. దీంతో, నాకు ఔరంగజేబ్ వ్యక్తిత్వం కొత్తగా కనిపించటం మొదలైంది. ఎంతో ఆశ్చర్యపోయాను. డాక్టర్ సప్రూ సూచన మేరకు, నేను భారతదేశంలోని వివిధ ప్రధాన ఆలయాల మహంత్‌లకు లేఖలు రాసి, 'వారి ఆలయాలకు సంబంధించి, ఔరంగజేబ్ ఫర్మాన్లు జారీ చేసి ఉంటే, వాటి ఫోటోకాపీలు పంపమని' కోరాను. ఇంకా పెద్ద ఆశ్చర్యం ఎదురైంది. మహాకాళేశ్వర ఆలయం (ఉజ్జయిని), బాలాజీ ఆలయం (చిత్రకూట్), ఉమానంద ఆలయం (గౌహతి), శత్రుంజయ జైన ఆలయాలు, మరియు ఉత్తర భారతదేశంలోని అనేక ఇతర ఆలయాలు, గురుద్వారాల నుండి ఔరంగజేబ్ జారీ చేసిన ఫర్మాన్ల ప్రతులు నాకు అందాయి. ఈ ఫర్మాన్లు 1659 A.D నుండి 1685 . మధ్య జారీ చేయబడ్డాయి. ఇవి కొద్ది ఉదాహరణలు మాత్రమే అయినప్పటికీ, ఔరంగజేబ్‌పై చరిత్రకారులు వ్రాసినది పాక్షికం మాత్రమే, అది పూర్తిగా ఏకపక్షంగా ఉందని అర్థమైంది. భారతదేశం విస్తారమైన దేశం, వేలాది ఆలయాలు ఇక్కడ ఉన్నాయి. తగిన పరిశోధన చేస్తే, మరిన్ని ఉదాహరణలు బయటపడతాయి, ఇవన్నీ ఔరంగజేబ్ హిందువుల పట్ల ఉదారభావంతో వ్యవహరించినట్లు నిరూపిస్తాయి. ఈ ఫర్మాన్లపై పరిశోధన చేస్తూ, నేను శ్రీ గ్యాన్ చంద్ మరియు పాట్నా మ్యూజియం మాజీ క్యూబేటర్ డాక్టర్ పి.ఎల్. గుప్తా వంటి ప్రముఖ చరిత్ర పరిశోధకులను కలిశాను. వారు కూడా ఔరంగజేబ్ చరిత్రపై విశేష పరిశోధనలు చేస్తున్నారు. నాకు సంతోషం కలిగించింది. ఎందుకంటే, మరికొందరు విజ్ఞానవేత్తలు, నిజమైన చరిత్రను వెలుగులోకి తీసుకురావడానికి తమ వంతు సహాయాన్ని అందిస్తున్నారు. పక్షపాతంగల చరిత్రకారులు, మొఘల్ పాలనను పూర్తి ముస్లిం పరిపాలనగా చూపిస్తూ, ఔరంగజేబ్‌ను కేవలం క్రూర ముస్లిం పాలకునిగా మాత్రమే చిత్రీకరించారు. ఒక కవి వ్యథతో ఇలా వ్రాశాడు:"తుమ్ హేన్ లేఖ్ కె సారీ దస్తాన్ మేన్ యాద్ హై ఇత్నాబీకే ఆలంగీర్ హిందు కుష్ థా, జాలిమ్ థా, సితం గర్ థా..."(భారతదేశంలో వెయ్యి సంవత్సరాల ముస్లిం పాలన గురించి మాట్లాడేటప్పుడు, వాళ్లు కేవలం ఇంతే గుర్తు పెట్టుకుంటారు ఆలంగీర్ (ఔరంగజేబ్) హిందువులను హత్య చేసిన వాడు, క్రూరుడైన పాలకుడు అని!) ఔరంగజేబ్‌ను హిందూ వ్యతిరేక పాలకుడిగా ముద్ర వేసిన వాటిలో, "బనారస్ ఫర్మాన్" అనే ప్రసిద్ధ ఫర్మాన్‌ను ప్రస్తావిస్తారు. ఇది వారణాసిలోని మోహల్లా గౌరీ ప్రాంతానికి చెందిన ఒక బ్రాహ్మణ కుటుంబానికి ఇచ్చిన ఉత్తర్వు. 1905లో ఒక వివాదంలో ఈ ఫర్మాన్ నగర మేజిస్ట్రేట్ ఎదుట సమర్పించబడింది. 1911లో "జర్నల్ ఆఫ్ ది ఆసియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్" లో ఇది ప్రచురితమైంది. అప్పటి నుంచి చరిత్రకారులు దీనిని తరచూ ప్రస్తావిస్తూ వస్తున్నారు. ఈ ఫర్మాన్ మార్చి 10, 1659 నాడు, వారణాసిలోని స్థానిక అధికారికి జారీ చేయబడింది. ఒక బ్రాహ్మణుడు తన ఆలయంపై కొందరి వేధింపులను ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదు చేశాడు. ఈ ఫర్మాన్‌లో, "పురాతన ఆలయాలను కూల్చకూడదు, కొత్త ఆలయాలు నిర్మించకూడదు" అని ఉంది. మరీ ముఖ్యంగా, హిందువులకు ఉపద్రవం జరగకుండా చూడాలని, వారు శాంతిగా నివసిస్తూ, రాజ్యం కొనసాగడానికి దేవునికి ప్రార్థనలు చేయాలని పేర్కొనబడింది. ఔరంగజేబ్ హిందువులను వేధించేందుకు ఈ ఫర్మాన్‌ను జారీ చేయలేదని స్పష్టంగా తెలుస్తోంది. అప్పటివరకు ఉన్న ఆచారం ప్రకారం, కొత్త ఆలయాలను నిర్మించకూడదని మాత్రమే పేర్కొన్నాడు. కానీ, హిందువుల భద్రత విషయంలో అతను చాలా కఠినంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. బనారస్‌లోని మరో ఫర్మాన్ కూడా అదే సూచిస్తుంది:"మహారాజ ధీరాజ్ రాజా రామ్ సింగ్ (బనారస్) తన తండ్రి నిర్మించిన భవనాన్ని భగవత్ గోసాయి అనే గురువుకు నివాసంగా ఇచ్చిన సంగతి, కానీ కొందరు ఆయనను వేధిస్తున్నారని తెలుపుతూ, వారి హక్కులను పరిరక్షించాలని కోరిన మీదట" – అలా జరిపించాలని అధికారులను ఆదేశిస్తూ ఔరంగజేబు ఫర్మానా జారీచేసాడు. ఇలాంటి మరికొన్ని ఫర్మాన్లు కూడా ఉన్నాయి. జంగంబారి మఠాన్ని కొందరు ముస్లిములు ఆక్రమించుకొన్నారని కొందరు జంగములు ఔరంగజేబు దర్బారులో మొరపెట్టుకోగా, " విచారణ చేసి ఆ ముస్లిములదే తప్పయినట్లు తేలినచో వారిని అక్కడనుంచి తొలగించి తగిన విధంగా శిక్షింపవలసిందని అధికారులను ఆదేశించాడు. అలా కొన్ని ఫర్మాన్లు, హిందువుల హక్కులను కాపాడటానికి ఔరంగజేబ్ ప్రత్యేక ఆదేశాలు ఇచ్చినట్లు సూచిస్తున్నాయి. ఇదంతా చూస్తే, ఔరంగజేబ్‌ను కేవలం హిందూ వ్యతిరేక పాలకుడిగా ముద్ర వేసే చరిత్ర పాక్షికమని తెలుస్తుంది.

# విలక్షణమే విశేషం



ప్రపంచంలో మనుషులంతా దాదాపు ఒకే రీతుల్లో కనబడుతుంటారు. కానీ, నిశితంగా పరిశీలిస్తే కొందరు నిర్దిష్ట లక్ష్యం అంటూ ఏదీ లేకుండా గడుపుతుంటారు. ఏదో నడుస్తుందిలే అనుకుంటూ, అలాగే నడిపిస్తూ ఉంటారు. అలాగే గడిపేస్తుంటారు. ఎదుగు బొదుగు లేకుండా ఉంటారు. ఇంకొందరికి లక్ష్యం అంటూ ఉంటుంది. వారు అట్టి లక్ష్యసాధనకై కృషి చేస్తుంటారు, తపిస్తుంటారు సాధిస్తారు కూడా!

ఇంకొందరు లక్ష్యాన్ని కలిగి ఉంటూ స్థిర నిశ్చయంతో విలక్షణంగా జీవించే ప్రయత్నం చేస్తుంటారు. ఈ మూడో కోవ కి చెందిన వారే డిఫరెంట్ గా ఉంటూ వారికంటూ ఒక ప్రత్యేక గుర్తింపును కలిగి ఉంటారు. లక్ష్యం లేని వారు ఏమి ప్రత్యేకంగా సాధించలేక సాదాసీదాగా, ఏదో రొటీన్ గా గడిపేస్తుంటారు. అదే లక్ష్యం ఉన్నవారు విజయాల్ని సాధిస్తూ ముందుకెళుతుంటారు. అయితే విలక్షణంతో ఉండేవారు తమ ప్రత్యేకతను చూపుతుంటారు. వారు:

ఎప్పటి పనిని అప్పుడే చేసేస్తారు. పెండిగులకు తావు ఇవ్వరు.

ఎక్కడి వస్తువులను క్రమంగా అక్కడే ఉంచుతారు.

ఆరోజు పనిని అప్పుడే చేస్తారు. రేపటి పనిని ఈ రోజే చేస్తారు. అంతేకాకుండా, స్థిరమైన లక్ష్యం, ఆత్మస్థైర్యంతో ఎప్పటికప్పుడు సమయానుకూల నిర్ణయాలను గైకొంటూ అడ్డంకులను అధిగమిస్తూ, ఎప్పుడూ రెట్టింపు ఉత్సాహంతో, ధైర్యంతో ముందుకు వెళుతుంటారు. అలాంటి వారికి అభిమానులు





ఎక్కువ. అందరివారిగా కలకాలం నిలిచిపోతారు. సమాజంలో ప్రత్యేక గుర్తింపును కలిగి ఉంటారు. విలక్షణంగా జీవించేవారు ప్రతి పని ప్రారంభించే ముందు పక్కా ప్రణాళికతో ప్రారంభిస్తూ, కార్యాంతం వరకు ఒకే స్థాయి ఉత్సాహంతో పనిని సంపూర్తి చేస్తారు. వారు తమ పని విషయంలో ఏ మాత్రం రాజీపడరు. ఇంకా తగ్గింపు ధోరణితో, సింప్లిసిటీ తత్వంతో జీవిస్తుంటారు. వారు ప్రతి రోజు పగలు గడిచిన తరువాత రాత్రి నిద్రకు ఉపక్రమించే సమయంలో...

**ఈరోజు నేను నేర్చుకున్న కొత్త విషయాలు ఏవి?**

**ఈరోజు నేను చేసిన కొత్త పని ఏమి?**

**ఈరోజు నేనేమి చేయదల్చాను? ఏమి చేశాను.?**

అనే విషయాలను గూర్చి సింహావలోకనం చేసుకుంటారు. ఇవన్నీ మహోన్నతుల లక్షణాలు, సుగుణాలు. ఇలాంటి వారే సమాజానికి ఉపయోగకారులు. ఒక ప్రత్యేకతను కలిగి ఉంటారు. దీనికై ఉదాహరణ, విద్యార్థులను మీకు బాగా తెలిసిన లేక బాగా గుర్తున్న రాష్ట్రపతి ఎవరు? అని ప్రశ్నిస్తే ఎక్కువగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మరియు డాక్టర్ అబ్దుల్ కలాం అని చెప్తుతుంటారు. దీనికి కారణం వీరు ఇరువురు విలక్షణంగా జీవించడమే! అధ్యాపక వృత్తి నుండి అత్యున్నత గౌరవప్రదమైన రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జీవిత చరిత్ర చదివేతే విషయం అవగతం అవుతుంది. సర్వేపల్లి వారు కాలేజీ చదువు చదివే సమయంలో తన సీనియర్ నుండి ఫిలాసఫీ పాత పుస్తకాలను అడిగి తీసుకుని శ్రద్ధగా చదివి గొప్ప ఫిలాసఫర్ గా పేరు గడించారు. ఫిలాసఫీ పై మక్కువ చూపాడు. తత్వశాస్త్రంలో ఘనమైన ప్రావీణ్యతను సాధించాడు. ఆయన ఉపన్యాసాలలో చతురతతో పాటు గంభీరమైన మర్మాలు దాగి ఉండేవి. అంతటి దిట్ట.

మరో విలక్షణ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం గారు. ఈయన గారు సాదాసీదా, సరళమైన జీవనశైలిని కలిగి ఉండేవారు. దాదాపు ప్రతి రాత్రి లేటుగానే నిద్రించి తిరిగి ఉదయమే లేచేవాడు. ఆయన గారు రాత్రి రెండు గంటలకు నిద్రించి తిరిగి ఉదయం 6 గంటలకు లేచే వారని చదివాను. అంతటి కార్యదీక్షుడు. ఆయనకు ఇష్టమైన వ్యక్తిగత ఆస్తుల్లో పుస్తకాలు, వీణ, సి డి ప్లేయరు, లాప్టాప్ మాత్రమే. ఆస్తులు లేవు. రక్షణ రంగంలో పనిచేస్తున్న సమయంలో గంటలకొద్దీ తన కార్యసాధనకై కృషి చేసేవారు. అనేక ప్రయోగాలకు స్ఫూర్తిదాతగా ఉన్నందు మిస్సైల్మేన్ అనే పేరు గడించారు. ఏ స్థాయిలో ఉన్నా ఖచ్చితమైన సమయపాలన, క్రమశిక్షణ పాటించేవారు. ఇలాంటి విలక్షణమైన జీవనశైలి ఉన్నందుకే నేటికీ అందరికీ గుర్తుండిపోయారు. దీనినే విలక్షణత అంటారు. ఇలాగే ఏ రంగంలోనైనా అద్భుతంగా రాణించిన వ్యక్తులను, వారి చరిత్రలను గమనిస్తే వారికంటూ విలక్షణ జీవనశైలే విశిదమవుతుంది. ఎన్నాళ్లు బ్రతికాము అనేది కాదు, ఎలా బ్రతికాము అన్నదే విలక్షణతను చూపుతుంది. ఇలాంటి మహానుభావులనే స్ఫూర్తిగా తీసుకుంటూ, వారు జీవించిన జీవనశైలి ఆధారంగా మనము జీవించే ప్రయత్నం చేస్తే, మనం కూడా విలక్షణంగా జీవించవచ్చు. అందుకే,

ప్రతి వారిలోనూ అంతర్గత సామర్థ్యాలు, నైపుణ్యాలు ఖచ్చితంగా దాగి ఉంటాయి. వాటిని వెలికి తీయాలి. సద్వినియోగపర్చుకోవాలి.

ప్రతి వారికి మేధస్సు ఉంటుంది. దానికి పదును పెట్టాలి.

స్థిరమైన లక్ష్యంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి.

ఆశావహంతో విలువలను కలిగి ప్రవర్తించాలి.

సమయాన్ని వృధా చేయక ఎప్పటి పనిని అప్పుడే చేస్తూ, కార్యంతము ముఖ్యమని గుర్తించాలి. సాధించాలి.

అవరోధాలు, అడ్డంకులు ఎదురొచ్చినా మొక్కవోని దీక్ష, దృఢ సంకల్పంతో సాధించాలనే మన ధైర్యంతో ముందుకు సాగాలి.


వచ్చిన అవకాశాలను వదులుకోకుండా సమయస్ఫూర్తితో, విలువలతో ప్రవర్తించాలి.

ఇలాంటివన్నీ విలక్షణతను చూపుతుంటాయి అందుకే లక్ష్యం వేరు, విలక్షణం వేరుగా చెప్పవచ్చు. మహానుభావుల జీవనశైలిని అనుసరిస్తూ, మంచి చేస్తూ, మంచిని కోరుతూ, మంచిని పెంచేలా కృషి చేస్తే విలక్షణత ఉట్టిపడుతుంది.

**డాక్టర్ యం. ప్రభు దయాల్,**
**మాజీ సెనెట్ మెంబర్ – కాకతీయ యూనివర్సిటీ,**
**మండల విద్యాశాఖాధికారి – కొత్తగూడెం**

## నమో నరసింహా

భక్తి



భగవంతుడు 'ఇందు గలడు.. అందు లేడ'ని నిరూపించిన అవతారమూర్తి నరసింహస్వామి. ప్రహ్లాదుడి పిలుపుతో ప్రకటితమైన ఉగ్ర నరసింహుడు.. ఆపై లక్ష్మీనృసింహుడిగా మన రాష్ట్రంలో వివిధ క్షేత్రాల్లో కొలువుదీరాడు. తెలంగాణ ఇలవేల్పు అయ్యాడు. యాదగిరిగుట్టపై కొలువైన ఈ కొంగుబంగారం తన బిడ్డలకు శాంతమూర్తి. బ్రహ్మోత్సవ వేళ యాదగిరిగుట్ట ఇల వైకుంఠంలా కనువిందు చేస్తుంది. అష్టలక్ష్ములనూ అనుగ్రహించే ఈ పంచనారసింహ క్షేత్రం కోలాహలంలో మనమూ భాగమవుదాం. రుష్యశృంగ మహర్షి పుత్రుడు యాదర్షి. బాల్యం నుంచి అతను నిరంతరం హరినామ స్మరణ చేసేవాడు. నరసింహుడి అనుగ్రహం కోరి కఠోరమైన తపస్సు ఆచరిస్తాడు. యాదర్షి తపస్సుకు మెచ్చిన స్వామి నరసింహుడిగా జ్వాలాకారుడిగా, భయంకర ధ్వనులతో దర్శనమిస్తాడు. ఉగ్ర రూపం ఉపశమించి శాంతదీప్తిగా కొలువుదీరమని కోరగా.. యాదగిరిపై స్వామి అర్చామూర్తిగా వెలిశాడని స్థలపురాణం. ఈ క్షేత్రానికి పాలకుడు ఆంజనేయస్వామి. హనుమంతుడి ఆజ్ఞ మేరకే యాదర్షి ఇక్కడ తపస్సు చేశాడన్న కథనం ప్రచారంలో ఉంది. ఇక్కడ విష్ణుభగవానుడు జ్వాలా నరసింహ, ఉగ్ర నరసింహ, యోగ నరసింహ, లక్ష్మీ నరసింహ, గండభేరుండ నరసింహ ఇలా పంచ నారసింహుడిగా ఏకశిలపై అవతరించినట్టు స్థలపురాణం చెబుతున్నది. కృత యుగం నుంచే స్వామి ఇక్కడ పూజలు అందుకుంటున్నాడని ప్రతీతి. జ్వాలా నరసింహుడిని ఆరాధించడానికి పరమశివుడు సైతం ఈ క్షేత్రంలో స్వయంభువుగా వెలిశాడని చెబుతారు. దీనికి బలాన్ని చేకూర్చేలా ఈ వైష్ణవ క్షేత్రంలో శివాలయం ఉండటం.. శివకేశవుల అభేదత్వానికి ప్రతీకగా కనిపిస్తుంది. క్రీస్తుశకం 12వ శతాబ్దం వరకు మునులు, యోగులు, సాధకులు, సిద్ధులు మాత్రమే స్వామిని దర్శించుకునేవారట. అందుకే స్వామికి సాధక తారకుడనే పేరు వచ్చింది. 12వ శతాబ్దిలో పశ్చిమ చాళుక్యులలో ప్రసిద్ధుడైన త్రిభువనమల్లుడు తన రాజ్య విస్తరణలో భాగంగా భువనగిరిలో కోటను నిర్మించుకొని స్వామిని సేవించినట్టు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఈ క్షేత్రంలో మొదట్లో మూడురోజులు ఉత్సవాలు చేసేవారు. తర్వాతి కాలంలో ఐదు రోజులు చేశారు. కాలక్రమంలో 11 రోజులపాటు బ్రహ్మోత్సవాలు జరగడం మొదలైంది. ఏటా పాల్గుణ శుద్ధ విదియ నుంచి ద్వాదశి వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 1న బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా 7న తేదీన ఎదుర్కోలు ఉత్సవం జరగనుంది. 8న తిరుకల్యాణ మహోత్సవం కన్నులపండువగా సాగుతుంది. 9న దివ్య విమాన రథోత్సవం, 11న గర్భాలయంలోని మూలవర్లకు సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9
హైదరాబాద్
బుధవారం
5 । మార్చి । 2025



## నేరుగా మంటపై కాల్చొద్దు



చపాతీలు, రొట్టెలను పెనం మీద చేసుకుంటాం. తర్వాత అది ఉబ్బడానికి నేరుగా మంట మీద ఉంచేస్తారు. అయితే, ఇలా చేయడం ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ వేడి దగ్గర వండినప్పుడు పదార్థాల నుంచి హెటెరోసైక్లిక్ అమైన్స్ (హెసీఏలు), పాలిసైక్లిక్ అరోమాటిక్ హైడ్రోకార్బన్స్ (పీఏహెచ్‌లు) ఉత్పత్తి అవుతాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం ఇవి రెండూ కూడా క్యాన్సర్‌తో ముడిపడి ఉన్నట్టు తెలుస్తున్నది. అధిక ఉష్ణోగ్రతల దగ్గర ఆహార పదార్థాలను వేడి చేసినా, నేరుగా మంటపై వేడికి గురిచేసినా ఈ హానికారక రసాయనాలు తయారవుతాయి. 'ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ' జర్నల్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం ప్రకారం%ొ% సహజ వాయువుతో పనిచేసే స్టవ్‌లు కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ డై ఆక్సైడ్, పార్టిక్యులేట్ మాటర్ లాంటి వాయు కాలుష్య కారకాలను విడుదల చేస్తాయి. ఇవి ఆరోగ్యానికి హాని చేస్తాయి. కాబట్టి, నేరుగా మంటపై పెట్టకుండా పెనం మీదే రొట్టెను ఓ వస్త్రంతో ఒత్తుతూ కాల్చడం ఉత్తమం. అదే నేరుగా మంటకు గురిచేస్తే రొట్టెలపై నల్లటి మాడు ఏర్పడుతుంది. వీటిలో ఆక్రిలమైడ్ అనే రసాయనం ఉంటుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం ఇది క్యాన్సర్ కారకం అని తెలుస్తున్నది.

పరిష్కార మార్గాలు

రొట్టెలు, చపాతీలు పూర్తిగా పెనం మీదే కాల్చాలి. నెమ్మదిగా ఒత్తుతూ ఉండాలి.

రొట్టె మీద మాడు గుర్తులు పడకుండా చూసుకోవాలి.

స్టవ్, పెనంపై మసి పేరుకోకుండా జాగ్రత్త వహించాలి.

# ప్లాస్టిక్ డబ్బాలతో జాగ్రత్త

ఆధునిక జీవితంలో ప్లాస్టిక్ అనివార్యమైపోయింది. ఆహార పదార్థాలు ఆర్డర్ ఇచ్చినా, కిరాణా సరుకులు తెచ్చుకోవాలన్నా ప్లాస్టిక్ లేకుండా పని జరిగే అవకాశం లేదు. మన శరీరానికి చేటు చేస్తుందని ఎన్ని హెచ్చరికలు వచ్చినా, ప్లాస్టిక్ డబ్బాల్లో తిండి మామూలు విషయమైపోయింది.



అయితే, సైన్స్ డైరెక్ట్ అనే జర్నల్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం ఒకటి ప్లాస్టిక్ డబ్బాల్లో నిల్వ ఉంచిన, వేడి చేసిన ఆహారం తినడం ఆరోగ్యానికి మంచిది కాదని హెచ్చరించింది. దీనివల్ల కంజెస్టివ్ హార్ట్ ఫెయిల్యూర్‌తోపాటు పొట్టలో ఉండే సూక్ష్మజీవుల వ్యవస్థలో కూడా మార్పులు వస్తాయని హెచ్చరించింది. దీంతో ఇన్‌ఫ్లమేషన్, రక్త ప్రసరణ వ్యవస్థ దెబ్బతినడం లాంటి ప్రమాదాలు ఉంటాయని పేర్కొన్నది.

ఏం చెప్పింది?

పరిశోధకులు తమ అధ్యయనం కోసం చైనాలో మూడువేల మందిని రెండు విభాగాలుగా చేశారు. అంతేకాకుండా ప్లాస్టిక్ ఆహార డబ్బాలకు గుండెజబ్బులకు లంకె ఏమైనా ఉందా అని తెలుసుకోవడానికి ఎలుకల మీద కూడా పరిశోధన చేశారు. ఇందులో ప్లాస్టిక్ డబ్బాల నుంచి మైక్రో ప్లాస్టిక్ కణాలు ఆహారంలోకి వెళ్లి, దాన్నుంచి మన పొట్టలోకి ప్రవేశించినట్టు పరిశోధకులు గ్రహించారు. ప్లాస్టిక్ కణాల్లోని రసాయనాలు పొట్ట లైనింగ్ దెబ్బతినడానికి కారణమవుతున్నట్టు తెలుసుకున్నారు. అంతేకాదు, ఈ రసాయనాలు పొట్టలో ఉండే సూక్ష్మజీవుల వ్యవస్థను మార్పు చెందిస్తాయి. అలా ఇన్‌ఫ్లమేషన్, రక్త ప్రసరణ వ్యవస్థ దెబ్బతినడానికి కారణమవుతున్నాయి. ఇది పేగులు నీళ్లను వడగట్టే క్రమంలో హానికరమైన కణాలు రక్త ప్రవాహంలో కలిసిపోతున్నాయి. ఇలా జరగడం వల్ల రక్త ప్రసరణ వ్యవస్థకు కీడు కలుగుతుందని పరిశోధకులు పేర్కొన్నారు. అయితే, ఈ అధ్యయనం మన ఆరోగ్యానికి ఏ రసాయనాలు హానికరమో ప్రత్యేకంగా గుర్తించలేదు. బైస్ఫినాల్ ఏ (బీపీఏ), థాలేట్స్, పీఎఫ్ఏలు లాంటివాటితో ఆరోగ్య సమస్యలు ఉంటాయని తెలిపారు.



నివారణ ఇలా

ఆహార పదార్థాల ప్యాకింగ్‌కు ప్లాస్టిక్‌కు బదులుగా స్టీలు, గాజు వస్తువులు వాడాలి.

ప్లాస్టిక్ డబ్బాల్లో ఆహార పదార్థాలను వేడి చేయకూడదు. ఇలా చేస్తే మైక్రో ప్లాస్టిక్‌లు ఆహారంలో ప్రవేశిస్తాయి.

హోటళ్లు, రెస్టారెంట్ల యాజమాన్యం కూడా ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలం ఆలోచించాలి.

ప్లాస్టిక్ వస్తువులను మైక్రోవేవ్ ఓవెన్‌లో పెట్టకపోవడమే మంచిది.

# ఆలోచనే ఆమె ఆయుధం



ఆలోచనే ఆమె ఆయుధం. ఏ విభాగంలో పనిచేసినా.. దానికి ప్రత్యేక గుర్తింపు ఎలా తీసుకురావాలో ఆమెకు తెలుసు! తన పర్యవేక్షణలో వేలాది మంది పోలీసులను తీర్చిదిద్దిన అభిలాష బిస్త్ జమానా పోలీసు అకాడమీలో చెరగని అధ్యాయం. ఇక్కడ కఠోర శిక్షణ తీసుకుంటూనే.. తమ బిడ్డలకు పాలిచ్చే బాలింతలు ఉన్నారంటే అందుకు కారణం ఆవిడే. తెలంగాణ పోలీసు అకాడమీకి తొలి మహిళా డైరెక్టర్ జనరల్‌గా పేరు గడించిన ఆమె తన సొంతకేడర్ అయిన ఏపీకి వెళ్లారు. పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా చివరి సంతకాలు చేసిన తర్వాత 'జిందగీ'తో తెలంగాణలో పోగేసుకున్న తన అనుభవాలు పంచుకున్నారు.ఆ

'ఆ హత్యాచారం కేసు సంగతేంటి? నివేదికలు వచ్చేది ఉందా? చార్జిషీట్ ఎప్పుడు సబ్మిట్ చేస్తారు?' అని న్యాయమూర్తి అడిగితే.. 'ఫోరెన్సిక్ విభాగం దగ్గర పెండింగ్‌లో ఉన్నాయి మై లార్డ్' అని సింపుల్‌గా చెప్పేవారు కొందరు పోలీసులు. ఇలా ఎన్నో కేసుల ఫైళ్లు ఫోరెన్సిక్ విభాగంలో పేరుకుపోయేవి. దీంతో బాధితులకు న్యాయం సత్వరం అందేది కాదు. అలాంటి సమయంలో తెలంగాణ ఫోరెన్సిక్ విభాగానికి హెడ్‌గా ఒక సమర్థులైన ఆఫీసర్ అవసరమని గుర్తించారు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్. డీజీపీతో మాట్లాడి అప్పటికే తన సమర్థతను నిరూపించుకున్న అభిలాష బిస్త్‌ను ఫోరెన్సిక్ విభాగానికి డీజీగా నియమించారు. బాధ్యతలు చేపట్టిన రోజు ఆమె చెప్పిన విధంగా నెల రోజుల్లోనే వ్యవస్థను చక్కదిద్దారు. నిర్దేశించిన గడువులోగా నివేదికలు సిద్ధం చేసేలా తన టీమ్‌తో పని చేయించారు. బెటాలియన్స్ డీజీగా, తెలంగాణ పోలీసు అకాడమీ తొలి మహిళా డైరెక్టర్ జనరల్‌గా ఆమె ఆలోచనలు, చేసిన పనులు అభిలాషకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి.

**దేశదేశాల్లో విధులు..**

అభిలాషది ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్. చిన్నప్పటి నుంచి పోలీసు కావాలనుకున్నారు. ఐపీఎస్ సాధించి తన కల నిజం చేసుకున్నారు. శిక్షణ తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో నారాయణపేట, బోధన్ పట్టణాల్లో ఏఎస్పీగా చేశారు. అనంతపురం, కడప తదితర జిల్లాల్లో అదనపు ఎస్పీగా, ఎస్పీగా సేవలు అందించారు. కొన్నాళ్లు భారత శాంతి పరిరక్షక దళంలో భాగంగా కొసోవోలోని శాంతి పరిరక్షక మిషన్ యూఎన్ఎంఐకేలో పనిచేశారు.

ఆమె సేవలకు గానూ 2004లో 'యూఎన్‌పీఎం' మెడల్ పొందారు. తర్వాత డిప్యుటేషన్‌పై ఉత్తరాఖండ్ వెళ్లి లా అండ్ ఆర్డర్ డీఐజీగా పనిచేశారు. మళ్లీ 2010 నుంచి 2015 వరకు లైబీరియా, సూడాన్ దేశాల్లో భద్రతా సలహాదారుగా యూనిసెఫ్‌లో పనిచేశారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి పొలిటికల్ సైన్స్‌లో ఆనర్స్ డిగ్రీ పొందారు. అంతర్జాతీయ అధ్యయనాలలో మాస్టర్స్ డిగ్రీ, జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి అంతర్జాతీయ రాజకీయాలు, సంస్థ, నిరాయుధీకరణ అధ్యయనాలలో ఎం.ఫిల్ పూర్తిచేశారు. తర్వాతి కాలంలో అడిషనల్ డీజీగా తెలంగాణలో టీజీఎస్పీ బెటాలియన్స్‌కు, ఫోరెన్సిక్ విభాగానికి హెడ్‌గా పనిచేశారు. పోలీసు సంక్షేమం, క్రీడల విభాగం ఏడీజీగానూ సేవలు అందించారు. 2023 డిసెంబర్ 22 నుంచి తెలంగాణ పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా డీజీ హోదాలో ఉన్నారు.

**అకాడమీకి తొలి మహిళా డీజీగా..**

బెటాలియన్స్ ఏడీజీగా ఉన్నప్పుడు అభిలాష బిస్త్ ఎన్నో సంస్కరణలు చేపట్టారు. ఫోరెన్సిక్ విభాగానికి ప్రత్యేక భవనం తీసుకురావడంలో చొరవ చూపారు. తన నాయకత్వంలో నాలుగు కొత్త బెటాలియన్స్‌ను తెప్పించి ఔరా అనిపించుకున్నారు. ఇక పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్కడ కూడా తన మార్క్ చూపించారు. ఎస్ఐలకు శిక్షణ ఎలా ఉండాలి? ఏ అంశాలపై అవగాహన కల్పించాలి? తదితర అంశాలలో పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు చేశారు. మహిళా అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్ల ద్వారా రిక్రూట్ అయిన 13,000 కానిస్టేబుళ్లకు తన ఆధ్వర్యంలో విజయవంతంగా ఒకేసారి శిక్షణ పూర్తయ్యేలా ఏర్పాట్లు చేశారు. చివరి దశలో వచ్చిన మరో 200 మందికి కూడా ఇబ్బంది లేకుండా శిక్షణ ఇప్పించారు. కొత్త క్రిమినల్ చట్టాలపై రాష్ట్రవ్యాప్తంగా కానిస్టేబుల్ నుంచి ఐజీ స్థాయి అధికారుల వరకూ పోలీసు అకాడమీలో శిక్షణ ఇప్పించారు. సుమారు 70వేల మంది పోలీసులు విడతల వారీగా, విధులకు




ఎలాంటి ఆటంకాలు లేకుండా కొత్త చట్టాల నిర్వహణపై శిక్షణ తీసుకున్నారంటే అది ముమ్మాటికీ అభిలాష బిస్త్ ఘనతే. పోలీసులతోపాటుగా, న్యాయవాదులు, జర్నలిస్టులు, ఎన్‌జీఓలకు సైతం పోలీసు అకాడమీలో కొత్త క్రిమినల్ చట్టాలపై శిక్షణ ఇప్పించారు. అందరికీ కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన ఉండేలా.. వివిధ భాషల్లో మూడు కొత్త చట్టాలు, మారిన సెక్షన్లపై ప్రత్యేకంగా పుస్తకాలు ప్రచురించారు.

**మెరుగైన వసతుల కల్పన..**

సాంకేతికంగా లోతైన అవగాహన ఉంటేగానీ, సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయలేం. శిక్షణ దశలోనే పోలీసులను డిజిటల్ డేర్ డెవిల్స్‌గా మార్చడానికి అభిలాష ఎంతో కృషిచేశారు. ప్రభుత్వ సహకారం, సైబర్ సెక్యూరిటీ ప్రోత్సాహంతో సైబర్‌ల్యాబ్‌లు, సైబర్ షీల్డ్ ల్యాబ్‌లు శిక్షణా కేంద్రాల్లో ప్రవేశపెట్టారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో, పోలీస్ అకాడమీ, మేడ్చల్, వరంగల్, కరీంనగర్ శిక్షణ కేంద్రాల్లో ఆధునిక సైబర్ ల్యాబ్‌లు నెలకొల్పారు. అంతేకాదు పోలీసు ట్రైనింగ్‌కు వచ్చిన తల్లులు, బాలింతల కోసం అకాడమీలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తల్లులు తమ పిల్లలకు పాలిచ్చేలా వసతి కల్పించి తల్లి మనసు చాటుకున్నారు. శిక్షణ తీసుకుంటూనే తమ పిల్లలతో గడిపేలా ప్రత్యేక షెడ్యూల్ రూపొందించారు. ట్రైనింగ్‌లో జుంబా డ్యాన్స్, యోగా, ఏరోబిక్స్, ఆత్మ రక్షణకు శిక్షణ లాంటి సెషన్స్ ప్రవేశపెట్టి సమ్‌థింగ్ స్పెషల్ అనిపించుకున్నారు. ఏ విభాగంలో పనిచేసినా 'అభిలాష ద బెస్ట్' అనిపించుకున్నారు. తర్వాతి అధికారులకు ఒక బెంచ్ మార్క్‌ను సెట్ చేశారు.

# గుర్ర్.. టెర్రర్ రోగాలకు సూచిక గురక

గురక చిన్నగానే మొదలవుతుంది. నిమిషాలు గడిచే కొద్దీ శబ్దం భరించలేని స్థాయికి చేరుకుంటుంది. రకరకాల అరుపులతో పక్కన పడుకున్నవారికి నరకమే. ఒకట్రెండు రోజులైతే ఫర్వాలేదు%ొ% కానీ, ఇది ఓ జీవితకాల రుగ్మత. కాకపోతే, చాలామంది దీన్ని ఓ సమస్యగా పరిగణించరు. తేలిగ్గా తీసుకుంటారు. పైగా బాగా గుర్రుపెట్టి నిద్రపోతే గాఢనిద్రగా పొరబడుతుంటారు. అంతేతప్ప వైద్యులను సంప్రదించరు. అవసరమైన చికిత్స తీసుకోరు. ఇకపోతే గురక సమస్యను వైద్య పరిభాషలో 'స్లీప్ ఆప్నియా' అని పిలుస్తారు. దీన్ని పట్టించుకోకుండా అలానే నిర్లక్ష్యం చేస్తే శరీరం రోగాల పుట్ట అవుతుంది. మానసిక రుగ్మతలకూ దారితీస్తుంది. ఓ దశలో ప్రాణాంతకం కూడా!

నిజం చెప్పాలంటే 'గురక' ఓ శబ్ద పిశాచం. నిద్రపోతున్నప్పుడు ఒకలా వేధిస్తే, మేల్కొన్నప్పుడు మరోలా బాధిస్తుంది. రాత్రిపూట గురకవల్ల గాఢనిద్ర దాదాపు అసాధ్యం. పరిపూర్ణమైన విశ్రాంతి అన్నదే లభించదు. ఇట్టే తెల్లవారిపోయినట్టు అనిపిస్తుంది. అయిష్టంగా మంచం దిగుతాం. ఆ నిస్సత్తువ రోజువారీ పనులకు ఆటంకం కలిగిస్తూ ఉంటుంది. ఇవన్నీ 'స్లీప్ ఆప్నియా' లక్షణాలు. తేలిగ్గా తీసుకుంటారు కానీ, ఇది చాలా తీవ్రమైన రుగ్మత. తరచూ శ్వాస ఆగి ఆగి కొనసాగుతూ ఇబ్బంది పెడుతుంది. నిద్రిస్తున్నప్పుడు పై వాయునాళం (అప్పర్ ఎయిర్ వే) పదేపదే ఒత్తిడికి గురికావడం వల్ల ఇలా జరుగుతుందని నిపుణుల అభిప్రాయం. అయితే, స్లీప్ ఆప్నియాను ఎవ్వరూ కూడా ఒక జబ్బుగా గుర్తించడం లేదు. చికిత్స కోసం వైద్యుల దగ్గరికి వెళ్లడం లేదు. పెద్దల్లో 15 నుంచి 30 శాతం మందికి ఈ సమస్య ఉంటుందని అంచనా.

**లక్షణాలు**

**పెద్దగా గురక. నిద్రలో శ్వాసపరమైన ఇబ్బందులు.**

**నోరు పొడిబారిపోయి నిద్ర మధ్యలో మేల్కొనడం.**

**ఉదయంపూట తలనొప్పి.**

**నిద్రలేమి (ఇన్‌సోమ్నియా).**

**పగటివేళల్లో మగత (హైపర్‌సోమ్నియా).**

**ఏకాగ్రత లేకపోవడం.**

**చిరుకోపం, అసహనం.**

**నిరాసక్తత.**

**చికిత్స ఎందుకు?**


స్లీప్ ఆప్నియాకు చికిత్స తీసుకోకపోతే ఎన్నో ప్రతికూల ప్రభావాలు ఉంటాయి. పొద్దంతా మగతగా ఉంటుంది. దీంతో రోజువారీ పనులకు ఆటంకం కలుగుతుంది. ఉద్యోగులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేరు. దీంతో వర్తమానంలో చేసే పనిలో, భవిష్యత్తులో పదోన్నతుల్లో వెనకబడిపోతారు. కెరీర్‌లో ఒడుదొడుకులు సంభవిస్తాయి. వ్యాపారులైతే కస్టమర్లకు సంతృప్తికరమైన సేవలు అందించలేరు. ఫలితంగా దీర్ఘకాలంలో నష్టాలపాలయ్యే అవకాశం ఉంది. మానవ సంబంధాలు దెబ్బతింటాయి. ఇవన్నీ గురక వల్ల కలిగే సామాజిక, మానసిక ఇబ్బందులు. ఇక శరీర వ్యవస్థ విషయానికొస్తే జీవక్రియ మందగిస్తుంది.

కాలక్రమంలో గుండె కవాటాలు, మెదడు కవాటాల వ్యాధులు ఇబ్బంది పెడతాయి. న్యూరోసైకియాట్రిక్ డిస్‌ఫంక్షన్, పల్మనరీ హైపర్‌టెన్షన్, టైప్-2 మధుమేహం, నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ మొదలైన వ్యాధులు తలెత్తే ప్రమాదం ఉంది. కాబట్టి, స్లీప్ ఆప్నియాను గుర్తించిన వెంటనే చికిత్స చేయించుకోవాలి.

వృద్ధాప్యం, ఊబకాయం ఈ సమస్యకు మూల కారణాలు. ముక్కుదిబ్బడ, ఒబేసిటి హైపోవెంటిలేషన్ సిండ్రోమ్, కిడ్నీ వ్యాధులు, గుండె రుగ్మతలు, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులు, డయాబెటిస్ మెలిటస్ లాంటివి కూడా స్లీప్ ఆప్నియాకు దారితీస్తాయి.

నిర్ధారణ ఇలా

పాలిసోమ్నోగ్రఫీ (పీఎస్)తో స్లీప్ ఆప్నియా నిర్ధారణ చేస్తారు. నిద్రలో శ్వాస సమస్యలను బట్టి స్లీప్ ఆప్నియా తీవ్రతను బేరీజు వేస్తారు. ఆప్నియా, హైపాప్నియా, రెరా (రెస్పిరేటరీ ఎఫర్ట్ రిలేటెడ్ అరౌజల్స్) ఉన్నాయేమో కూడా పరీక్షిస్తారు. సమస్య దశను బట్టి చికిత్స మొదలవుతుంది. బరువు తగ్గడం, రోజూ వ్యాయామం చేయడం, నిద్ర విధానంలో మార్పులు, మద్యపానం, డ్రగ్స్ తదితర దురలవాట్లను దూరంపెట్టడం.. సమస్యను అధిగమించడంలో కొంతమేరకు సాయపడతాయి. రోగ లక్షణాలను బట్టి వైద్యులు మందులను సిఫారసు చేస్తారు. తప్పనిసరి పరిస్థితుల్లో పై వాయు



నాళానికి శస్త్రచికిత్స చేస్తారు. హాయిగా నిద్ర పోవడానికి జీవనశైలిలో మార్పులు చేసుకోవడమే ఏకైక మార్గం.

నివారణ మార్గాలు

రోజూ ఒకే సమయానికి నిద్రపోవాలి, ఒకే సమయానికి మేల్కొనాలి.

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి.

మసాలాలు, ప్రాసెస్ చేసిన పదార్థాలకు దూరంగా ఉండాలి.

రోజూ కనీసం అరగంటైనా వాకింగ్ చేయాలి.

మధ్యాహ్నం తర్వాత కాఫీ, టీలు తీసుకోవద్దు.

మంచాన్ని నిద్రకు మాత్రమే ఉపయోగించాలి.

మంచం మీద కూర్చుని ల్యాప్‌టాప్‌తో పనిచేయడం, మొబైల్ చూడటం, పుస్తకం చదవడం వంటి పనులు చేయొద్దు.

పడకగదిలో తక్కువ వెలుతురు ఉండేలా చూసుకోవాలి.

**పెద్ద శబ్దంతో సంగీతం వినొద్దు.**

కొంతమంది ఉదయం ఐదు గంటలకు లేవాల్సి ఉంటే నాలుగింటికే అలారం పెట్టుకుంటారు. దీనివల్ల నిద్ర పాడవుతుంది. కాబట్టి, సరైన సమయానికే నిద్రలేవాలి.

పడుకోవడానికి కనీసం రెండు గంటల ముందే తినేయాలి.

విటమిన్లూ కీలకమే

కొన్ని రకాలైన విటమిన్లు, మినరల్స్ లోపం వల్ల కూడా నిద్ర సంబంధమైన సమస్యలు వస్తాయి. కాబట్టి, గురక సమస్య నివారణలో ఆరోగ్యకరమైన పోషకాహారం కూడా కీలకపాత్రనే పోషిస్తుంది. ఈ సమస్యను అధిగమించడానికి కొన్ని విటమిన్లు దోహదపడతాయి.

విటమిన్ డి: నిద్రలేమి, కలతనిద్ర, హఠాత్తుగా మెలకువ రావడం.. తదితర సమస్యలకు విటమిన్ డి లోపం ఓ కారణంగా చెబుతారు. నిద్ర, మెలకువకు సంబంధించిన వ్యవహారాల్ని పర్యవేక్షించడానికి మెదడులో ఓ ప్రత్యేకమైన విభాగం ఉంది. విటమిన్ డి ద్వారా దానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. కాబట్టి, శరీరంలో విటమిన్ డి కొరత అధికమైన కొద్దీ నిద్రతో ముడిపడిన సమస్యలు పెరుగుతాయి. సాల్మన్ చేపలు, గుడ్డు సొన, చీజ్, పుట్టగొడుగులు, సముద్ర ఆహారంతో విటమిన్ డి సమకూర్చుకోవచ్చు.


విటమిన్ ఎ: నిద్రలేమికి, విటమిన్ ఎకు ప్రత్యక్ష సంబంధం ఉన్నట్టు నిపుణులు గుర్తించారు. కాబట్టి క్యారెట్, ఆప్రికాట్, టమాట తదితర కూరగాయలు, తాజా పండ్లు తింటూ విటమిన్ ఎ లోటు పూడ్చుకోవాలి.

విటమిన్-బి12: నిద్రలేమి, నిస్సత్తువ విటమిన్ బి12 లోపంతో బాధపడుతున్న రోగులలో కనిపించే ప్రధాన లక్షణాలు. ఈ విటమిన్ లోపం వల్ల కుంగుబాటు తలెత్తే ముప్పు కూడా ఉంది. కుంగుబాటు ప్రధాన లక్షణాల్లో నిద్రలేమి ఒకటి. మాంసాహారం, గుడ్లు, తక్కువ కొవ్వు కలిగిన పాలు, తృణధాన్యాలు విటమిన్ బి12ను తగినంతగా అందిస్తాయి.

**మరికొన్ని..**

విటమిన్ బి9, విటమిన్ ఇ, విటమిన్ సి కూడా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నిద్రతో ముడిపడి ఉంటాయి. బి కాంప్లెక్స్ విటమిన్లలో లభించే ఫోలిక్ యాసిడ్ లోపం నిద్రలేమికి దారితీయవచ్చు. విటమిన్ ఇ లోపం రోగ నిరోధక వ్యవస్థను దెబ్బతీసి అంతిమంగా నిద్రను ప్రభావితం చేస్తుంది. విటమిన్ సి పుష్కలంగా లభించేవారికి నిద్రలేమి సమస్యే ఉండదు. మెగ్నీషియం కూడా కండరాలకు విశ్రాంతిని ఇచ్చి నిద్రాదేవతకు ఆహ్వానం పలుకుతుంది. కొంతమంది రాత్రిళ్లు వ్యాయామం, సుదీర్ఘమైన నడక లాంటివి చేస్తుంటారు. ఇలా చేయకపోవడమే మంచిది. నాణ్యమైన నిద్రతోనే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. నిద్రలో సంతృప్తి లేనప్పుడు జీవితమూ అసంతృప్తికరమే. కాబట్టి, హాయిగా నిద్రించండి. ఆనందంగా జీవించండి.

# లేత కొబ్బరిలో...



ఎండ పెరుగుతోంది కాబట్టి అప్పుడప్పుడూ కొబ్బరినీళ్లు తాగుతూ ఉంటాం. అయితే కొబ్బరినీళ్లు తాగేసి కాయ విసిరేయకుండా, దాన్లోని లేత కొబ్బరిని కూడా తింటూ ఉండాలి. ఎందుకంటే...


లేత కొబ్బరిలో పీచు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి జీర్ణశక్తి మెరుగు పడుతుంది. పేగులు కూడా ఆరోగ్యంగా ఉంటాయి

లేత కొబ్బరిలో ఉండే పొటాషియం, ఎలక్ట్రొలైట్లు వ్యాయామం నుంచి కోలుకునే అత్యవసర పోషకాలను భర్తీ చేస్తాయి. కాబట్టి లేత కొబ్బరిని వ్యాయామం తర్వాత అల్పాహారంగా తీసుకోవచ్చు

లేత కొబ్బరిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు గుండెకు మేలు చేస్తాయి

లేత కొబ్బరిలో యాంటీబ్యాక్టీరియల్, యాంటీవైరల్ గుణాలు కలిగిన లారిక్ యాసిడ్





## విపశ్యన ధ్యానం కోర్సుకు వెళ్లనున్న కేజ్రీవాల్.. పదిరోజుల పాటూ అక్కడే..!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇటీవలే జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం పార్టీ కార్యకలాపాలకే పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆయన 'విపశ్యన ధ్యానం కోర్సు'కు వెళ్లనున్నట్లు తెలిసింది. పది రోజుల పాటు ఈ ధ్యాన కార్యక్రమంలో పాల్గొననున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఇందుకోసం ఆయన పంజాబ్ లోని హోషియార్‌పూర్ వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మార్చి 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ ఆయన ధ్యాన కేంద్రంలోనే ఉండనున్నట్లు తెలిసింది. కాగా, గతంలోనూ కేజ్రీ పది రోజులపాటు విపశ్యన ధ్యానం చేసిన విషయం తెలిసిందే. 2023 డిసెంబర్‌లో హోషియార్‌పూర్‌లోని ధ్యాన కేంద్రంలోనే ఉన్నారు. ఇప్పుడు మరోసారి ఆయన అక్కడికి వెళ్లనున్నారు.విపశ్యన మెడిటేషన్ అనేది పురాతన భారతీయ ధ్యాన పద్ధతి. ఇందులో అభ్యాసకులు వారి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోడానికి కోర్సు పూర్తయ్యేవరకు పదిరోజుల పాటు ఎవరితో మాట్లాడకుండా ఉంటారు. అలాగే అభ్యాసన కేంద్రం నుంచి బయటకు రావడం అనేది ఉండదు. బయటివ్యక్తులకు ఇందులో ప్రవేశం ఉండదు. కాగా, కేజ్రీవాల్ చాలా కాలంగా విపశ్యన ధ్యాన సాధన చేస్తున్నారు. గతంలో బెంగళూరు, జైపూర్‌తోసహా అనేక ప్రాంతాల్లో ఆయన ధ్యానం సాధన చేశారు.

## పరీక్షకు బయలుదేరుతుండగా తల్లి మృతి.. ఎగ్జామ్ రాసొచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్న విద్యార్థి!



**న్యూఢిల్లీ-నవభూమి:** పిల్లలకు పరీక్షలంటే వాళ్లకంటే వాళ్ల తల్లిదండ్రులే ఎక్కువగా కంగారుపడుతుంటారు. వారి నిద్ర, తిండి విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. పరీక్షకు బయలుదేరేటప్పుడు ఇంటి బయటికి వచ్చి సాగనంపుతారు. పరీక్ష బాగా రాయి అంటూ బెస్ట్ ఆఫ్ లక్ చెబుతారు. ఈ విషయంలో తండ్రుల కంటే తల్లులు ఇంకా ఎక్కువ శ్రద్ధ తీసుకుంటారు. కానీ తమిళనాడు లోని ఓ ఇంటర్మీడియట్ విద్యార్థి కి మాత్రం ఆ అదృష్టం లేకుండా పోయింది. తీరా పరీక్ష నాడు, పరీక్షకు బయలుదేరే ముందు తల్లి అనారోగ్యంతో కుప్పకూలి ప్రాణాలు విడిచింది. అయినా అతను పుట్టెడు దుఃఖా?న్ని దిగమింగుకుని పరీక్ష రాసి వచ్చాడు. ఆ తర్వాత తల్లి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు.వివరాల్లోకి వెళ్తే.. తమిళనాడు రాష్ట్రం తిరునల్వేలి జిల్లా వల్లియూర్ గ్రామానికి చెందిన సునీల్ కుమార్ (17) తన తల్లి సుభలక్ష్మి (40), చెల్లెలితో కలిసి ఉంటున్నాడు. ఆరేళ్ల క్రితమే తండ్రి క్రిష్ణమూర్తి చనిపోవడంతో కూలీనాలి చేసి పిల్లలిద్దరినీ తల్లే పోషిస్తోంది. సునీల్‌కుమార్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్నాడు. అతని చెల్లెలు స్కూల్‌కు వెళ్తోంది. ఈ క్రమంలో సుభలక్ష్మికి గుండెపోటు వచ్చింది. దాంతో ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్న ఆమె ఇటీవలే డిశ్చార్జి అయ్యి ఇంటికి వచ్చింది. సునీల్‌కు ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి. మంగళవారం అతను తమిళం పరీక్ష రాయాల్సి ఉంది.దాంతో ఉదయాన్నే లేచి రెడీ అయ్యి పరీక్షకు బయలుదేరే ముందు పరిస్థితి విషమించడంతో అతని తల్లి ఒక్కసారిగా కుప్పకూలింది. విలవిల్లాడుతూ ప్రాణాలు విడిచింది. పిల్లల ఏడుపు విని ఇరుగుపొరుగు ఆ ఇంటికి చేరుకున్నారు. పిల్లలను ఓదార్చారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్.. తాను బాగా చదువుకోవాలనేది తన తల్లి కోరిక అని, ఇప్పుడు పరీక్ష రాయకపోతే అమ్మ ఆత్మ క్షోభిస్తదని చెబుతూ ఆమె కాళ్లపై పడి విలపించాడు. అమ్మ కోసం తాను పరీక్ష రాసి వస్తానని చెప్పాడు. దాంతో ఇరుగుపొరుగు కూడా సునీల్‌కు సహకరించారు. అతడిని దగ్గరుండి పరీక్షకు తీసుకెళ్లారు. పరీక్ష పూర్తవగానే ఇంటికి తీసుకొచ్చి సుభలక్ష్మి అంత్యక్రియలు పూర్తిచేశారు.పరీక్ష అనంతరం సునీల్ కుమార్‌తోపాటు స్కూల్లోని అతని స్నేహితులు, క్లాస్‌మేట్స్ అంతా అతని ఇంటికి వెళ్లారు. అంత్యక్రియలు పూర్తయ్యేవరకు సునీల్‌తో ఉండి ధైర్యం చెప్పారు. ఈ విషాద ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పందించారు. ఇది తమిళ సమాజమని, తమకు తమ జీవితాలకంటే చదువే ముఖ్యమని పేర్కొన్నారు. తమిళులకు ఏదైనా సమస్య వస్తే ఆ ప్రతిధ్వనిని నిజంగా నిశ్శబ్దం ఆవహిస్తుందని తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. సునీల్‌కుమార్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి స్వయంగా సునీల్ కుమార్ ఇంటికి వెళ్లి సుభలక్ష్మి మృతికి సంతాపం తెలిపారు.

## పెళ్లికారు బీభత్సం.. గాల్లోకి ఎగిరి పడ్డ బైకర్లు..



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ఉత్తంప్రదేశ్ రాయ్‌బరేలీ లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఓ ఎస్‌యూవీ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా వెళ్తూ ఎదురుగా వస్తున్న బైక్ ఓ పాదచారిని బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు అమాంతం గాల్లో ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఇందుకు సంబంధించిన షాకింగ్ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.ఈ ఘటన లక్నో ప్రయాగ్‌రాజ్ జాతీయ రహదారిపై ఉంచహార్ మార్కెట్ ప్రాంతంలో ఆదివారం జరిగింది. పూలతో డెకొరేట్ చేసిన పెళ్లి కారు అటుగా వెళ్తోంది. అదే సమయంలో ఎదురుగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వస్తున్నారు. అతివేగంగా వెళ్తున్న కారు డ్రైవర్ వాహనంపై నియంత్రణకోల్పోయి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొట్టాడు. దీంతో వారు గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడ్డారు. బాధితులు కందరవకు చెందిన సూర్య, గురు శరణ్‌గా గుర్తించారు. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలై నట్లు తెలుస్తోంది.ప్రమాదం అనంతరం డ్రైవర్ కారును ఆపకుండా అలాగే వేగంగా దూసుకెళ్లాడు. ఈ క్రమంలో కాస్త ముందుకు వెళ్లిన తర్వాత హనుమాన్ దేవాలయం సమీపంలో రోడ్డుపై నడుస్తున్న మహ్మద్ కలీమ్‌ను ఢీ కొట్టాడు. అప్రమత్తమైన స్థానికులు క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా వరుస ప్రమాదాలకు కారణమైన కారు డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

## రెండుగా విడిపోయిన రైలు.. ఆందోళనలో ప్రయాణికులు



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ఉత్తరప్రదేశ్‌లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఓ రైలు ఒండుగా విడిపోయింది. ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే, అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి గాయాలూ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.నందన్ కానన్ ఎక్స్‌ప్రెస్ రైలు సోమవారం ఢిల్లీ నుంచి ఒడిశాలోని పూరికి బయల్దేరింది. అయితే, ఈ రైలు ఉత్తరప్రదేశ్‌లోని చందౌలీ లో గల పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్ సమీపంలోకి రాగానే రెండుగా విడిపోయింది . కప్లింగ్ విరిగిపోవడంతో ఽ%-4, %ఽ%-5 కోచ్‌లు రెండుగా విడిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన అధికారులు చర్యలు చేపట్టారు. ప్రయాణికులను మరొక కోచ్‌కు తరలించారు. దాదాపు నాలుగు గంటలు శ్రమించి సమస్యను పరిష్కరించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదు. రైలు వేగం తక్కువగా ఉండటంతో ప్రమాదం తప్పినట్లు ఓ ప్రయాణికుడు తెలిపారు.

## 1,111 సార్లు రక్తదానం చేసి 24 లక్షల మంది చిన్నారులను కాపాడిన ఆ పెద్దాయన ఇకలేరు..!



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచ వ్యాప్తంగా 24 లక్షలకు పైగా చిన్నారులను కాపాడి ప్రసిద్ధికెక్కిన ఆస్ట్రేలియా రక్తదాత జేమ్స్ హారిసన్ ఇకలేరు. ప్రస్తుతం 88 ఏళ్ల వయసు కల్గిన ఈయన నిద్రలోనే ప్రాణాలు కోల్పోయారు. అరుదైన, విలువైన యాంటీ బాడీలు కల్గిన ఈయన రక్త చాలా ప్రత్యేకం కావడంతో.. 60 ఏళ్లుగా రెండు వారాలకు ఒకసారి రక్తదానం చేస్తూ వచ్చారు. ఇలా మొత్తంగా ఇప్పటి వరకు 1111 సార్లు రక్తదానం చేశారు. ఎవరూ ఊహించని స్థాయిలో లక్షలాది మంది చిన్నారులను కాపాడి రికార్డు సృష్టించారు. ఇన్ని సేవలు చేసిన ఈయన అసలు కథేంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.ఆస్ట్రేలియాకు చెందిన జేమ్స్ హారిసన్ 1936వ సంవత్సరం డిసెంబర్ 27వ తేదీన జన్మించాడు. అయితే 14 ఏళ్ల వయసులో ఉండగా.. జేమ్స్ హారిసన్‌కు ఛాతి భాగంలో ఆపరేషన్ జరిగంది. అప్పుడే అతడికి 13 లీటర్ల రక్తం అవసరం కాగా అనేక మంది రక్తదానం చేశారు. ఇలా అందరి సాయంతో మూడు నెలల ఆస్పత్రిలోనే చికిత్స పొంది ప్రాణాలతో బయట పడ్డాడు. ఇలా పూర్తిగా నయమైన తర్వాత జేమ్స్ హారిసన్ రక్తం చిక్కగా ఉండడం గమనించిన వైద్యులు సాంపిల్స్ తీసుకున్నారు. పలు రకాల పరీక్షలు చేసి ఇతడి రక్తంలో రీసస్ అనే వ్యాధిని నయం చేసే యాంటీ బాడీలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీని వల్ల నవజాత శిశువులను సులువుగా కాపాడొచ్చని చెప్పారు. ఆ విషయం తెలుసుకున్న జేమ్స్ హారిసన్.. తనకు రక్తదానం చేసి ప్రాణాలు కాపాడిన వారిని గుర్తు తెచ్చుకుని తాను కూడా అలాగే ఇతరులకు ప్రాణం పోయాలనుకున్నారు. అందుకోసం ఎన్నిసార్లు అయినా సరే రక్తదానం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని వైద్యులకు కూడా వివరించారు.

ఇలా ఈ విషయం ఆస్ట్రేలియా మొత్తం పాకిపోగా.. జాతీయ స్థాయిలో జేమ్స్ హారిసన్ రక్తానికి గుర్తింపు వచ్చింది. ఇక అప్పటి నుంచి గర్భిణీ స్త్రీలు, నవజాత శిశువులకు సమస్యలు వచ్చినప్పుడల్లా ఆయన్ను పిలవడం.. రక్తం తీసుకుని వారికి ప్రాణం పోయడం అలవాటు చేసుకున్నారు. వైద్యులు పిలిచినా పిలవకపోయినా.. ప్రతీ రెండు వారాలకు ఒకసారి జేమ్స్ హారిసన్ రక్త దానం చేయడం ప్రారంభించారు. ఇలా ఇప్పటి వరకు మొత్తంగా 1,111 సార్లు రక్తదానం చేశారు. దాన్ని ఉపయోగించే వైద్యులు మొత్తంగా 24 లక్షలకు పైగా నవజాత శిశువులను కాపాడారు.ఇది మాత్రమే కాకుండా జేమ్స్ హారిసన్ రక్త నమూనాలతోనే యాంటీ - డీ ఇమ్యూన్ గ్లోబులిన్ అనే మెడిసిన్‌ను కూడా తయారు చేశారు. ఇలా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన జేమ్స్ హారిసన్.. ఫిబ్రవరి 17వ తేదీన ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా న్యూ సౌత్ వేల్స్‌లోని ఓ నర్సింగ్ హోమ్‌లో నిద్రిస్తూనే ప్రశాంతంగా కన్నుమూశారు. అయితే ఈ వార్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జేమ్స్ హారిసన్ మృతి విషయం తెలుసుకున్న ప్రతీ ఒక్కరూ ఆయన సేవలను గుర్తు చేసుకుంటున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నారు.

## గాండ్రిస్తున్న పులి పిల్లలను ఒళ్లోకి తీసుకుని ఆడిస్తున్న ప్రధాని మోదీ..



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవలే గుజరాత్‌లో వన్యప్రాణుల రక్షణ, పునరావాసాం, సంరక్షణ కేంద్రమైన వంతారాను ప్రారంభించారు. అయితే తాజాగా ఈరోజు దాన్ని సందర్శించారు. ఈక్రమంలోనే అక్కడ ఉన్న చిన్న చిన్న పులి పిల్లలతో ఆడుకుంటూ సందడి చేశారు. ముఖ్యంగా ప్రధాని మోదీ ఓ కుర్చీపై కూర్చుని ఉండగా... నాలుగైదు బుజ్జి బుజ్జి చిరుత పిల్లలు ఆయన చుట్టూనే తిరుగుతూ కనిపించాయి. ఈక్రమంలోనే ఓ పులి పిల్ల గాండ్రించగా.. మోదీ మురిసిపోతూ దాన్ని చూశారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం రోజు గిర్ అడవుల్లో సఫారీకి వెళ్లారు. అయితే ఈరోజు తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఏర్పాటు చేసిన వంతారాను సందర్శించారు. ముఖ్యంగా ఇక్కడ గాయపడిన, ఇబ్బందుల్లో ఉన్న జంతువులను సంరక్షించే లక్ష్యంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, రిలయన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ అనంత్ అంబానీ దీన్ని ఏర్పాటు చేశారు. ఇటీవలే ప్రధాని మోదీయే నేరుగా దీన్ని ప్రారంభించారు. అయితే ఈరోజు అక్కడకు మరోసారి వెళ్లారు మోదీ.ఈక్రమంలోనే అక్కడున్న వన్యప్రాణుల ఆస్పత్రిని, జంతువుల కోసం ఏర్పాటు చేసిన ఎంఆర్ఐ, సిటీ స్కాన్‌లు, ఐసీయూలు, వైల్డ్‌లైఫ్ అనస్థీషియా, కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఎండోస్కోపీ, డెంటిస్ట్రీ, ఇంటరన్ మొదలైనా మెడిసిన్ విభాగాలను పరిశీలించారు. ఈ కేంద్రంలో మొత్తంగా 2,000 కంటే ఎక్కువ జాతులకు చెందిన వన్యప్రాణులు, 1.5 లక్షలకు పైగా అంతరిం చినపోతున్న జంతువులు ఉండగా.. వాటిని సందర్శించారు. ఈ సందర్భం గానే అనేక జంతువులతో సన్నిహితంగా మెలుగుతూ సందడి చేశారు.ముఖ్యంగా పులి పిల్లలతో కలిసి ఆడుకున్నారు. అలాగే వాటికి ఆహారం అందజేస్తూ తెగ మురిసిపోయారు. కేవలం వీటికి మాత్రమే కాకుండా జిరాఫీలకు కూడా ఆహారం అందించారు. ఆపై ఒకాపిని తడిమారు. చింపాజీలను కూడా దగ్గరకు తీసుకున్నారు. ఒరంగుటాన్లను కౌగిలించుకు న్నారు. నీళ్లలో ఉంటే నీటి ఏనుగులు, మొసళ్లు, జీబ్రాలను చూశారు.

## బర్త్ డే రోజే ఐఐటీ బాబా సుసైడ్ అటెంప్ట్..అసలేం జరిగింది?



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ఊరంతటిది ఓ దారైతే..ఉలిపికట్టెది ఓదారి అని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. అలాంటివాడే ఐఐటీ బాబా. ఈమధ్య వివాదాస్పద కామెంట్లు చేసి నెటిజన్ల చివాట్లు తిన్నాడు. తింటే తిన్నాడు కానీ దేశమంతా తెలిసిపోయాడు. కానీ అదే అతడికి శాపమైనట్టు ఉంది. హఠాత్తుగా ఐఐటీ బాబా సుసైడ్ అటెంప్ట్ చేశారనే వార్తలు వచ్చాయి. అసలేం జరిగింది..ఐఐటీ బాబా ఎందుకు ఆత్మహత్యాయత్నం చేశారో చూద్దాం.. ప్రయాగ్ రాజ్ మహా కుంభమేళా సందర్భంగా దేశవ్యాప్తంగా ఐఐటీ బాబా పేరు వైరల్ అయ్యింది. ఈయన అసలు పేరు అభయ్ సింగ్. ఐఐటీ బొంబే ఓల్డ్ స్టూడెంట్. ఏరోస్పేస్ ఇంజినీర్ గ్రాడ్యుయేట్. 2008 జేఈఈలో జాతీయ స్థాయిలో 731 వ ర్యాంకు సాధించిన ఉన్నత విద్యావంతుడు. ఏమైందో ఏమో గాని ఆ తర్వాత బాబా అవతారం ఎత్తాడు. రీసెంట్ గా చాంపియన్స్ ట్రోఫీలో పాకిస్తాన్ తో మ్యాచ్ లో ఇండియా ఓడిపోతుందని జోస్యం చెప్పి దేశ వ్యాప్తంగా విమర్శల పాలయ్యాడు. దేశమంతా శత్రువులను కొనితెచ్చుకున్నాడు. అతడిపై కొందరు కాషాయ వ్యక్తులు దాడికి కూడా ప్రయత్నించారని వాపోయాడు కూడా. తాజాగా ఈ ఐఐటీ బాబా మళ్లీ వార్తల్లోకి వచ్చాడు. రాజస్థాన్ రాజధాని జైపూర్ లో ఓ హోటల్ లో ఐఐటీ బాబా సూసైడ్ అటెంప్ట్ చేశాడనే వార్తలు గుప్పుమన్నాయి. ఈ విషయం పోలీసులకు తెలిసి అక్కడి వెళ్లారు. తీరా ఆ రోజే అతడి బర్త్ డే. పుట్టిన రోజు నాడే ఆత్మహత్య చేసుకోవాల్సినంత కష్టం ఏమొచ్చిందని నెట్టింట చర్చకు కూడా దారితీసింది. ఐఐటీ బాబా సుసైడ్ అటెంప్ట్ విషయం తెలిసిన పోలీసులు ఆ హోటల్ కు వెళ్లారు. అక్కడికి వెళ్లిన పోలీసులకు ఐఐటీ బాబా పెద్ద షాకే ఇచ్చాడు. తాను గంజాయి సేవించినట్టు పోలీసులతో చెప్పాడు. గంజాయి తాగి మైకంలో ఉన్న అతని వాలకాన్ని చూసిన కొందరు ఆత్మహత్య యత్నం చేశాడమోనని పోలీసులకు ఫోన్ చేసినట్టు చెబుతున్నారు. ఐఐటీ బాబా వద్ద పోలీసులకు కొంత గంజాయి లభించింది. అయితే నార్కొటిక్ చట్టం ప్రకారం పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే అది కొంత పరిమాణంలోనే ఉండటంతో ఆ తర్వాత బెయిల్ పై విడుదల చేశారు పోలీసులు. బెయిల్ విడుదల చేసినప్పటికీ అవసరమైతే మళ్లీ విచారణకు పిలుస్తామని సూచించారు. గంజాయి, ఆత్మహత్యా యత్నం విషయాలపై ఐఐటీ బాబాను మీడియా ప్రశ్నిస్తే.. నేడు తన బర్త్ డే అని తాను సంతోషంగా ఉండా లని అనుకుంటున్నానని వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడం తో..ఇలాంటి గంజాయి బ్యాచ్ గాళ్లను బాబాలు అని పిలువడమేంటోనని కొందరు ట్రోల్స్ చేస్తున్నారు. దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న ఇలాంటి వారిని కటకటాల వెనక్కి పంపించాల్సిన అవసరముందని అంటున్నారు నెటిజన్లు.

## యూట్యూబరూ.. ఇదే తగ్గించుకుంటే మంచిది!




**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** దేశమంతటా సంచలనం రేపిన 'ఇండియా'స్ గాట్ లేటెంట్' యూట్యూబ్ షో వివాదం ఇంకా ముదురుతూనే ఉంది. ఈ షోలో చేసిన అసభ్యకర వ్యాఖ్యల కారణంగా ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా చట్టపరమైన ఇబ్బందుల్లో పడిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో రణ్‌వీర్‌తో పాటు షో హోస్ట్ సమయ్ రైనా కూడా కోర్టు కేసులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కెనడాలో నిర్వహించిన ఓ షోలో సమయ్ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలు మరోసారి వివాదానికి దారితీశాయి. "బీర్‌బైసెప్స్ (రణ్‌వీర్ అలహాబాదియా)ను గుర్తు పెట్టుకోండి! బహుశా నా అదృష్టం అంతగా కలిసి రావడం లేదు. కానీ ఒకటి మాత్రం మర్చిపోకండినా పేరే సమయ్" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేగాక, "ఈ షో టికెట్లు కొనడం ద్వారా నా కోర్టు ఖర్చులు భరించినందుకు ధన్యవాదాలు" అంటూ తనపై వచ్చిన కేసులను హాస్యరూపంలో ప్రస్తావించారు. ఈ వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. విచారణ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానిస్తూ, "ఈ యువకులు తమకే అన్నీ తెలుసనుకుంటున్నారు. బహుశా మేము పాతతరమని భావిస్తారా? వీరిలో ఒకరు విదేశాలకు వెళ్లి మరింత హాస్యంగా ప్రవర్తించారు. మా న్యాయపరిధి ఎంత వరకు విస్తరించి ఉందో వీరికి తెలుసా?" అంటూ తీవ్రంగా హెచ్చరించారు. అయితే, "ఇంతటితో ఆగిపోతాం. ఇవే చివరి హెచ్చరికలు. వారు తమ తప్పును అర్థం చేసుకుని బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తారని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఆర్జేడీ ఎమ్మెల్సీకి సుప్రీం ఊరట అలహాబాదియాకు కూడా కోర్టు గట్టి హెచ్చరికలు జారీ చేసింది. "భావ ప్రకటన స్వేచ్ఛను అర్థం చేసుకోవాలి. హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఉంటాయి. ఈ పరిమితులను దాటితే చట్టం తన విధిని నిర్వర్తిస్తుంది" అని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. అయితే, రణ్‌వీర్ యూట్యూబ్ షోపై విధించిన నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు కోర్టు ప్రకటించింది. కానీ, ఇకపై నైతిక ప్రమాణాలకు లోబడి వ్యవహరించాలని, ఈ విషయాన్ని అంగీకరిస్తూ హామీ పత్రం సమర్పించాల్సిందిగా ఆదేశించింది.

## ఆన్ లైన్ గేమ్స్ ఆడొద్దన్నందుకు కుటుంబాన్ని చంపేసిన ఇంటర్ విద్యార్థి!

**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** నేటి యువతకు విచక్షణ ఉండటం లేదు. చిన్న చిన్న కారణాలకే తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నారు. సోషల్ మీడియా ప్రభావం, పరిసరాల ప్రభావంతో యువత ఎంతకైనా తెగిం చవచ్చు..ఏమైనా చేసేయవచ్చు..అనే ఆలోచన లో ఉంటున్నారు. కుటుంబ బంధాలు మరుస్తు న్నారు. క్షణికావేశంలో పెను నష్టానికి కారణ మవుతున్నారు. ఆన్ లైన్ గేమ్స్ ఆడొద్దు..సెల్ ఫోన్ ఎక్కువగా వాడొద్దన్నందుకు తాము ఆత్మ హత్య చేసుకోవడమో..ఇతరులను కొట్టడమో, చంపడమో చేస్తున్నారు. ఇటీవల ఇలాంటి నేరాలు పెరిగి ఆందోళన కలిగిస్తు న్నాయి. తాజాగా ఒడిశాలో ఓ దారుణం జరిగింది. ఆన్ లైన్ గేమ్స్ ఆడొద్దన్నారని ఓ విద్యార్థి ఏకంగా తన తల్లిదండ్రులు, సోదరిని హత్య చేశాడు. ఒడిశాలోని జగత్సింగపూర్ జిల్లా సదర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జయబాడా గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున తల్లిదండ్రులతో సహా తోబుట్టువును దారుణంగా చంపేశాడు. ఇంటర్ చదివే సూర్యకాంత శెట్టి..తండ్రి ప్రశాంత శెట్టి(58), కనకలత(45), సోదరి రోజాలిన్(16) ల తలలపై బలంగా మోదీ హత్య చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడి అదుపులోకి తీసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ముగ్గరి డెడ్ బాడీలను పోస్టుమార్టానికి తరలించారు. ఆన్ లైన్ గేమ్స్ కు బానిసైన ఇంటర్ చదివే విద్యార్థి సొంత కుటుంబాన్ని హత్య చేయడం ఒడిషా రాష్ట్రంలో సంచలనం రేకెత్తించింది. నేటి సమాజంలో ఆన్ లైన్ గేమ్స్, వీడియో గేమ్ లు యువతపై పెను ప్రభావం చూపిస్తున్నాయి. విద్యార్థులు అవగాహన లేమితో ఆన్ లైన్ గేమ్స్ ఆడటం వాటిలో నష్టపోవడం, లక్షల రూపాయలను అందులో పోగొట్టుకుని ఆత్మహత్యల దాక వెళుతున్నారు. మరికొందరు వీటి వల్ల అప్పుల పాలై ఇతరులను చంపడం చేస్తున్నారు. ఆన్ లైన్ గేమ్స్ ఆడొద్దు.. సోషల్ మీడియా చూడొద్దు అంటున్న తల్లిదండ్రులు, తోబుట్టువులను కొట్టడానికి, చంపడానికి వెనకాడడం లేదు. వీటి ద్వారా యువతలో నేర స్వాభావం పెరిగిపోతోంది. ఇది సమాజంలో అరాచకాలకు దారితీస్తోంది. ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టడి చేయడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు, సామాజికవేత్తలు, ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. ఆన్ లైన్ గేమ్స్ యాప్స్ ను బ్యాన్ చేయడంతో పాటు.. వాటి వల్ల జరిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు టెక్నాలజీలో ముందుండాలని, సోషల్ స్టేటస్ లో భాగంగా ఖరీదైన సెల్ ఫోన్లు కొనివ్వడం, పాకెట్ మనీకి వేల రూపాయలు ఇవ్వడం వంటివి మానుకోవాలని సైకాలజిస్టులు సూచిస్తున్నారు. సమాజంలో ఆన్ లైన్ విపరీత పోకడలకు పోతోందని ఈ విషయంలో తల్లిదండ్రులు, ప్రభుత్వాలు జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు.

## ఇండియన్ ఐటీ బిజినెస్ మోడల్ పనైపోయిందట..



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** భారత ఐటీ ఇండస్ట్రీ దశాబ్దాలుగా అనుసరిస్తున్న సంప్రదాయ బిజినెస్ మోడల్ పని అయిపోయిందని ప్రముఖ ఐటీ సంస్థ %ఎజా% టెక్నాలజీస్ సీఈవో విజయ్ కుమార్ ప్రకటించారు. అధునాతన కృత్రిమ మేధస్సు టెక్నాలజీల ప్రబలంతో హోస్టింగ్, మానవ వనరులపై ఆధారపడే పద్ధతులు ఇక ప్రయోజనం కలిగించవని స్పష్టం చేశారు. - AI ప్రభావంతో మారుతున్న ఐటీ వ్యాపారం అధునాతన యాంత్రిక లెర్నింగ్, ఆటోమేషన్ టూల్స్ అభివృద్ధితో, కన్వెన్షనల్ ఐటీ సేవల మోడల్ మరుగున పడుతోందని విజయ్ కుమార్ అభిప్రాయపడ్డారు. "ఇప్పటి వరకూ ఎక్కువ మంది ఉద్యోగులతో ప్రాజెక్టలను నిర్వహిస్తూ మిగులు ఆదాయాన్ని సృష్టించే పద్ధతి ఉపయోగంలో ఉండేది. కానీ ఇప్పుడు, మేము సగం ఉద్యోగులతోనే రెట్టింపు రెవెన్యూ సాధించే దిశగా అడుగులు వేస్తున్నాం" అని ఆయన వివరించారు. మార్పు అనివార్యం HCL టెక్నాలజీస్ సహా అనేక ఐటీ కంపెనీలు ఆధారిత డెలివరీ మోడళ్ల వైపు మళ్లాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. వ్యాపారం మెరుగైన వృద్ధిని సాధించాలంటే కంపెనీల మైండ్‌సెట్ మారాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. క్లౌడ్ కంప్యూటింగ్, డేటా ఎనలిటిక్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలను సమర్థవంతంగా ఉపయోగించుకుంటే, తక్కువ ఖర్చుతో అధిక ఉత్పాదకత సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. - ఉద్యోగ అవకాశాలపై ప్రభావం విస్తృతంగా ప్రవేశించడంతో ఐటీ ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడుతుందా అనే ప్రశ్నను కూడా ఆయన సమాధానమిచ్చారు. "సంప్రదాయ ఉద్యోగ పాత్రలు మారుతున్నాయి. అయితే, కొత్త టెక్నాలజీలను నేర్చుకున్నవారికి పెద్ద అవకాశాలు ఉన్నాయి. సంస్థలు మెరుగైన విధంగా ఉపయోగిం చుకోవ డానికి ఉద్యోగులకు ట్రైనింగ్ అందించాల్సిన అవసరం ఉంది," అని వివరించారు. టెక్నాలజీస్ ఇప్పటికే ధారిత పరిష్కారాలను పరిశోధిస్తున్నట్టు ఆయన తెలిపారు. కంపెనీలన్నీ దీని గురించి ముందుగానే ఆలోచించి తమ వ్యాపార మోడళ్లను సవరించుకుంటే మాత్రమే భవిష్యత్తులో పోటీలో నిలబడగలవన్నారు. ఈ మార్పుల వల్ల భారత ఐటీ పరిశ్రమ తన ప్రాధాన్యతను ఎలా కొనసాగించుకుంటుందో చూడాలి!

## ఇంకా కోమాలోనే భారత విద్యార్థిని.. హెల్త్ అప్‌డేట్ ఇచ్చిన కుటుంబం



**అమెరికా-నవభూమి:** అమెరికాలో రోడ్డు ప్రమాదానికి గురై కోమాలో ఉన్న భారతీయ విద్యార్థి నీలమ్ షిండే తల్లిదండ్రులు యూఎస్ చేరుకున్నారు. గత వారం వారికి ఎమర్జెన్సీ వీసా మంజూరైన విషయం తెలిసిందే. వెంటనే వారు యూఎస్ బయల్దేరి వెళ్లారు. ఈ క్రమంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నీలమ్ షిండే వద్దకు వెళ్లారు. ఆసుపత్రి అధికారులను కలిసి నీలమ్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హెల్త్ అప్‌డేట్ ( ఇచ్చారు. నీలమ్ ఇప్పటికీ కోమాలోనే ఉన్నట్లు చెప్పారు. అయితే, కాస్త మెరుగుదల కనిపిస్తోందని.. మెదడుపై ఒత్తిడి తగ్గినట్లు చెప్పారు. ఆమెకు శస్త్రచికిత్స కూడా విజయవంతమైనట్లు నీలమ్ మామ సంజయ్ కదమ్ మీడియాకు తెలిపారు.అమెరికాలోని ఒక యూనివర్సిటీలో చదువుతున్న మహారాష్ట్ర సితార జిల్లాకు చెందిన నీలమ్ షిండే (35) ఈనెల 14న కాలిఫోర్నియాలో ఫోర్ వీలర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్నది. ప్రస్తుతం విద్యార్థిని కోమాలో ఉంది. ఆమెకు బ్రెయిన్ సర్జరీ చేయాలని వైద్యులు తెలిపారు. దీంతో కుమార్తెను చూసేందుకు వీసా కోసం తల్లిదండ్రులు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే, వారికి వీసా మంజూరు కాలేదు. దీంతో లోక్‌సభ ఎంపీ సుప్రియా సూలే జోక్యం చేసుకొని.. నీలమ్ షిండే చావుబతుకుల్లో ఉందని ఆమెను చూసేందుకు తల్లిదండ్రులకు అత్యవసర వీసా మంజూరు అయ్యేలా చూడాలని కేంద్ర విదేశాంగ శాఖను కోరారు.ఆమె విజ్ఞప్తితో జోక్యం చేసుకున్న విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ.. బాధిత కుటుంబానికి యూఎస్ వీసా అపాయింట్‌మెంట్ ఇంటర్వ్యూ స్లాట్‌ను వేగవంతం చేసింది. వారి అభ్యర్థనకు స్పందించిన అమెరికా.. గత నెల 28న ముంబైలోని యూఎస్ కాన్సులేట్‌లో వారిని ఇంటర్వ్యూ చేసింది. ఈ సందర్భంగా వారికి అత్యవసర వీసాను యూఎస్ రాయబార కార్యాలయం అధికారులు మంజూరు చేశారు. దీంతో అదేరోజు నీలమ్ కుటుంబం యూఎస్ బయల్దేరి వెళ్లింది.

## మహా రాజకీయాల్లో కాకరేపుతున్న సర్పంచ్ హత్య కేసు.. మంత్రి పదవికి ధనంజయ్ ముండే రాజీనామా




**ముంబై-నవభూమి:** మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మంత్రివర్గంలోని కీలక నేత తన పదవికి రాజీనామా చేశారు. పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఉన్న ధనంజయ్ ముండే రిజైన్ చేశారు. సర్పంచ్ హత్య కేసులో ఆయనపై ఆరోపణలు రావడంతో సీఎం ఫడ్నవీస్ సూచనల మేరకు ధనంజయ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఆయన రాజీనామాను తాను ఆమోదించినట్లు సీఎం తెలిపారు. అనంతరం ఆ రాజీనామా పత్రాన్ని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు పంపినట్లు మీడియాకు తెలిపారు.కాగా, బీడ్‌సర్పంచ్ సంతోష్ దేశ్‌ముఖ్‌ను డిసెంబర్ 9న కొందరు దుండగులు కిడ్నాప్ చేసి హత్య చేశారు. ఈ హత్య స్థానిక రాజకీయాల్లో కలకలం రేపుతోంది.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 హైదరాబాద్ బుధవారం 5 మార్చి 2025

# నవచిత్ర



## టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్న 'దబాంగ్' బ్యూటీ





హిట్టు, ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేసుకుంటూ వెళుతున్నాడు సుధీర్ బాబు . గతేడాది హరోంహర, మా నాన్న సూపర్ హీరో సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాగా.. ఇవి మిక్స్‌డ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. దీంతో ఎలాగైన హిట్ కొట్టాలనే కసితో ప్రస్తుతం జటాధర అనే సినిమా చేస్తున్నాడు. మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాకి వెంకట్ కల్యాణ్ ) కథనందిస్తూ దర్శకత్వం వహిస్తుండగా.. తెలుగు, హిందీ బైలింగ్యువల్ ప్రాజెక్ట్‌గా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ సినిమాకు సంబంధించి ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాతో బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మార్చి 08 నుంచి సోనాక్షి జటాధర షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు సమాచారం. కాగా దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇటీవలే హీరమండి: డైమండ్ బజార్ అనే వెబ్ సిరీస్‌తో వచ్చి సూపర్ హిట్ అందుకుంది సోనాక్షి.

## స్టార్ హీరో మాజీ భార్యకు ఉపాసన ఆల్ ది బెస్ట్!







మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ భార్య ఉపాసన గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. దేశ విదేశాల్లో ఉన్న వ్యాపార సామ్రాజ్యంను నడిపిస్తూ, ఇంట్లో చరణ్‌కి భార్యగా, క్లింకారకి తల్లిగా, కుటుంబ నిర్వాహణ ఇలా ఎన్నో విధులు నిర్వర్తిస్తూ ఉంటారు. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఉపాసన ఇటీవల బాలీవుడ్ సూపర్ స్టార్ హృతిక్ రోషన్ మాజీ భార్య సుస్సాన్ ఖాన్‌కి ఆల్ ది బెస్ట్ చెప్పింది. ఉపాసనకి సుస్సాన్ ఖాన్‌తోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నాయా, ఉపాసనకు ఆమె కూడా స్నేహితురాలా అంటూ చాలా మంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో కామెంట్ చేస్తున్నారు. అసలు విషయం ఏంటంటే హృతిక్ రోషన్ మాజీ భార్య సుస్సాన్ ఖాన్ చాలా కాలంగా ఇంటీరియర్, ఫర్నీచర్ బ్రాండ్ ది చార్‌కోల్ ను రన్ చేస్తున్నారు. ఇప్పటి వరకు ముంబైకే పరిమితం అయిన సుస్సాన్ ఖాన్ చార్ కోల్ ప్రాజెక్ట్ ఇక మీదట హైదరాబాద్‌లోనూ కార్యకళాపాళను నిర్వహించేందుకు సిద్ధం అయింది. ఇప్పటికే అత్యంత ఖరీదైన ఏరియాలో ఆరు అంతస్తుల్లో భవనంను తీసుకోవడంతో పాటు వర్క్ మొదలు పెట్టారని సమాచారం అందుతోంది. హైదరాబాద్‌లో లగ్జరీ ఇంటీరియర్ వర్క్ కోసం, బ్రాండ్ ఫర్నీచర్ కోసం ది చార్ కోల్ సర్వీస్‌ను అందించబోతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఆ విషయాన్ని ఉపాసన సైతం సోషల్ మీడియా ద్వారా తెలియసేసింది. సుస్సాన్ ఖాన్ యొక్క కొత్త ప్రాజెక్ట్‌ను ప్రమోట్ చేస్తూ సోషల్ మీడియా ద్వారా ఉపాసన పోస్ట్ చేశారు. ది చార్ కోల్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌లో ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ఉపాసనకి ప్రత్యేకమైన గిఫ్ట్ ప్యాక్‌ను సుస్సాన్ ఖాన్ పంపించారు. ఆ ప్యాక్‌ను సోషల్ మీడియా ద్వారా షేర్ చేసిన ఉపాసన అందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ హైదరాబాద్‌లో ప్రారంభించిన చార్ కోల్ ప్రాజెక్ట్ విజయవంతం కావాలంటూ ఆకాక్షిస్తూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఉపాసన పోస్ట్ పెట్టడంతో చాలా మందికి చార్ కోల్ ప్రాజెక్ట్‌పై ఆసక్తి పెరిగింది. కనుక మంచి బిజినెస్ జరిగే అవకాశాలు ఉన్నాయి. సుస్సాన్ ఖాన్‌తో ఉన్న సన్నిహిత సంబంధాల కారణంగానే ది చార్‌కోల్ హైదరాబాద్ ప్రాజెక్ట్‌ను ఉపాసన ప్రమోట్ చేస్తున్నారు. ఉపాసన వంటి సెలబ్రెటీ ఒక్క పోస్ట్ పెట్టినా కచ్చితంగా చాలా పెద్ద రీచ్ ఉంటుంది. కనుక ఉపాసన పోస్ట్‌తో సుస్సాన్ ఖాన్ ది చార్ కోల్ హైదరాబాద్ ప్రాజెక్ట్ విజయవంతం అయినట్లే అనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. ఉపాసన తనకు నచ్చిన, తాను మెచ్చిన ప్రొడక్ట్స్‌కి మాత్రమే సపోర్ట్ చేస్తారు అనే టాక్ ఉంది. కనుక ది చార్ కోల్ ప్రాజెక్ట్‌కి మంచి స్పందన వచ్చే అవకాశాలు ఉన్నాయి. రామచరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు దర్శకత్వంలో సినిమాను చేస్తున్నారు. త్వరలోనే చరణ్ బర్త్ డే సందర్భంగా ఆ సినిమా ఫస్ట్ లుక్‌ను రివీల్ చేయడంతో పాటు టైటిల్‌ను అనౌన్స్ చేయబోతున్నారు.

## మహేష్ బాబుతో కలిసి నటించిన గుర్తింపు రాలేదు..





సినిమాలో నటించాలనే ఆసక్తి, కోరిక చాలా మందిలో ఉంటుంది. అయితే వచ్చిన అవకాశాలని కొందరు సద్వినియోగం చేసుకుంటారు. మరి కొందరికి అదృష్టం కలిసి రాక సైడ్ అయిపోతూ ఉంటారు. హీరోయిన్స్ విషయానికి వస్తే మంచి ఫేమ్ అందుకున్నాక ఉన్నన్ని రోజులు భారీగా సంపాదించే ప్రయత్నం చేస్తుంటారు. ఇక పెళ్లి తర్వాత ఎలాగు ఆఫర్స్ రావు కాబట్టి సైడ్ అయిపోతూ ఉంటారు. అయితే సూపర్ స్టార్ మహేష్ బాబు కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్న ఓ భామకి సక్సెస్ దక్కక చివరికి సీరియల్స్‌లో కూడా నటించింది. అయిన కూడా పెద్దగా సక్సెస్ కాలేక వేరే రంగంలో తన సత్తా చూపించింది. మయూరి కాంగో.. ఈ పేరు చెబితే ఎవరు పెద్దగా గుర్తు పట్టకపోవచ్చు.. కానీ మహేష్ నటించిన వంశీ సినిమా అంటే ఆమె రూపం కాస్త గుర్తుకు రావచ్చు. చిత్రంలో మహేష్ బాబు స్నేహితురాలిగా, ఓ మోడల్ పాత్రలో కనిపిస్తుంది. ఈ అమ్మడు ముందుగా బాలీవుడ్ లో తన సినిమా కెరీర్ ను ప్రారంభించింది. 1995లో నసీమ్ అనే హిందీ సినిమాలో తొలిసారి కనిపించింది. ఆ తర్వాత పాపా కెహెతే హై, బేటాబీ, హొగీ ప్యార్ కీ జీత్, మేరే అప్నే, బాదల్, పాపా ది గ్రేట్, జంగ్, శికారీ వంటి సినిమాలలో నటించి అలరించింది. అయితే ఆమె కెరీర్ సాఫీగానే సాగింది. సినిమాలు కూడా కొన్ని హిట్ అయ్యాయి. తర్వాత ఏమైందో ఏమో వరుస ఫ్లాపులు పలకరించాయి. ఇక సూపర్ స్టార్ మహేష్ బాబుతో వంశీ సినిమా చేసిన విజయం దక్కలేదు. దాంతో చివరికి సీరియల్స్ చేసింది. అక్కడ కూడా అదృష్టం దక్కకపోవడంతో చేసేదేమి లేక సినీ ఇండస్ట్రీకి గుడ్‌బై చెప్పింది మయూరి. ఇక 2003లో ఎన్ఆర్ఐ ఆదిత్య ఢిల్లాన్‌ను మ్యారేజ్ చేసుకొని న్యూయార్క్ వెళ్లి అక్కడే సెటిలైపోయింది. అక్కడి ప్రముఖ కాలేజ్ బరూచ్ కాలేజ్ జిక్లిన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎంబీఏ పూర్తి చేయగా, తన ప్రతిభతో ప్రముఖ గ్లోబల్ మీడియా ఏజెన్సీ పెర్ఫామిక్స్ అనే కంపెనీలో ఎండీ హోదా దక్కింది.

## అలాంటి వారితో స్నేహం చేయకండి: రాశీ ఖన్నా



ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన రాశీ ఖన్నా మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన రాశీ ఖన్నా మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ సినిమా సక్సెస్ అవడంతో అమ్మడికి వరుస ఆఫర్లు వచ్చాయి. తక్కువ కాలంలోనే పలు సినిమాల్లో నటించిన రాశీ ఖన్నా ప్రస్తుతం తెలుగు, తమిళ, హిందీ భాషల్లో సినిమాలు చేస్తోంది. రీసెంట్ గా రాశీ ఖన్నా తమిళ సినిమా అఘాతియాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోవడంలో విఫలమైంది. సినిమాలతో పాటూ సోషల్ మీడియాలో కూడా రాశీ యాక్టివ్ గా ఉంటుంది. ఫ్రెండ్‌షిప్ గురించి రాశీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరలవుతోంది. మంచి ఫ్రెండ్స్ ను ఎంచుకునేటప్పుడు జీవితంలో తను నేర్చుకున్న విషయాల గురించి రాశీ ఆ వీడియోలో తెలిపింది. మనం మంచి వారితో స్నేహం చేసినప్పుడు మాత్రమే అన్నీ కరెక్ట్ గా ఉంటాయని, మిమ్మల్ని ప్రతీ విషయంలో ముందుకు నడిపించే వారితోనే స్నేహం చేయండి తప్పించి ఏం చేసినా కిందకు తోసే వారితో స్నేహం చేయొద్దని చెప్పిన రాశీ, తనకు చాలా గొప్ప స్నేహితులున్నారని, వారే తన బలమని తెలిపింది. తన గురించి కంప్లైంట్ చేస్తూ, ఎప్పుడూ బిజీగా ఉన్నామని చెప్పే వ్యక్తులకు తన దగ్గర టైమ్ లేదని, పాజిటివిటీ ఉన్న వారితోనే తానెప్పుడూ ఉంటానని చెప్తోంది రాశీ. ఫ్రెండ్‌షిప్ విషయంలో రాశీ ముక్కు సూటితనం చూసి అందరూ ఆశ్చర్యపోతూ ఆ వీడియోను తెగ షేర్ చేస్తున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే రాశీ ఖన్నా ప్రస్తుతం తెలుగులో తెలుసు కదా అనే సినిమాలో నటిస్తోంది. స్టార్ బాయ్ సిద్దూ జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో రాశీ ఖన్నా కూడా ఓ హీరోయిన్ గా నటించనుండగా శ్రీనిధి శెట్టి మరో హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమాతో కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన దర్శకురాలిగా పరిచయం కాబోతుంది.

## బాలీవుడ్‌లో బడా నిర్మాణ సంస్థలో మాళవిక



తమిళ నటి మాళవిక మోహనన్ ఇప్పటివరకు తెలుగు సినిమాల్లో నటించింది లేదు. కానీ తెలుగు ఆడియన్స్ ను మాళవిక సుపరిచితురాలే. మాళవిక నటించిన ఎన్నో డబ్బింగ్ సినిమాలను తెలుగు ఆడియన్స్ ఇప్పటికే చూసేశారు. మాళవిక ఇండస్ట్రీలోకి వచ్చి ఆల్రెడీ పదేళ్లు దాటుతోంది. పదేళ్ల తర్వాత అమ్మడు ఇప్పుడు తెలుగులో సినిమా చేస్తుంది. మారుతి దర్శకత్వంలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ది రాజా సాబ్ సినిమాలో మాళవిక లీడ్ రోల్ లో నటిస్తోంది. రాజా సాబ్ తర్వాత మాళవికకు తెలుగులో మరిన్ని ఛాన్సులు క్యూ కడతాయని అందరూ అంటున్నారు. ఇదిలా ఉంటే మాళవిక గతేడాది యుద్ర అనే సినిమాతో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. సిద్ధాంత్ చతుర్వేది హీరోగా రూపొందిన ఈ సినిమా అనుకున్న స్థాయిలో ఆడియన్స్ ను మెప్పించలేకపోయింది. ఇదిలా ఉంటే మాళవిక ఇప్పుడు మరో బాలీవుడ్ సినిమాకు సైన్ చేసిందని వార్తలు వినిపిస్తున్నాయి. రొమాంటిక్ కామెడీ జానర్ లో రూపొందనున్న ఓ భారీ ప్రాజెక్టుకు మాళవిక సైన్ చేసినట్టు తెలుస్తోంది. ఓ భారీ నిర్మాణ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందని టాక్ వినిపిస్తోంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను చిత్ర మేకర్స్ అఫీషియల్ గా అనౌన్స్ చేయనున్నారని మాళవిక సన్నిహిత వర్గాలు చెప్తున్నాయి. ఆల్రెడీ తమిళంలో పలు సినిమాలు చేసిన మాళవిక మోహన్ లాల్ తో కలిసి హృదయపూర్వం చేస్తోంది. మొత్తానికి మాళవిక తెలుగు, తమిళం, మలయాళంతో పాటూ హిందీ భాషల్లో అవకాశాలు అందుకుంటూ ఆయా భాషల్లోని టాప్ స్టార్లతో కలిసి నటించే ఛాన్స్ కొట్టేసి తన సత్తా చాటుతుంది.

## రెజ్లర్ సుశీల్‌కుమార్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట..



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత స్టార్ రెజ్లర్ , ఒలింపియన్ సుశీల్ కుమార్ కు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. జూనియర్ రెజ్లర్ సాగర్ ధన్‌కర్ హత్య కేసులో సుశీల్ కుమార్‌కు రెగ్యులర్ బెయిల్ దక్కింది. జూనియర్ రెజ్లర్ సాగర్ ధన్‌కర్ 2021లో హత్యకు గురయ్యాడు. దాంతో పోలీసులు 2021 మే నెలలో సుశీల్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఇదే కేసులో గతంలో కూడా సుశీల్‌కు బెయిల్ దొరికింది. 2023 జూలైలో మోకాలి శస్త్రచికిత్స కోసం ఆయనకు 7 రోజులపాటు మధ్యంతర బెయిల్ లభించింది. మంగళవారం ఢిల్లీ హైకోర్టు రెగ్యులర్ బెయిల్ ఇచ్చింది. కాగా సుశీల్ కుమార్ ఒలింపిక్స్‌లో భారతదేశానికి రజత, కాంస్య పతకాలు అందించారు. సాగర్ ధన్‌కర్ హత్య కేసులో మొత్తం 18 మంది నిందితులుగా ఉన్నారు. వారిలో సుశీల్ కుమార్ కూడా ఒకరిగా ఉన్నాడు. కాగా ఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియం వద్ద 2021 మే 4న సాగర్‌తోపాటు అతని స్నేహితులు సోను, అమిత్ కుమార్‌లపై సుశీల్ కుమార్, అతని స్నేహితులు దాడి చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సాగర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సుశీల్‌కుమార్‌పై, అతని స్నేహితులపైన హత్య కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

## ట్రావిస్ హెడ్ ఔట్.. వికెట్ తీసిన వరుణ్..



**దుబాయ్-నవభూమి:** ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ .. 39 రన్స్ చేసి ఔటయ్యాడు. చాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్లో.. ఆస్ట్రేలియా రెండో వికెట్ కోల్పోయింది. స్పిన్నర్ వరున్ చక్రవర్తి.. ఖాతాలో ట్రావిస్ వికెట్ వెళ్లింది. భారీ షాట్‌కు ప్రయత్నించిన ట్రావిస్.. లాంగ్ ఆఫ్‌లో గిల్‌కు క్యాచ్ ఇచ్చాడు. ట్రావిస్ కొన్ని షాట్లతో అలరించాడు. షమీ వేసిన ఇన్నింగ్స్ అయిదో ఓవర్‌లో అతను హ్యాట్రిక్ ఫోర్లు కొట్టాడు. భారీ స్కోర్ దిశగా వెళ్తున్నట్లు కనిపించిన ట్రావిస్.. స్పిన్నర్ వరుణ్‌కు చిక్కాడు. 33 బంతుల్లో అయిదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 39 రన్స్ చేశాడు ట్రావిస్.

తాజా సమాచారం ప్రకారం ఆస్ట్రేలియా 11 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 66 రన్స్ చేసింది. స్మిత్, లబుషేన్ క్రీజ్‌లో ఉన్నారు.

# నవక్రీడ

## కంచిపట్టు చీరలో కండలరాణి.. ప్రీ వెడ్డింగ్ షూట్‌లో చిత్రా స్టన్నింగ్ లుక్..



**బెంగుళూరు-నవభూమి:** కర్నాటక బాడీబిల్డర్ చిత్రా పురుషోత్తం ఇప్పుడు ఇంటర్నెట్‌లో హాట్ టాపిక్ అయ్యారు. ఆ కండల రాణి.. తన పెళ్లి కోసం ప్రిపేరవుతున్నది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రీ వెడ్డింగ్ ఫోటో షూట్ అందర్నీ ఆకట్టుకుంటున్నది. కంచిపట్టు చీర కట్టి.. ఆ చీర కట్టులో కండల్ని ప్రదర్శిస్తున్న చిత్రా పిక్స్, వీడియోలు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి. ఎల్లో, బ్లూ రంగు పట్టు చీరలో చిత్ర చాలా సంప్రదాయమైన రీతిలో తన లుక్‌ను ప్రజెంట్ చేసింది.

అయితే బ్లౌజ్ లేకుండా ఉన్న ఆ పిక్స్‌లో .. బాడీబిల్డర్ చిత్ర తన కండ బలాన్ని చూపించింది. బాడీ బిల్డర్ చిత్ర..ఓ బ్యూటీ క్వీన్‌లా తయారైంది. బంగారు ఆభరణాలను ధరించింది. నెక్లెస్‌లు, చేతి గాజులు వేసుకున్నాయి. చెవి పోగులు కూడా ధరించింది. ఎర్రటి పెదవులతో .. తనలో పెళ్లి కళను ఆ లుక్‌తో ఆమె చాటుకున్నది. చాలా భిన్నమైన రీతిలో ఆ ప్రి వెడ్డింగ్ ఫోటోషూట్ జరిగింది. చిత్ర పోస్టు చేసిన తన వీడియోకు 34 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. ఇంకా చాలా మంది తమ రియాక్షన్స్‌తో థ్రిల్ చేశారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**